

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ
జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 113

శనివారం 7-1-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఎవర్ యూత్



ఫిట్ ఫుడ్

బొప్పాయి

దీనిలో చర్మానికి కావాల్సిన చాలా రకాల పోషకాలు ఉంటాయి కాబట్టి బొప్పాయి పండ్లను ప్రతి రోజూ తినడం మంచిది. బొప్పాయిలో యాంటీ ఏజింగ్ గుణాలు అధిక పరిమాణంలో ఉంటాయి కాబట్టి దీనిని తినడం వల్ల శరీరానికి అధిక పరిమాణం లో యాంటీ ఆక్సిడెంట్లు లభించి చర్మం ఆరోగ్యంగా మిలమిలలాడుతుంది. అంతేకాదు, అనేకరకాల చర్మ సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. బొప్పాయి గుజ్జును ఫేస్‌ప్యాక్‌లా వాడటం వల్ల ముఖం కాంతివంతంగా మారుతుంది.

ఆకు కూరలు

ఆకు కూరల్లో క్లోరోఫిల్ అధిక పరిమాణంలో లభిస్తుంది. కాబట్టి వీటిని ప్రతి రోజూ ఆహారంలో తీసుకోవడం వల్ల శరీరానికి చాలా రకాల ప్రయోజనాలు కలుగుతాయి. చర్మం ఆరోగ్యంగా, కళ్లు మెరుపులీనుతూ ఉండాలంటే ఆకుకూరలను ఆహారంలో తీసుకోవడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి. ఆకుకూరల వాడకం వల్ల ఏ లోపం లేకుండా శరీరానికి సమృద్ధిగా విటమిన్లు అందుతాయి. అంతేగాక అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. ముఖ్యంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడేవారికి మంచి ఫలితాలు లభిస్తాయి.



పాలు, బాదం

పాలలో ఉండే పోషకాల గురించి చిన్నప్పటినుంచి వింటున్నదే కాబటిట ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. ఇక బాదం పప్పును ఏ విధంగా తీసుకున్నా అందులో చర్మాన్ని యవ్వనంగా ఉంచే లక్షణాలున్నాయి కాబట్టి రోజూ గుప్పెడు బాదం పప్పు తీసుకోవడం చాలా మంచిది.

వయసు పెరిగే కొద్ది రకరకాల మార్పులు రావడం సహజం. ముఖ్యంగా ముఖంలో ముడతలు, ముఖం మెరుపు కోల్పోయి కళావిహీనం కావటం, కళ్లకింద ఉబ్బెత్తుగా ఉండటం, మంగు మచ్చలు వంటి సమస్యలు వస్తూ ఉంటాయి. వీటినుంచి ఉపశమనానికి, అందంగా కనిపించడానికి చాలా మంది మార్కెట్‌లో లభించే అనేకమైన కాస్మెటిక్ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. అయితే వీటి వినియోగం వల్ల పరిష్కారం లభించకపోగా అనేక రకాల అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటికి బదులుగా కొన్ని రకాల ఆహారాన్ని తీసుకుంటూ సహజసిద్ధమైన ఫేస్‌ప్యాక్‌లను వాడటం వల్ల శరీరం యవ్వనంగా తయారవుతుంది. అంతేకాకుండా చాలా రకాల చర్మసమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. అవేమిటో తెలుసుకుందాం...

ఫేషియల్ ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల ముడతలను సమర్థంగా నివారించవచ్చు. హాయిగా నవ్వేవాళ్లు ఎప్పుడూ ఆరోగ్యంగానే కాక అందంగాకూడా కనిపిస్తారు. వార్ధక్యం వీరిదరి చేరదా... అనిపించేలా ఉంటారు. నవ్వడం వల్ల ముఖంలోని కండరాలకు ఎక్సర్‌సైజ్ అంది రక్తప్రసరణ బాగా జరుగుతుంది. చర్మం పటుత్వంతో ఉంటుంది.

దానిమ్మ

దానిమ్మను ప్రతి రోజూ తీసుకోవడం వల్ల వృద్ధాప్యాన్ని ఆపడానికి సహాయపడుతుంది. చర్మం ఎక్కువ కాలం యవ్వనంగా ఉండాలంటే రోజూ ఆహారంలో దానిమ్మను వినియోగించాలి. దానిమ్మ రసాన్ని తాగడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. షుగర్ ఉన్న వారు కూడా దానిమ్మను నిరభ్యంతరంగా తీసుకోవచ్చు.



పెరుగు

శరీరానికి కావాల్సిన ప్రోబయోటిక్స్ అధిక పరిమాణంలో లభించాలంటే ఆహారంలో పెరుగు తప్పనిసరిగా ఉండాల్సిందే. పెరుగును ఫేస్ ప్యాక్‌గా కూడా వాడచ్చు. ప్రతి రోజూ పెరుగును ఆహారంలో తీసుకుంటే ముడతలు తొలగిపోవడంతోపాటు చర్మంపై రంధ్రాలు, మచ్చలు లేకుండా ముఖ చర్మం మృదువుగా తయారవుతుంది. పిల్లలకు చిన్నప్పటి నుంచి పెరుగు తినే అలవాటు చేయడం మంచిది.



పైన చెప్పుకున్న వాటిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల మందులు, సౌందర్య సాధనాలతో పనిలేకుండా యవ్వనంగా ఉండచ్చు.

● హెల్త్ టిప్స్

గుమ్మడి గింజల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియం ఇందులో ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. ఫ్యాటీ ఫిష్ తినడం వల్ల అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. చేపలలో ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి గుండెను ఫిట్‌గా ఉంచుతాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి.

కిడ్నీలో రాళ్లను తొలగించడంలో టొమాటో రసం బాగా ఉపయోగపడుతుంది. ఈ పరిస్థితిలో రెండు టమోటాలను కడిగి వాటిని మెత్తగా రుబ్బుకోవాలి. ఈ జ్యూస్‌లో ఉప్పు, మిరియాల పొడి కలిపి వెంటనే తాగాలి. కావాలంటే తయారు చేసుకున్న మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో ఉంచి జ్యూస్ రూపంలో తీసుకోవచ్చు.

అరకప్పు పెరుగులో చెంచా నిమ్మరసం, అర స్పూను ఉప్పు వేసి ఆ మిశ్రమాన్ని బాగా కలుపుకుని తాగాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

తులసి ఆకుల రసాన్ని తీసి దానికి ఒక చెంచా తేనె కలిపి ఈ మిశ్రమాన్ని ఉదయం, సాయంత్రం తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.

రుచిగా ఉంది కదా అని ఒకోసారి పులిహోర ఎక్కువగా తినేస్తుంటాం. ఫలితంగా కడుపు బరువుగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఆ ఫీలింగ్ తగ్గాలంటే పులిహోర తిన్న వెంటనే - గోరు వెచ్చని నీరు ఒక గ్లాసుడు తాగేస్తే తొందరగా జీర్ణం అవుతుంది. వేడి కూడ చేయదు.

పుదీనా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆహారంలో ఫ్యాట్ ఎక్కువగా ఉన్నప్పుడు ఏదో ఒక రూపంలో పుదీనా తీసుకుంటే అజీర్తి సమస్య ఉండదు.

పైత్యం, ఆ కారణంగా తలతిప్పటం వంటి సమస్యలున్నప్పుడు జీలకర్రను మెత్తగా గ్రైండ్ చేసి ఆ పేస్టును నీటిలో కలిపి తాగాలి. ఇలా రెండు రోజుల పాటు రోజుకు రెండుసార్లు చేయాలి.

పొట్టకి సంబంధించిన పలు సమస్యలకు వెల్లుల్లి మంచి మందు, ఒకటి రెండు రెబ్బల వెల్లుల్లిని మెత్తగా నూరి ఆ రసాన్ని అరకప్పు నీటిలో కలిపి తాగడం వల్ల అరుగుదల సమస్య దూరం అవుతుంది. దాంతోపాటు పొట్టలో పురుగులు, శరీరంలోని విషపదార్థాలు నశిస్తాయి. కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది.

పొద్దున లేవగానే ఖాళీ కడుపుతో యాపిల్ పండు తింటే తలనొప్పి సమస్య తలెత్తదు.

రోజు ఉదయాన్నే ఒక గ్లాసు నీటిలో ఒక్కొక్కటి నాలుగైదు చొప్పున తులసి, వేప ఆకులను, ఐదారు మిరియాలను వేసి మరిగించి తాగాలి. (హై బిపితో బాధపడుతన్న వాళ్లు మినహాయించాలి).

ప్రతి రోజు అల్లంతో చేసిన టీని తాగుతుంటే జీర్ణ సమస్యలు, గ్యాస్, కడుపులో మంట మొదలైన పొట్టకి సంబంధించిన సమస్యలు రాకుండా ఉంటాయి.

ప్రతిరోజు గోధుమ జావ తాగితే బీపీ ఉన్న వారికి మంచిది.

పెరిగే పిల్లలకు సోయాబీన్ మంచి పోషణని ఇస్తుంది. దేహదారుఢ్యానికి, పెరుగుదలకు దోహదం చేస్తుంది. శరీరం పెరుగుదలతో పాటు మెదడును వికసింపచేస్తుంది.



పొట్ట సమస్యలకు క్యారట్ జ్యూస్

పొట్ట సమస్యలతో బాధపడుతున్న వారికి క్యారెట్ జ్యూస్ ప్రభావవంతంగా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే గుణాలు శీతాకాలంలో వచ్చే పొట్ట సమస్యల నుంచి సులభంగా ఉపశమనం కలిగిస్తాయి. తరచు మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలతో బాధపడుతున్న వారు తప్పకుండా క్యారట్ జ్యూస్‌ను ప్రతిరోజు తాగాల్సి ఉంటుంది.

● క్యారట్ రసంలో విటమిన్ ఎ, సి, డి, కె మొదలైన అనేక రకాల విటమిన్లు లభిస్తాయి. కాబట్టి వీటిని ప్రతి రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి చాలా రకాల ప్రయోజనాలను చేకూర్చుతుంది. క్యారట్‌లో బీటా కెరోటిన్ అనే శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ అధిక పరిమాణంలో లభిస్తుంది. కాబట్టి శరీర బరువును నియంత్రించడానికి ప్రధాన పాత్ర పోషిస్తుంది.

● మలబద్ధకంతో బాధపడుతున్న వారికి క్యారట్ జ్యూస్ ప్రభావవంతంగా పని చేస్తుంది. ఇందులో ఉండే గుణాలు జీర్ణవ్యవస్థను శక్తిమంతంగా చేసి అనారోగ్య సమస్యల నుంచి శరీరాన్ని కాపాడతాయి. కాబట్టి పొట్ట సమస్యలు, బరువు తగ్గాలనుకునేవారు ప్రతి రోజూ ఖాళీ కడుపుతో క్యారట్ జ్యూస్ తీసుకోవడం మంచిది.



● మీకు తెలుసా

తల తిరగడం గుండె వైఫల్యానికి సంకేతంగా తీసుకోవాల్సి ఉంటుంది. గొంతు లేదా దవడలో నొప్పి కూడా గుండెపోటుకు సంకేతం. అయితే అన్ని నొప్పులు గుండెనొప్పులకి కారణమని చెప్పలేం. కొన్నిసార్లు ఇది జలుబు లేదా సైనస్ కారణంగా వస్తుంది. కానీ కొన్నిసార్లు ఛాతీ నొప్పి గొంతు నుంచి దవడకు వ్యాపిస్తుంది. ఇది చాలా ప్రమాదం. మీరు చాలా త్వరగా అలసిపోయినట్లనిపిస్తే బలహీనతగా భావించకండి. ఎందుకంటే ఇది కూడా గుండెపోటుకు కారణమయ్యే లక్షణాలలో ఒకటని గుర్తుంచుకుని, నిర్లక్ష్యం చేయకుండా వైద్యుని కలిసి తగిన పరీక్షలు చేయించుకుని ఏ సమస్యా లేదని తెలిస్తే నిశ్చింతగా ఉండవచ్చు.



సినిమా

జైలర్‌కు అతిథిగా...



● రజనీకాంత్

సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమాలో మలయాళ స్టార్ మోహన్‌లాల్ కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ 'జైలర్' సినిమాను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, రమ్యకృష్ణ ప్రధాన పాత్రల్లో, తమన్నా కీ రోల్ చేస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం చెన్నైలో జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో మోహన్‌లాల్ కూడా నటిస్తున్నట్లు తెలిసింది. మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించనునున్నారని, ఈ వారంలోనే షూటింగ్‌లో జాయిన్ అవుతారని కోలీవుడ్ సమాచారం. కాగా 'జైలర్' సినిమాను ఏప్రిల్ 14న విడుదల చేయాలని అనుకుంటున్నారు.




● మోహన్‌లాల్

మరో సవాల్



● విక్రమ్

ఎంచుకునే పాత్రల్లో వైవిధ్యం చూపించ డానికి హీరో విక్రమ్ ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటారు. సరికొత్త పాత్రలను చాలెంజ్‌గా తీసుకుని ఎంతో కష్టపడుతుంటారు. 'శివపుత్రుడు', 'ఐ', 'కోబ్రా' వంటి సినిమాల్లో విక్రమ్ చేసిన పాత్రలే ఇందుకు ఉదాహరణ. కాగా ప్రేక్షకులను మరోసారి అబ్బురపరిచేందుకు విక్రమ్ మరో సవాల్‌లాంటి పాత్ర చేస్తున్నారు. విక్రమ్ హీరోగా 'కబాలి' ఫేమ్ పా. రంజిత్ దర్శకత్వంలో 'తంగలాన్' అనే సినిమా తెరకెక్కుతోంది. పీరియాడికల్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో విక్రమ్ ఓ గిరిజన తెగ నాయకుడి పాత్రలో నటిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ పాత్ర కోసం విక్రమ్ ప్రోస్థటిక్ మేకప్ వేసుకుంటున్నారు. ఈ మేకప్‌కి నాలుగు గంటలు పడుతోందట. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చెన్నైలో జరుగుతోంది. తదుపరి షెడ్యూల్‌ను కర్ణాటకలో ప్లాన్ చేశారు. పార్వతీ మీనన్, మాళవికా మోహనన్, పశుపతి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలని చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది.



● నాగచైతన్య

చివరి షెడ్యూల్ షురూ

'బంగార్రాజు' వంటి హిట్ చిత్రం తర్వాత అక్కినేని నాగచైతన్య, కృతీ శెట్టి జంటగా నటిస్తున్న ద్వితీయ చిత్రం 'కస్టడీ'. వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెలుగు-తమిళ భాషల్లో ఈ చిత్రం రూపొందుతోంది. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. కాగా ఈ చిత్రం చివరి షెడ్యూల్‌ని శుక్రవారం ప్రారంభించారు. ''నాగచైతన్య కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రాల్లో మా 'కస్టడీ' ఒకటి. కొత్త సంవత్సరం కానుకగా విడుదలైన గ్లింప్స్‌లో నాగచైతన్య ఫెరోషియస్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో అరవింద్ స్వామి విలన్ పాత్రలో నటిస్తుండగా, ప్రియమణి పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న చివరి షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. ఈ సినిమాని ఈ ఏడాది మే 12న విడుదల చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, యువన్ శంకర్ రాజా, కెమెరా: ఎస్ఆర్ కదిర్, సమర్పణ: పవన్ కుమార్.

శర్వానంద్ పెళ్లి ఫిక్స్



హీరో శర్వానంద్ బ్యాచిలర్ లైఫ్‌కి బై బై చెప్పనున్నారు. త్వరలోనే ఫ్యామిలీ లైఫ్‌కి హాయ్ చెప్పేందుకు రెడీ అవుతున్నారు. అమెరికాలో స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో ఆయన ఏడడుగులు వేయనున్నారు. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న అమ్మాయితో కొత్త జీవితంలోకి అడుగు పెట్టేందుకు రెడీ అవుతున్నారని తెలిసింది. ఈ నెల 26న శర్వానంద్ నిశ్చితార్థం జరగనుంది. ఏప్రిల్‌లో వీరి పెళ్లికి ముహూర్తం ఖరారు చేశారు.. పెళ్లి తేదీని 26న ప్రకటించే అవకాశం ఉంది. ఇది పెద్దలు కుదిర్చిన వివాహం అని సమాచారం.



● తమన్నా

యువరాణి

పదిహేనేళ్లకు పైగా అగ్ర కథానాయికల్లో ఒకరిగా రాణిస్తున్న తమన్నా తొలిసారి ఓ మలయాళ సినిమా చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మలయాళ హిట్ ఫిల్మ్ 'రామ్‌లీల' (2017) తర్వాత హీరో దిలీప్, దర్శకుడు అరుణ్ గోపీ కాంబినేషన్‌లో తాజాగా మరో సినిమా తెరకెక్కుతోంది. 'బాంద్రా' అనే టైటిల్ అనుకుంటున్నారు. ఇందులో తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆమె కెరీర్‌లో ఇదే తొలి మలయాళ సినిమా. కాగా కొచ్చిలో జరుగుతున్న ఈ సినిమా షూటింగ్‌లో తమన్నా పాల్గొననున్నారు. ఈ నెల 20 నుంచి తమన్నా ఈ సినిమా షెడ్యూల్‌లో జాయిన్ అవుతారట. ఆ తర్వాత ముంబై లొకేషన్స్‌లో మరో షెడ్యూల్‌ను ప్లాన్ చేసిందట చిత్ర యూనిట్. కాగా ఈ సినిమాలో తమన్నా యువరాణి తరహా పాత్ర చేస్తున్నారని టాక్. ఈ పాత్ర మలయాళం, హిందీ భాషలు మాట్లాడుతుందట. కొచ్చితో పాటు ముంబై నేపథ్యంలోనూ సినిమా సాగుతుందని సమాచారం. ఈ సంగతి ఇలా ఉంచితే.. నటుడు విజయ్ వర్మతో తమన్నా ప్రేమలో ఉన్నారనే వార్త వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల కొత్త సంవత్సరాన్ని ఈ ఇద్దరూ గోవాలో జరుపుకున్నారంటూ కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఈ వార్త గురించి ఇటు తమన్నా కానీ అటు విజయ్ వర్మ కానీ స్పందించలేదు.

ఆర్ట్ డైరెక్టర్ సునీల్ మృతి



ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్, ప్రొడక్షన్ డిజైనర్ సునీల్ బాబు (50) మృతి చెందారు. గురువారం అర్ధరాత్రి ఆయనకి గుండెపోటు రావడంతో కేరళలోని ఎర్నాకుళంలో తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. మలయాళ, తెలుగు, తమిళ, హిందీ భాషల్లో పలు చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా చేశారు సునీల్ బాబు. తెలుగులో 'రామయ్యా వస్తావయ్యా, మహర్షి, లక్ష్య, సీతారామం', తమిళంలో 'గజినీ, బెంగుళూరు డేస్' వంటి పలు చిత్రాలకు పని చేశారాయన. సునీల్ బాబు చేసిన తాజా చిత్రం 'వారసుడు' (తమిళంలో 'వారిసు') ఈ నెల 11న విడుదల కానుంది. కాగా ప్రభాస్-దీపికా పదుకోన్ జంటగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'ప్రాజెక్ట్ కె' చిత్రానికి కూడా సునీల్ పని చేస్తున్నారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సునీల్ బాబు మృతిపట్ల హీరో దుల్కర్ సల్మాన్, డైరెక్టర్ హను రాఘవపూడి, వైజయంతీ మూవీస్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు నివాళి అర్పిస్తూ, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

వేసవిలో చోరుడు



● 'చోరుడు'లో ఓ దృశ్యం

జీవీ ప్రకాశ్, ఇవానా జంటగా ప్రముఖ దర్శకుడు భారతీరాజా ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'చోరుడు'. పీవీ శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు సినిమాటోగ్రఫీ అందించారు. ఢిల్లీ బాబు నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హీరో ధనుష్ విడుదల చేశారు. పోస్టర్ చూస్తుంటే ఈ చిత్ర కథ అటవీ నేపథ్యంలో ఉంటుందని తెలుస్తోంది. సినిమాని వేసవిలో రిలీజ్ చేయనున్నట్లు పోస్టర్ ద్వారా తెలియజేశారు. ''అడ్వెంచర్, థ్రిల్లర్ అంశాలతో కూడిన కామెడీ డ్రామా 'చోరుడు'. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే ట్రైలర్, ఆడియో, సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పూర్ణేష్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కె.వి. దురై.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 113

శనివారం 7-1-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



చెస్ గ్రాండ్ మాస్టర్‌గా ప్రణేశ్

రిల్టన్ కప్‌లో విజేతగా నిలిచిన 16 ఏళ్ల భారత కుర్రాడు - 11లో



ఇక బ్యాంక్‌కు వెళ్లక్కర్లేదు

ప్రత్యామ్నాయ మార్గాల్లో రీ-కేవైసీ.. స్పష్టం చేసిన రిజర్వ్‌బ్యాంక్ - 11లో



కేంద్రం తీరు ఆందోళనకరం

జడ్జిల నియామకాలపై కొలీజియం సిఫార్సుల ఆమోదంలో కేంద్రం తీరు ఆందోళనకరంగా ఉందని సుప్రీం వ్యాఖ్యానించింది.

వివరాలు 6లో ▸



ఢిల్లీ కేసులో మరో ఇద్దరి అరెస్టు

దేశ రాజధాని ఢిల్లీలోని బైక్‌పై ఉన్న మహిళను ఢీకొట్టి, 12 కిలోమీటర్లు లాక్కెళ్లిన కేసులో మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు

వివరాలు 6లో ▸



ట్విటర్‌పై హ్యాకర్ల పంజా

సామాజిక మాధ్యమం ట్విటర్‌పై హ్యాకర్లు దాడి చేసి 20 కోట్ల మందికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని అపహరించారు.

వివరాలు 6లో ▸



2 రకాల భారత్‌లు కనిపిస్తున్నాయ్

ప్రధాని మోదీ ఏలుబడిలో రెండు రకాల భారత్‌లు కనిపిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

9న పీఎం జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా



యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ఈ నెల 9న దేశవ్యాప్తంగా 242 జిల్లాల్లో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాను కేంద్రం నిర్వహించనుంది. ఈ మేళాను ఏపీలోని 9 జిల్లాల్లో, తెలంగాణలోని 6 జిల్లాల్లో నిర్వహించనున్నారు.

వివరాలు 5 ▸

ఎంసీడీలో రగడ



మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ(ఎంసీడీ) సమావేశంలో ఆప్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మేయర్, డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోకుండానే సభ వాయిదా పడింది. ఎన్నికైన కౌన్సిలర్లతో కాకుండా, నామినేట్ అయిన సభ్యులతో ప్రమాణ స్వీకారంతో సభలో రగడ జరిగింది.

వివరాలు 6 ▸

'గీతం' ఆక్రమణలోని ప్రభుత్వ భూమి స్వాధీనం



గీతం వైద్య కళాశాల ఆవరణలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు శుక్రవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. అందులో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటుచేశారు. ఇక్కడ సర్వే నంబర్–17లో మొత్తం 14 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో గుర్తించారు.

వివరాలు 5 ▸

రూ.47 కోట్ల డ్రగ్స్ పట్టివేత



ముంబై విమానాశ్రయంలో శుక్రవారం ఇద్దరి నుంచి అధికారులు రూ.47 కోట్ల విలువైన కొకైన్, హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. కస్టమ్స్ అధికారుల తనిఖీల్లో ఒక వ్యక్తి వద్ద రూ.31.29 కోట్ల ఖరీదు చేసే 4.47 కిలోల హెరాయిన్, మరొకరి వద్ద రూ.15.96 కోట్లుండే 1.596 కిలోల కొకైన్ దొరికింది.

వివరాలు 6 ▸

సామాన్యుడికి

ఆధునిక వైద్యం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు

గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సందేశం

- చదివి వినిపించిన మంత్రి విడదల రజిని
- విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌తో దేశానికే ఏపీ ఆదర్శం.. వైద్య ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో అధిక నిధులు
- జిల్లాకో వైద్యకాలేజీ.. 47,191 మంది వైద్యులు, సిబ్బంది నియామకం
- 2,225 ఎంప్యానల్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద 3,255 వైద్య ప్రక్రియలు
- ఇందుకోసం ఏటా రూ.3,300 కోట్లు
- చికిత్స అనంతరం 'ఆరోగ్య ఆసరా' కింద రోజుకు రూ.225 సాయం
- వైద్యం విషయంలో ప్రభుత్వం తమ వెనకే ఉందని సామాన్యులకు భరోసా
- ఈ ప్రయత్నంలో వైద్యులూ పాలుపంచుకోవాలి



సదస్సును ఆరంభిస్తూ.. సీఎం వైఎస్ జగన్ పంపిన సందేశాన్ని చదివి వినిపిస్తున్న మంత్రి విడదల రజిని

సాక్షి, విశాఖపట్నం: సామాన్యుల ఆరోగ్య సంరక్షణకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. శుక్రవారం విశాఖలోని ఓ హోటల్‌లో మూడు రోజుల పాటు జరిగే భారతీయ సంతతికి చెందిన అమెరికన్ వైద్యుల సంఘం (ఏఏపీఐ) నిర్వహించిన 16వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌కు ఆయన తన సందేశం

మిగతా 2వ పేజీలో ▶

ఫోర్త్ వేవ్ వచ్చినా భయం లేదు

- ఏపీలో వైద్య ఆరోగ్య రంగానికి ప్రాధాన్యత భేష్
- డబ్ల్యూహెచ్‌వో మాజీ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్



2లో

గ్రూప్-2 మెయిన్స్‌లో ఇక రెండు పేపర్లే

స్క్రీనింగ్ టెస్టుగా జనరల్ స్టడీస్–మెంటల్ ఎబిలిటీ

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రూప్-2 పోస్టులకు నిర్వహించే పరీక్ష విధానంలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసింది. ఇప్పటివరకు గ్రూప్-2 మెయిన్స్‌ను మూడు పేపర్లలో నిర్వహిస్తుండగా వాటిని రెండుకు కుదించింది. ఈ మేరకు శుక్రవారం జీవో 6ను విడుదల చేసింది. పరీక్ష విధానం, సిలబస్‌పై నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వీటిని ఆమోదిస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో గ్రూప్–2 స్క్రీనింగ్ టెస్టును 150 మార్కులకు నిర్వహించేవారు. మెయిన్స్‌లో పేపర్–1 జనరల్ స్టడీస్ ఉండేది. అలాగే మరో రెండు పేపర్లుండేవి. పేపర్‌కు 150 చొప్పున 450 మార్కులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించేవారు. ఈసారి నుంచి ఈ విధానంలో మార్పులు చేశారు. గతంలో మెయిన్స్‌లో పేపర్–1గా ఉన్న జనరల్ స్టడీస్‌ను రద్దు చేసి దాన్ని స్క్రీనింగ్ టెస్టుకు మార్చారు. దీన్ని గతంలో మాదిరిగానే 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇక మెయిన్స్‌ను రెండు పేపర్లకు తగ్గిస్తారు. ఒక్కో పేపర్‌కు 150 చొప్పున 300 మార్కులు ఉంటాయి. ఈ క్రమంలో మెయిన్స్ సిలబస్ అంశాల్లోనూ మార్పులు చేశారు.

కొత్త విధానం ప్రకారం.. గ్రూప్-2 పరీక్ష, సిలబస్ మార్పులు ఇలా..

స్క్రీనింగ్ టెస్ట్:	మెయిన్ పరీక్షలు పేపర్-1:	మెయిన్ పరీక్షలు పేపర్-2:
జనరల్ స్టడీస్ -మెంటల్ ఎబిలిటీ	1. సోషల్ హిస్టరీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఏపీ సామాజిక చరిత్ర, సాంస్కృతోద్యమాలు) 2. జనరల్ ఓవర్ వ్యూ ఆఫ్ ద ఇండియన్ కాన్‌స్టిట్యూషన్	1. ఇండియన్ ఎకానమీ అండ్ ఏపీ ఎకానమీ 2. సైన్స్ అండ్ టెక్నాలజీ
150 మార్కులు	150 మార్కులు	150 మార్కులు

రీజనల్ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



ప్రతి సచివాలయం ఒక రిజిస్ట్రార్ ఆఫీస్

- మరింత పారదర్శకంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు
- 70 ఏళ్లుగా ఎవ్వరూ చేయని సాహసం ఈ ప్రభుత్వం చేస్తోంది
- రెవెన్యూ శాఖలో సత్ఫలితాలిస్తున్న సంస్కరణలు
- రీసర్వేతో ఇంటి స్థలాలు, 22ఏ, చుక్కల భూముల వివాదాల పరిష్కారం
- రెవెన్యూ ప్రాంతీయ సదస్సులో మంత్రి ధర్మాన ప్రసాదరావు
- తదుపరి సదస్సు విశాఖలో ఏర్పాటు చేస్తామని వెల్లడి

2 లో

వేగంగా 'ప్రాధాన్యత' పనులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రాధాన్యత పనులు గుర్తిస్తున్న ప్రజాప్రతినిధులు
- సచివాలయాల పరిధిలో రూ.1002.34 కోట్ల విలువైన 25,934 పనుల గుర్తింపు
- రూ.922.88 కోట్ల విలువైన 23,845 పనులకు అనుమతి
- ఇందులో రూ.758 కోట్ల విలువైన 20,408 పనులు ప్రారంభం
- ఇప్పటికే రూ.32.15 కోట్ల విలువైన 813 పనులు పూర్తి

5 లో

కోచింగ్‌కు కుమ్మరిస్తున్నారు!!

కరోనా తర్వాత ప్రైవేటు ట్యూషన్లకు పెరిగిన డిమాండ్

- పిల్లలకు మంచి చదువుల కోసం ట్యూషన్లలో చేర్పిస్తున్న తల్లిదండ్రులు
- ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు అన్ని తరగతులకూ ట్యూషన్లు
- నెలకు రూ.2 వేల నుంచి 5 వేల వరకు ఫీజులు
- మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టుల టీచర్లకు డిమాండ్

- వివరాలు 2లో





వాహనం పైకి ఎక్కి మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు

సీఎం.. నిన్ను భూ స్థాపితం చేస్తా

- నీ పార్టీని బంగాళాఖాతంలో కలిపేస్తా
- కుప్పం నియోజవర్గం గుడుపల్లెలో ప్రతిపక్ష నేత చంద్రబాబు ధ్వజం
- ప్రచార రథం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 300 మీటర్లు కాలినడక
- అనంతరం రోడ్డుపై బైఠాయింపు.. తర్వాత వ్యాన్ పైకి ఎక్కి ప్రసంగం
- అడుగడుగునా పోలీసులకు హెచ్చరికలు
- జనం కరువు.. చివరి రోజూ షో పేలవం

5 లో

ఇదం జగత్



కాల్పుల విరమణ అర్జంటుగా పాటించాల్సింది మనం కాదు్సార్.. వాళ్లు!!

ఆదరణ ఉంటే సందుల్లో సభలేల?

- బాబుకు నిజంగానే ప్రజాబలం ఉంటే మైదానంలో సభ పెట్టాలి: సజ్జల రామకృష్ణారెడ్డి
- ప్రజల ప్రాణాలను కాపాడేందుకే జీవో 1 జారీ
- రహదారులపై సభలను మాత్రమే నిషేధించాం
- పోలీసుల సూచనల మేరకే సీఎం జగన్ మీటింగులు
- ప్రభుత్వ అవసరాన్ని బట్టే సలహాదారుల నియామకం
- కన్సల్టెంట్ల పేరుతో గత సర్కారు రూ.వందల కోట్ల దోపిడీ



సాక్షి, అమరావతి: 'ప్రజల ప్రాణాలను రక్షించడం ప్రభుత్వ బాధ్యత. ప్రజలకు ఇబ్బంది కలిగేలా రోడ్లపై సభలు సరికాదు' అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పోలీస్ యాక్ట్‌కు లోబడి, ప్రజల ప్రాణాలను పరిరక్షించే బాధ్యతలో భాగంగానే ప్రభుత్వం జీవో 1 జారీ చేసిందన్నారు. ఇది రాష్ట్రంలో అన్ని పార్టీలకూ వర్తిస్తుందని స్పష్టం చేశారు. కందుకూరు, గుంటూరులో చోటు చేసుకున్న విషాదాలకు బాధ్యత వహించాల్సిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వారం రోజులుగా డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఉన్మాదిలా ప్రవర్తిస్తున్నారని, ఆయనకు కనీస సంస్కారం లేదని మండిపడ్డారు. ఆయన సభలకు పోలీసులు ఎక్కడా అడ్డుకోలేదని, నిబంధనలు పాటించాలని

మిగతా 5వ పేజీలో ▶


బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా గుండెపూడిలో సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ అవ్వను అడుగుతున్న మంత్రి పినిపే విశ్వరూప్


ఏలూరు 42వ డివిజన్‌లో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని


కర్నూలు జిల్లా రచ్చమర్రి గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి


విజయనగరం ఒకటో డివిజన్‌లో మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

కోచింగ్‌కు కుమ్మరిస్తున్నారు!!

- కరోనా తర్వాత ప్రైవేటు ట్యూషన్లకు పెరిగిన డిమాండ్
- పిల్లలకు మంచి చదువుల కోసం ట్యూషన్లలో చేర్పిస్తున్న తల్లిదండ్రులు
- ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు అన్ని తరగతులకూ ట్యూషన్లు
- నెలకు రూ.2 వేల నుంచి 5 వేల వరకు ఫీజులు
- మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టుల టీచర్లకు డిమాండ్



సాక్షి, అమరావతి: పిల్లలకు పాఠశాలల చదువులతో పాటు ప్రైవేటు ట్యూషన్లు ఇటీవలి కాలంలో భారీగా పెరుగుతున్నాయి. కరోనాకు ముందు కొంత శాతం మంది పిల్లలకే పరిమితంగా ఉన్న ఈ ట్యూషన్లను ఇప్పుడు 70 శాతం మంది ఆశ్రయిస్తున్నారు. అంతకంతకూ పెరుగుతున్న పోటీ వాతావరణం, పిల్లలు స్కూల్ నుంచి వచ్చాక టీవీలు, ఫోన్లు, ట్యాబ్‌లకు అతుక్కుపోవడం, ఇంట్లో పిల్లల అల్లరిని భరించలేకపోవడం, తమ పిల్లలు మిగిలిన వారికంటే ముందుండాలనే తల్లిదండ్రుల తాపత్రయం వంటి కారణాలతో ప్రైవేటు ట్యూషన్లకు గతంలో కంటే ఇప్పుడు ఆదరణ పెరిగింది. ఉపాధ్యాయులు సైతం తమకు స్కూల్‌లో వస్తున్న జీతం కంటే ట్యూషన్ల ద్వారానే ఎక్కువ సంపాదిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. దంపతులు ఇద్దరూ టీచర్లే అయితే ఇక చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం ఎల్‌కేజీ పిల్లల నుంచి ఇంటర్ వరకు ప్రైవేటు ట్యూషన్లను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా మ్యాథ్స్, ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి సబ్జెక్టులను చెప్పగలిగేవారికి మంచి డిమాండ్ ఉంది.

భారీగా ఖర్చు చేస్తున్న తల్లిదండ్రులు..

ప్రస్తుతం భార్యాభర్తల్లో చాలామంది ఇద్దరూ ఉద్యోగాలు లేదా ఏదో ఒక పనిచేసేవారే. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులకు తమ పిల్లల చదువులను పట్టించుకోగల తీరిక, సమయం ఉండటం లేదు. ఉన్నా పిల్లల సందేహాలకు సమాధానాలు ఇవ్వగల పరిజ్ఞానం కరువవుతోంది. దీంతో పిల్లలు స్కూల్ నుంచి వచ్చాక వారిని ప్రైవేటు ట్యూషన్లకు పంపుతున్నారు. ఇందుకు నెలకు భారీ మొత్తమే అవుతున్నా తల్లిదండ్రులు వెనుకడుగు వేయడం లేదు. ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ఏన్యువల్ సర్వే రిపోర్టు ఆన్ ఎడ్యుకేషన్ (అసర్)–2021 నివేదిక ప్రకారం.. తల్లిదండ్రులు పాఠశాలల చదువులపైనే కాకుండా ప్రైవేటు ట్యూషన్లపైన కూడా ఎక్కువ ఖర్చు చేస్తుండటం గమనార్హం.

కరోనా తెచ్చిన మార్పు..

కరోనా సమయంలో స్కూళ్లు మూతపడి పిల్లలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో వారి చదువు సరిగా సాగలేదు. ఆన్‌లైన్ క్లాసులు కూడా అంతంత మాత్రంగానే సాగాయి. దీంతో పిల్లల అభ్యసనం కొంతమేర దెబ్బతింది. దీన్ని అధిగమించేందుకు తల్లిదండ్రులు ప్రైవేటు ట్యూషన్లను ఆశ్రయిస్తున్నారు. 25 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రథమ్ సంస్థ చేసిన సర్వే ప్రకారం.. 40 శాతం మంది పాఠశాల విద్యార్థులు ట్యూషన్‌కి వెళ్తుండగా ఇప్పుడా సంఖ్య మరింత పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. 2020 32.5 శాతం, 2018లో 28.6 శాతం ఉండగా ఇప్పుడది రెట్టింపు అయ్యిందని ప్రథమ్ సర్వే పేర్కొంది.

పాఠశాలలూ కారణమే..

కాగా ట్యూషన్లు పెరిగిపోవడానికి పాఠశాలల్లో కొందరు టీచర్లు సరిగా బోధించలేకపోవడం కూడా కారణమేనంటున్నారు. పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయులు బోధనపై కన్నా ఇతర వ్యాపకాలపై దృష్టి పెడుతుండడంతో పిల్లలకు సరైన బోధన అందడం లేదంటున్నారు. ఈ పరిస్థితి నుంచి తమ పిల్లలను గట్టెక్కించేందుకు తల్లిదండ్రులు ట్యూషన్లకు పంపుతున్నారని సర్వే నివేదికలు పేర్కొంటున్నాయి. రిజిస్టర్డ్ ట్యుటోరియల్ సంస్థలు వేళ్ల మీద మాత్రమే ఉండగా అనేక వేల ట్యూషన్ సంస్థలు ప్రతి వీధిలో దర్శనమిస్తున్నాయి. ట్యూషన్ కోసం తన వద్దకు వచ్చే విద్యార్థుల్లో 30 నుంచి 40 శాతం పెరుగుదల ఉందని విజయవాడలో ట్యుటోరియల్ తరగతులు నిర్వహిస్తున్న నిపుణుడొకరు వివరించారు. 1–12 తరగతులకు విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక స్థితిని బట్టి నెలకు 2 వేల నుంచి 5 వేల వరకు ఫీజుగా తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. తమ పిల్లలకు మంచిగా చెప్పాలే కానీ అధికమొత్తం ఇచ్చేందుకు కూడా తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారన్నారు.

హోమ్ ట్యూషన్లకూ పెరిగిన డిమాండ్..

ఇటీవల కాలంలో ప్రత్యేకంగా పిల్లలకు తల్లిదండ్రులు తమ ఇంటిలోనే హోమ్ ట్యూషన్లు చెప్పిస్తున్నారు. ఇందుకు టీచర్లు భారీగా డిమాండ్ చేస్తున్నా తల్లిదండ్రులు వెనక్కి తగ్గడం లేదు. ముఖ్యంగా ఆడపిల్లలను ట్యూషన్లకు పంపడం ఇష్టం లేనివారు తమ ఇళ్లవద్దే హోమ్ ట్యూషన్లు చెప్పిస్తున్నారు.

మధ్య, ఎగువ మధ్య తరగతి వారే ఎక్కువ..

కాగా ప్రైవేటు ట్యూషన్లకు వెళ్తున్నవారిలో మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి పిల్లలే ఎక్కువగా ఉంటున్నారని ప్రథమ్ సర్వే తెలిపింది. పాఠశాలల చదువులతో సమానంగా, కొన్నిసార్లు అంతకంటే ఎక్కువ మొత్తాలను తల్లిదండ్రులు ట్యూషన్ ఫీజుల కింద చెల్లిస్తున్నారు. ఈ ఫీజులు ఆయా ట్యూషన్ టీచర్లు, ట్యుటోరియల్ సంస్థలకు ఉన్న డిమాండ్‌ను అనుసరించి ఉన్నా నెలకు రూ.5 వేలకు తక్కువ కాకుండా ఒక్కో విద్యార్థి నుంచి వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. కొన్ని చోట్ల ఇది ఇంకా ఎక్కువగా కూడా ఉంటోందని పేర్కొంటున్నారు. కింది తరగతుల్లో తక్కువ ఫీజులున్నా ఇంటర్ స్థాయిలో ఈ ట్యూషన్ ఫీజుల భారం తడిసి మోపెడవుతోంది. నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్) –2017–18 సర్వే ప్రకారం.. దేశంలో దాదాపు 20 శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ ట్యూషన్‌లను ఆశ్రయించారు. ట్యూషన్ల మీద సగటు కుటుంబ వ్యయం వాటా 12 నుంచి 15 శాతం వరకు ఉంది. ఆ తర్వాత కొంతమేర తగ్గినా కరోనా అనంతరం ఇది భారీగా పెరిగింది.

ప్రతి సచివాలయం ఒక రిజిస్ట్రార్ ఆఫీస్

రెవెన్యూ ప్రాంతీయ సదస్సులో మంత్రి ధర్మాన ప్రసాదరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతి గ్రామ, వార్డు, సచివాలయం ఒక రిజిస్ట్రార్ కార్యాలయంగా మారబోతోందని, తద్వారా మరింత పారదర్శకంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరుగుతాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రెవెన్యూ శాఖలో అనేక సంస్కరణలు చేపట్టి, సత్ఫలితాలను సాధిస్తోందని తెలిపారు. ఈ సంస్కరణల ద్వారా 70 ఏళ్లుగా ఏ ప్రభుత్వమూ చేయని సాహసం వైఎస్ జగన్ ప్రభుత్వం చేస్తోందన్నారు. వీటి ద్వారా ప్రజలకు మరింత పారదర్శకమైన, సమర్థవంతమైన, వివాదరహితమైన సేవలు అందుతున్నాయని వివరించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం (రీసర్వే) ద్వారా అనేక భూముల వివాదాలను ప్రభుత్వం పరిష్కరిస్తోందని తెలిపారు. శుక్రవారం విజయవాడలో జరిగిన కోస్తాంధ్ర జిల్లాల రెవెన్యూ అధికారుల ప్రాంతీయ సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. పరిపాలన వికేంద్రీకరణ అంటే ఏమిటో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతల్లో చూపించారని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థతో ప్రజల ముంగిటకే పారదర్శక పాలన తెచ్చారని, దీన్ని ప్రజలు ఎంతగానో స్వాగతిస్తున్నారని చెప్పారు. అసైన్డ్ భూములపై అధ్యయనానికి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక కమిటీని నియమించారని, ఈ కమిటీ ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి నివేదిక సమర్పించాక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. భూముల రీసర్వే ప్రక్రియ ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయని సాహసోపేతమైన నిర్ణయమన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూముల రీసర్వేలో జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారుల చొరవ అభినందనీయమని అన్నారు. భూ వివాదాలు పరిష్కారమవుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలవారికి సొంతింటి కలను నెరవేరుస్తున్నామని 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించామని వివరించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం (రీసర్వే), ఇళ్ల పట్టాల పంపిణీ, 22ఏ కేసులు, చుక్కల భూముల వివాదాలు, సాదా బైనమా, ఆర్వోఆర్, ఆర్వోఎస్ఆర్ పట్టా, నాలా, ఆక్రమణ భూముల క్రమబద్ధీకరణ, అనాధీన భూములు, ఈ–పంట తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించి, రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించనున్నట్లు మంత్రి వివరించారు. రెవెన్యూ శాఖకు జవసత్వాలను తీసుకొచ్చి సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ప్రజల అవసరాలను తీర్చాలనే ఏకైక లక్ష్యంగా పని చేద్దామన్నారు. వెబ్‌ల్యాండ్ ఎంట్రీలపై గతంలో కొన్ని విమర్శలు వచ్చేవని, రిజిస్ట్రేషన్ అయిన రోజే ఆటోమ్యుటేషన్ చేసి విమర్శలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ధర్మాన స్పష్టం చేశారు. ఇప్పటికే తిరుపతి, విజయవాడల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, తర్వాతి సదస్సు విశాఖలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సదస్సులో సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ, సీసీఎల్ఏ అదనపు కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కమిషనర్, ఐజీ రామకృష్ణ, కోస్తాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

4 వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీల నియామకం

సాక్షి, అమరావతి/వైవీయూ: ఏపీలోని 4 వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 4 వర్సిటీల వీసీల పదవీకాలం శనివారం (నేడు)తో ముగియనుండటంతో ఇన్‌చార్జ్ వీసీలుగా ఇతరులకు బాధ్యతలు అప్పగించారు. కడప వేమన యూనివర్సిటీకి జేఎన్టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ రంగ జనార్దన, పద్మావతి మహిళా వర్సిటీకి శ్రీవెంకటేశ్వర వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి, ఆదికవి నన్నయ వర్సిటీకి జేఎన్టీయూ కాకినాడ వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాద రాజు, కృష్ణా వర్సిటీకి ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావులను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించారు.

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ

నేడు మరోమారు వైకుంఠ ద్వార దర్శనం


అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు

తిరుమల/తిరుచానూరు (తిరుపతి జిల్లా): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సతీసమేతంగా శుక్రవారం రాత్రి తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. ముందుగా శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు, భారత్ బయోటెక్ చైర్మన్ కృష్ణ ఎల్లా, సుచిత్ర ఎల్లా దంపతులకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి సాదర స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం వారు వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. తర్వాత టీటీడీ అధికారులు వారికి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అంతకుముందు శ్రీ పద్మావతి అతిథి గృహం వద్ద జస్టిస్ ఎన్వీ రమణకు ఈవో ధర్మారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానికి ముందు కుటుంబ సమేతంగా తిరుచానూరులో శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు జస్టిస్ ఎన్వీ రమణను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వైవీ సుబ్బారెడ్డి అమ్మవారి ప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సన్మానించారు. శనివారం ఉదయం మరోమారు జస్టిస్ ఎన్వీ రమణ తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకోనున్నారు.

ఫోర్త్ వేవ్ వచ్చినా భయం లేదు

- డబ్ల్యూహెచ్‌వో మాజీ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్

సాక్షి, విశాఖపట్నం : భారత్‌లో కోవిడ్ ఫోర్త్ వేవ్ వచ్చినా భయం లేదని, అయితే అజాగ్రత్త, నిర్లక్ష్యం పనికి రాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మాజీ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్ చెప్పారు. విశాఖలో ఏపీపీఐ గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌లో పాల్గొనడానికి వచ్చిన ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఇండియాలో వ్యాక్సినేషన్ సమర్థవంతంగా జరిగిందన్నారు. ప్రజలు మాస్కులు ధరించడం, పరిశుభ్రత పాటించడం తప్పనిసరన్నారు. ఇప్పటిదాకా రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకోని వారు, 60 ఏళ్లు పైబడిన వారు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు బూస్టర్ డోసు వేయించుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుండటం అభినందించదగ్గ విషయమని చెప్పారు. భారత్‌లో మధుమేహం, రక్తపోటు, కిడ్నీ, హృద్రోగ సమస్యలు వంటి నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ వల్ల 70 ఏళ్ల కంటే ముందుగానే చనిపోతున్నారని తెలిపారు. ఇందుకు జన్యు పరమైన కారణాలతో పాటు పర్యావరణ కాలుష్యం, వ్యక్తిగత నడవడిక, తీపి పదార్థాలు ఎక్కువగా తినడం కారణాలని చెప్పారు. ఇలాంటి వ్యాధులపై జనంలో అవగాహన పెంచడం ద్వారా ముందుగానే వీటి బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. దేశంలో కోవిడ్ సహా వివిధ వ్యాధుల నిర్ధారణకు మరిన్ని లేబరేటరీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

క్యాన్సర్‌పై అవగాహనకు ప్రాజెక్ట్ టీల్


విజయవాడలోని పట్టణ ఆరోగ్య కేంద్రం

సాక్షి, అమరావతి: ప్రజలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాధిపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు 'ప్రాజెక్ట్ టీల్' కార్యక్రమాన్ని శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ప్రముఖ ప్రదేశంలో ముదురు నీలం–ఆకు పచ్చ లైటింగ్, ఫ్లెక్సీలను ప్రదర్శించారు.

సామాన్యుడికి ఆధునిక వైద్యం

▶ మొదటి పేజీ తరువాయి

పంపించారు. ఆ సందేశాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని సదస్సులో చదివి వినిపించారు. వ్యాధుల నివారణ, ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించామని, గ్రామ స్థాయిలో ఆరోగ్య పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. '2,000 – 2,500 జనాభా ఉన్న ప్రతి గ్రామ సచివాలయానికి అనుబంధంగా డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేశాం. ప్రతి గ్రామ ఆరోగ్య క్లినిక్‌కు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎం, నలుగురు ఆశా వర్కర్లను నియమించాం. ఈ హెల్త్ క్లినిక్‌లో 67 రకాల మందులు, 14 డయాగ్నస్టిక్ కిట్‌లు, వీడియో కాలింగ్ సదుపాయం ఉన్న టెలి కన్సల్టేషన్లు ఉన్నాయి. రోజుకు సగటున 60 వేల టెలి కన్సల్టేషన్ కాల్స్‌తో పాటు జనాభాలో 72 శాతం మందికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ నంబర్లను రూపొందించడంలో దేశంలో అగ్రస్థానంలో ఉన్నాం. సరికొత్తగా అమలు చేసే ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంలో ఓపీ, ప్రసవానంతర తనిఖీలు, స్క్రీనింగ్, రోగ నిర్ధారణ, చికిత్సలకు పీహెచ్‌సీ నుంచి ఒక వైద్యుడు నెలకు రెండుసార్లు ఆరోగ్య క్లినిక్‌ను సందర్శిస్తారు. తదుపరి చికిత్స అవసరమైన వారి ఇళ్లకు డాక్టర్ వెళ్లి మంచంపై ఉన్న రోగులను పరీక్షిస్తారు' అని వివరించారు.

ఆరోగ్య సంరక్షణకు అధిక నిధులు

'ఆరోగ్య సంరక్షణకు కేంద్ర బడ్జెట్‌లో సగటున 4 శాతం కేటాయిస్తే, రాష్ట్ర బడ్జెట్‌లో 7.3 శాతం ఖర్చు చేయడం మాకు గర్వకారణంగా ఉంది. నాడు–నేడు కార్యక్రమంలో రూ.16,850 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు, సెకండరీ హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌లో భారీ మౌలిక సదుపాయాలను కల్పించాం. ప్రభుత్వ రంగంలో 17 కొత్త వైద్య కళాశాలలను మంజూరు చేసి, కనీసం జిల్లాకో వైద్య కళాశాల ఉండేలా చూస్తున్నాం. స్పెషలిస్టులు, సూపర్ స్పెషలిస్టులతో అన్ని ఆరోగ్య సంస్థల్లో జీరో ఖాళీని ఒక విధానంగా తీసుకున్నాం. వీరితో సహా 47,191 మంది సిబ్బందిని నియమించాం. ఆరోగ్యశ్రీ కింద జనాభాలో 85 శాతం మందికి ఉచితంగా చికిత్స అందిస్తున్నాం. ఆరోగ్య శ్రీ కింద ప్రైవేటు రంగంలోని 2,225 ఎంప్యానల్ ఆస్పత్రుల్లో 3,255 విధానాలను (వైద్య ప్రక్రియలు) అందుబాటులో ఉంచాం. ఇందుకోసం ఏటా రూ.3,300 కోట్లు వెచ్చిస్తున్నాం. రోగులు కోలుకునే వరకు ఆరోగ్య ఆసరా కింద రోజుకు రూ.225 జీవనోపాధి భత్యాన్ని చెల్లిస్తున్నాం. ఇలా ఆరోగ్య అత్యవసర సమయంలో ప్రభుత్వం తమ వెనకే ఉందన్న భరోసా సామాన్యులకు కల్పిస్తున్నాం. ప్రపంచ స్థాయి ఆరోగ్య సౌకర్యాలు అందించే మా ప్రయత్నంలో వైద్యులూ పాలుపంచుకోవాలని కోరుతున్నాను. ఆరోగ్య సంరక్షణ రంగంలో ఎదుర్కొంటున్న సవాళ్లకు సదస్సు పరిష్కార మార్గాలను అన్వేషిస్తుందని ఆశిస్తున్నాను' అని సీఎం పేర్కొన్నారు.

సమ్మిట్‌ను ప్రారంభించిన మంత్రి రజిని

తొలుత గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌ను రజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య రంగంలో మెరుగైన నైపుణ్యాభివృద్ధికి ఈ సదస్సు ఎంతో దోహదం చేస్తుందన్నారు. శాస్త్రీయ పరిశోధనల ఫలితంగా రోగులకు మెరుగైన సేవలందించేందుకు వీలవుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య రంగంలో ఉత్తమ పాలసీలు అమలు చేస్తున్నారన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా ఏపీలోనే అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వైద్య సేవలకు ఎనిమిది జాతీయ, రెండు అంతర్జాతీయ అవార్డులు లభించాయని చెప్పారు. విశాఖ కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ ఈ సమ్మిట్ మెడికల్ రంగంలో నూతన విధానాలకు, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సాయపడుతుందన్నారు. ఏపీపీఐ అధ్యక్షుడు డాక్టర్ రవి కొల్లి మాట్లాడుతూ అమెరికా నుంచి 100 మంది, ప్రపంచం నలుమూలల నుంచి 350 మంది వైద్యులు ఈ సదస్సుకు హాజరవుతున్నారని చెప్పారు. మానసిక ఆరోగ్యం అవగాహన, ఆత్మహత్యల నివారణ, మాతాశిశు మరణాలు, పోషకాహారం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. క్యాన్సర్ నివారణ, చికిత్స ప్రపంచ వ్యాప్తంగా సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ, గ్రామీణ ఆరోగ్యం, టీకా కార్యక్రమాలు, వైద్య విద్య సంస్కరణల గురించి కూడా సమ్మిట్‌లో చర్చిస్తామన్నారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ సౌమ్యస్వామినాథన్, ఏపీ సాక్స్ పీడీ నవీన్‌కుమార్, వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ జె.నివాస్, నేషనల్ హెల్త్ మిషన్ నుంచి అభిజత్ శేఠ్, సమ్మిట్ చైర్మన్ రవిరాజు, సమ్మిట్ భారత్ చైర్మన్ ప్రసాద్ చలసాని, భారతీయ సంతతి అమెరికా వైద్యులు, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

9 నుంచి 17 వరకు హైకోర్టుకు సంక్రాంతి సెలవులు

అత్యవసర కేసుల విచారణకు వెకేషన్ కోర్టు ఏర్పాటు

సాక్షి, అమరావతి : సంక్రాంతి సందర్భంగా 9వ తేదీ నుంచి 17 వరకు హైకోర్టుకు సెలవులు ప్రకటించారు. ఈ నెల 18న హైకోర్టు పునః ప్రారంభమవుతుంది. ఈ సెలవుల కాలంలో అత్యవసర కేసులను విచారించేందుకు వెకేషన్ కోర్టు పనిచేస్తుంది. వెకేషన్ కోర్టులో న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్‌లు ఉంటారు. జస్టిస్ దేవానంద్, జస్టిస్ కృపాసాగర్ ధర్మాసనంలో, జస్టిస్ సుబ్బారెడ్డి సింగిల్ జడ్జిగా కేసులను విచారిస్తారు. అత్యవసర పిటిషన్లు దాఖలు చేయాలనుకునే వారు ఈ నెల 10న దాఖలు చేయాల్సి ఉంటుంది. వాటిపై న్యాయమూర్తులు ఈ నెల 12న విచారణ జరుపుతారు. హెబియస్ కార్పస్, ముందస్తు బెయిల్స్, కింది కోర్టులు తిరస్కరించిన బెయిల్ పిటిషన్లు, సెలవులు ముగిసేంత వరకు ఆగలేని అత్యవసర వ్యాజ్యాలు మాత్రమే ఈ వెకేషన్ కోర్టులో దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఎస్పీడీసీఎల్ సీఎండీపై కోర్టు ధిక్కార కేసు

- అనారోగ్యం కారణంగా చూపుతూ హైకోర్టుకు హాజరుకాని సీఎండీ
- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వద్ద న్యాయమూర్తి ఆరా
- గురువారం సమీక్ష సమావేశంలో పాల్గొన్నారన్న స్పెషల్ సీఎస్
- సంతోషరావుపై ధిక్కార కేసు నమోదుకు న్యాయమూర్తి ఆదేశం

సాక్షి, అమరావతి : మంచం కూడా దిగలేనంత తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, అందువల్ల వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కాలేకపోతున్నానంటూ గురువారం విచారణకు గైర్హాజరమైన దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కె.సంతోషరావు శుక్రవారం హైకోర్టుకు దొరికిపోయారు. సంతోషరావు గురువారం ఎక్కడ ఉన్నారంటూ శుక్రవారం ఓ కేసులో కోర్టు ముందు హాజరైన ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ సీఎస్) కె.విజయానంద్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ప్రశ్నించారు. 'సంతోషరావుకు ఫోన్ చేసి స్పీకర్ ఆన్ చేసి గురువారం ఎక్కడ ఉన్నారో కనుక్కోండి' అని విజయానంద్‌ను ఆదేశించారు. దీనికి విజయానంద్ స్పందిస్తూ.. గురువారం ఏలూరులో సమీక్షలో తనతో పాటు పాల్గొన్నారని చెప్పారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. మంచం దిగలేనంత అనారోగ్యంతో బాధపడుతున్నానని ఆయన న్యాయవాది ద్వారా గురువారం కోర్టుకు చెప్పించారని అన్నారు. అధికారులు అబద్ధాలతో కోర్టులను మోసం చేస్తున్నారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. సంతోషరావుపై సుమోటో కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని రిజిస్ట్రీని జస్టిస్ దేవానంద్ ఆదేశించారు. విచారణను 20 కి వాయిదా వేశారు.

మరో కేసులో సీపీడీసీఎల్ ఈఈ పైనా..

మరో కేసులో కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడమే కాక కోర్టు గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన సీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) సయ్యద్ అబ్దుల్ కరీంపై కూడా సుమోటో కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని జస్టిస్ దేవానంద్ రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ కేసులో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. విచారణను ఫిబ్రవరి 1కి వాయిదా వేశారు. అబ్దుల్ కరీంపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటానని కోర్టు ముందు హాజరైన ఇందనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ హామీ ఇచ్చారు. కోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని కిందిస్థాయి సిబ్బందికి మరోసారి ఆదేశాలిస్తామని ఆయనతోపాటు సీపీడీసీఎల్ చైర్మన్ పద్మా జనార్దన్‌రెడ్డి, ఎస్ఈ కూడా హైకోర్టుకు తెలిపారు. వీరు చెప్పిన వివరాలను న్యాయమూర్తి రికార్డ్ చేశారు. ఈ ముగ్గురితో పాటు మరో ఇద్దరికి తదుపరి విచారణలో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపునిచ్చారు. అబ్దుల్ కరీంకు మినహాయింపునిచ్చేందుకు నిరాకరించారు.

హామీ ఇచ్చారు.. నెరవేర్చారు

- 46 మంది 'ఫాతిమా' వైద్య విద్యార్థుల సమస్యకు సీఎం జగన్ పరిష్కారం
- తాజాగా రూ.9.70 కోట్లు విడుదల
- ముఖ్యమంత్రికి విద్యార్థులు, తల్లిదండ్రుల కృతజ్ఞతలు
- హామీ ఇచ్చి విస్మరించిన చంద్రబాబు


మీడియాతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా


కడప కోటిరెడ్డి సర్కిల్: సుదీర్ఘకాలంగా పోరాడుతున్న ఫాతిమా మెడికల్ కాలేజీ విద్యార్థుల సమస్య ఎట్టకేలకు సుఖాంతమైంది. పాదయాత్రలో వైఎస్ జగన్ వారి సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వగా ఇప్పుడు దానికి తెరపడింది. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంతో అవస్థలుపడ్డ ఆ విద్యార్థుల కథాకమామిషు ఏమిటంటే.. కడప నగర శివార్లలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో 2015–16కు సంబంధించి సుమారు 100 మంది విద్యార్థులు వైద్య విద్య కోసం అడ్మిషన్లు పొందారు. తరగతులు మొదలు కాగానే కళాశాలకు గుర్తింపు లేదని గ్రహించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నో పోరాటాలు చేశారు. కోర్టు మెట్లూ ఎక్కారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రులను అనేకమార్లు కలిశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి తమ గోడు చెప్పుకున్నారు. అయితే, అప్పటి ముఖ్యమంత్రి కొంతమందికి సీటు ఇప్పించి మిగిలిన వారికి రిక్తహస్తం చూపించారు. మరికొందరు మళ్లీ ఎంట్రన్స్ రాసి సీటు పొందారు. కానీ, చివరకు 46మంది పట్టువదలకుండా పోరాటం సాగించారు. వీరెవరికీ ఫీజులు వాపస్ రాలేదు. అన్ని విధాల అన్యాయానికి గురైన తాము ఎలా అప్పులు తీర్చాలంటూ ప్రశ్నిస్తూ వచ్చారు. ఎన్నో పోరాటాలు చేసినా ఇప్పటివరకు తమకు న్యాయం చేయలేదని బాధితులు అప్పట్లో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో.. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో వైద్య విద్యార్థులు ఆయనను కలిసి జరిగిన అన్యాయాన్ని వివరించారు. దీంతో, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మీకు న్యాయం చేస్తానని ఆయన హామి ఇచ్చారు. అన్నట్లుగానే సీఎం జగన్ ఇప్పుడు ఆ విద్యార్థుల చదువుకు అవసరమైన నిధులు మంజూరు చేసి ఆదుకున్నారు. ఈ మేరకు శుక్రవారం రూ.9.70 కోట్లను ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇచ్చిన హామీ నెరవేర్చిన సీఎం

తాను మానవత్వం కలిగిన నాయకుడిగా సీఎం జగన్ నిరూపించుకున్నారు. 46 మంది ఫాతిమా మెడికల్ కళాశాల విద్యార్థులు మోసపోయిన తరుణంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రికి మైనార్టీ వర్గాలతోపాటు బాధిత విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– ఎస్‌బీ అంజద్‌బాషా, ఉప ముఖ్యమంత్రి

మనసున్న నేతగా..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మనసున్న నేతగా నిరూపించుకున్నారు. వైద్య విద్య అభ్యసించేందుకు మాకు అవకాశం కల్పించిన గొప్ప నాయకుడు. ఇచ్చిన హామీ మేరకు మా సమస్యను పరిష్కరించారు. సీఎంతోపాటు ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు.

– ముజీర్, వైద్య విద్యార్థి, ఫాతిమా వైద్య కళాశాల

క్లుప్తంగా...

నందివాహనంపై విహరించిన మల్లన్న



గ్రామవీధుల్లో నందివాహనంపై ఊరేగుతున్న శ్రీశైలమల్లన్న

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ వార్షిక ఆరుద్రోత్సవంలో భాగంగా విశేషంగా అలంకరించిన నందివాహనంపై శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారు ఆశీనులై శుక్రవారం తెల్లవారు జామున పురవీధుల్లో విహరించారు. భక్తులకు కనువిందు చేశారు. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వార్షిక ఆరుద్రోత్సవం ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం 6 నుంచి భక్తులను దర్శనానికి, ఆర్జిత సేవలకు అనుమతించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎస్.లవన్న, ఆలయ ప్రధానార్చకుడు వీరన్న స్వామి, వేద పండితులు మార్కండేయశాస్త్రి పాల్గొన్నారు.

104 సేవలను అడ్డుకున్న ఒడిశా పోలీసులు

పోలీసుల తీరుపై ఎగువశెంబి గ్రామస్తుల ఆగ్రహం



ఎగువశెంబిలో వైద్యసిబ్బందిని అడ్డుకున్న ఒడిశా పోలీసులను ప్రశ్నిస్తున్న మాజీ వైస్‌సర్పంచ్ గమ్మెల బీసు

సాలూరు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు కొటియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా పోలీసుల దౌర్జన్యకాండ కొనసాగుతోంది. కొటియా గ్రామాల ప్రజలకు వైద్య సేవలందించేందుకు తోణాం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అజయ్ ఆధ్వర్యంలో వెళ్లిన 104 వాహన సిబ్బందిని శుక్రవారం ఒడిశా పోలీసులు అడ్డుకున్నారు. ఎగువశెంబి, ధూళిభద్ర, నేరేళ్లవలస గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించేందుకు వీలులేదని, ఇవి ఒడిశా పరిధిలోని గ్రామాలంటూ హుకుం జారీ చేశారు. ఎగువశెంబి గ్రామ మాజీ వైస్ సర్పంచ్ గమ్మెల బీసు, పలువురు గిరిజనులు ఒడిశా పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివాద రహిత గ్రామం సారికకు వచ్చేవరకు వైద్య సిబ్బంది వెంటే ఒడిశా పోలీసులు రావడం గమనార్హం.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు దళ సభ్యుడు అరెస్ట్

- బుర్కనకోటలో సుబ్బయ్య హత్యతో ప్రమేయం
- చింతూరు పోలీసులకు అప్పగింత

చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మావోయిస్టు పార్టీకి చెందిన దళ సభ్యుడిని ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ వివరాలను ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా కుంట అడిషనల్ ఎస్పీ గౌరవ్‌మండల్ శుక్రవారం కుంటలో మీడియాకు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌కు సరిహద్దులో ఉన్న మన రాష్ట్రంలోని చింతూరు మండలం బుర్కనకోటలో బుధవారం రాత్రి సోయం సుబ్బయ్య(35) అనే వ్యక్తిని మావోయిస్టులు హత్య చేశారు. ఈ విషయం తెలిసి ఛత్తీస్‌గఢ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం కుంట పోలీసుస్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. సున్నంపాడు గ్రామం వద్ద అనుమానాస్పదంగా తారసపడిన గోంపాడు గ్రామానికి చెందిన సోయం సంతోష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని విచారణ చేయగా, తాను మావోయిస్టు దళ సభ్యుడినని, కుంట ఎల్‌వోఎస్ కమాండర్ హితేష్ హుంగా ఆధ్వర్యంలో 10 మందిమి బుర్కనకోటకు చెందిన సోయం సుబ్బయ్యను హతమార్చినట్లు అంగీకరించాడని అడిషనల్ ఎస్పీ తెలిపారు. సంతోష్‌ను శుక్రవారం చింతూరు పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు.

తెలంగాణ

ట్రక్కు నదీలోయలో పడి ఖమ్మం జవాన్ మృతి

అరుణాచల్ ప్రదేశ్‌లో ఘటన

గార్ల: అరుణాచల్ ప్రదేశ్ గువాహటి సమీపంలో జవాన్ల సామగ్రితో వెళ్తున్న ట్రక్కు నదీ లోయలో పడిపోవడంతో ఇండో టిబెటిన్ బార్డర్ పోలీస్ (ఐటీబీపీ) విభాగంలో విధులు నిర్వహిస్తున్న జవాన్ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం జవాన్ కుటుంబం తొమ్మిదేళ్ల నుంచి ఖమ్మంలోని శ్రీసిటీలో నివాసం ఉంటోంది. గార్ల మండలం పీక్లీతండాకు చెందిన భూక్యా రమేశ్ (31) గువాహటి సమీపంలో గురువారం తెల్లవారుజామున సైనికులకు సంబంధించిన సామగ్రిని తీసుకెళ్తున్న ట్రక్కులో ఉన్నారు. ప్రమాదవశాత్తు ట్రక్కు నదీ లోయలో పడిపోయింది. దీంతో నలుగురు జవాన్లు నదీ లోయలో పడిపోగా.. ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. ఇందులో రమేశ్ మాత్రం నదిలో పడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. రమేశ్ మృతదేహాన్ని శనివారం ఖమ్మం తీసుకొస్తారని తెలిపారు.

మధురపూడికి మహర్దశ

విమానాశ్రయంలో రూ.347 కోట్లతో అధునాతన డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్

- నిధులు, పనులకు ఆమోద ముద్ర
- టెర్మినల్ బిల్డింగ్ విస్తరిస్తే ఒకేసారి 1,400 మంది ప్రయాణికులు స్టే చేసే సామర్థ్యం
- 5 పెద్ద విమానాల టేకాఫ్‌కు అవకాశం



సాక్షి, రాజమహేంద్రవరం: ఉభయగోదావరి జిల్లాల వాసులకు గగనతల ప్రయాణ సేవలందిస్తున్న (రాజమహేంద్రవరం) మధురపూడి విమానాశ్రయానికి మహర్దశ పట్టనుంది. ఇందుకోసం భారత పౌర విమానయాన శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నది. ఈ మేరకు రూ.347.15 కోట్లు విడుదల చేస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువరించింది. బిల్డింగ్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించేందుకు ఆ శాఖ సన్నాహాలు చేస్తోంది. పనులకు రాజమండ్రి ఎయిర్ పోర్ట్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహించనుందని జాతీయ విమానాశ్రయం అధికారి అరుణ్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రస్తుతం ఇలా..

మధురపూడి విమానాశ్రయంలో ప్రస్తుతం 3,165 మీటర్ల పొడవున్న రన్‌వే, 11 పార్కింగ్ బేస్‌తో కూడిన ఏప్రాన్, 11 విమాన సర్వీసులు ఏకకాలంలో నిలుపుదలకు అవకాశం కలిగిన వసతి ఉంది. 4,065 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న టెర్మినల్ భవనంలో ఏకకాలంలో 225 మంది ప్రయాణికులు స్టే చేసేందుకు సరిపోతుంది. అంతర్జాతీయ స్థాయికి అవసరమైన సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయి. 90 శాతం ఆక్యుపెన్సీతో విమానాలు నడుస్తున్నాయి. విమానాశ్రయం నుంచి ప్రస్తుతం 12 సర్వీసులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నంకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రతి రోజూ 1,200 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

టెర్మినల్ భవన సామర్థ్యం పెంపు..

విమాన రాకపోకల సందర్భంగా ప్రయాణికుల తాకిడి పెరిగింది. ప్రతి రోజూ 1,200 మంది రాకపోకలు సాగిస్తుంటే.. ప్రస్తుతం ఉన్న భవనంలో కేవలం 225 మంది మాత్రమే స్టే చేసేందుకు అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం భవన సామర్థ్యం విస్తరించేందుకు నిధులు మంజూరయ్యాయి. రూ.347 కోట్లతో మరో 16,000 చదరపు గజాలకు విస్తరించేందుకు గానూ నూతన భవన నిర్మాణాన్ని చేపట్టనున్నారు. భవన నిర్మాణం పూర్తయితే 1,400 మంది ప్రయాణికులు స్టే చేయవచ్చు. అంతేగాక ఒకేసారి 5 విమానాలు అరైవల్ అయినా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులుండవు.

భద్రతలోనూ మేటి

ప్రయాణికులు, విమానాశ్రయ భద్రత, రక్షణ విషయంలో మధురపూడి ఏయిర్ పోర్ట్ ప్రత్యేకంగా నిలుస్తుంది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో దీని నిర్మాణం జరిగింది. యుద్ధ సమయంలో సముద్ర మార్గం ద్వారా రావాణాకు అనువైన ప్రాంతంగా ఖ్యాతి గడించింది. రెండో ప్రపంచ యుద్ధంలో యుద్ధ విమానాలను ఇక్కడ ఉంచేవారు.

సంతోషంగా ఉంది..

టెర్మినల్ భవన నిర్మాణ అనుమతులు, నిధుల విడుదల కోసం కొన్నేళ్లుగా చేస్తున్న కృషికి ఫలితం దక్కింది. గతేడాది డిసెంబరు 16న జరిగిన బోర్డు మీటింగ్‌లో తీర్మానం చేశాం. కాంపిటేటివ్ అథారిటీ, పరిపాలనా ఆమోదం, వ్యయం మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడటం సంతోషంగా ఉంది. ఇందుకు సంబంధించిన శాంక్షన్ ఆర్డర్స్ సంబంధిత ఉన్నతాధికారులకు అందాయి.
–మార్గాని భరత్‌రామ్, ఎంపీ, రాజమహేంద్రవరం

పనులు ప్రారంభిస్తాం..

టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు, నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులకు అధునాతన సేవలు అందించేందుకు భవన నిర్మాణం ఎంతగానో దోహదం చేస్తుంది. ప్రస్తుత సేవలను మరింతగా విస్తరించే వెసులుబాటు కలుగుతుంది.
– ఎస్.జ్ఞానేశ్వరరావు, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్

ఏయూలో స్కూల్ విధానం

దశల వారీగా అమలుకు కసరత్తు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): ఐఐటీ, విదేశీ యూనివర్సిటీల్లో అమల్లో ఉన్న స్కూల్ విధానాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కూడా అమలు చేయనున్నారు. ఈ మేరకు ఏయూలో స్కూల్ విధానం అమలు కోసం ఏర్పాటుచేసిన నిపుణుల కమిటీ సమావేశం శుక్రవారం వర్సిటీలోని పాలకమండలి మీటింగ్ హాలులో జరిగింది. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి కమిటీ చెర్మన్, ఉన్నత విద్యామండలి వైస్ చెర్మన్ ఆచార్య కె.రామ్మోహనరావు, ఐఐఎం విశాఖపట్నం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్, ఐఐటీ ఢిల్లీ సంచాలకుడు ఆచార్య వి.రాంగోపాల్, సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ సంచాలకుడు ఆచార్య కె.నిరంజన్, కమిటీ కన్వీనర్, ఏయూ అకడమిక్ డీన్ ఆచార్య ఎ.కిశోర్‌బాబు, దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఓఆర్ఎం రావు తదితరులు పాల్గొన్నారు. తొలి దశగా ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, బిహేవియరల్ సైన్స్‌ను ప్రారంభించాలని కమిటీ సభ్యులు సూచించారు. దీని పరిధిలోకి కామర్స్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్ఎం, ఎకనామిక్స్, సైకాలజీ కోర్సులు తీసుకురావాలని ఐఐటీ సంచాలకుడు వి.రామ్‌గోపాల్ ప్రతిపాదించారు. ఆ తర్వాత వచ్చే సంవత్సరం స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌ను ప్రారంభించాలని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న మెటలర్జీ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ, విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కోర్సును మెటీరియల్ సైన్స్ లేక మెటీరియల్ ఇంజనీరింగ్‌గా మార్పు చేస్తూ మెకానికల్ ఇంజనీరింగ్‌లో విలీనం చేయాలన్నారు. తద్వారా విద్యార్థులకు అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయం వ్యక్తంచేశారు.

ఉత్తరాంధ్రకు ద.మ.రైల్వే ఉత్తచేయి

- పత్తాలేని సంక్రాంతి ప్రత్యేక రైళ్లు
- హైదరాబాద్ నుంచి విశాఖకు వెళ్లే రైళ్లన్నీ ఫుల్
- దక్షిణమధ్య రైల్వే, ఈస్ట్‌కోస్ట్‌ల మధ్య సమన్వయలోపం
- రైళ్ల ఏర్పాటులో నిర్లక్ష్యం



సాక్షి, హైదరాబాద్: అసలే పండుగ సీజన్.. జనం సొంతూళ్లకు వెళ్లడానికి సిద్ధమవుతున్న వేళ.. ఉత్తరాంధ్రవాసులకు దక్షిణ మధ్య రైల్వే ఉత్తచేయి చూపింది. సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుంచి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు కనీసం ఒక్క ప్రత్యేక రైలూలేదు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్లల్లో విశాఖ మీదుగా ఒక్కటి కూడా వెళ్లడం లేదు. ఆరేడు రెగ్యులర్ రైళ్లు తప్ప ప్రత్యేక రైళ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. విశాఖ వైపుగా నడిచే రెగ్యులర్ రైళ్లన్నీ వచ్చే ఫిబ్రవరి వరకు కూడా వెయిటింగ్ జాబితాతో దర్శనమిస్తున్నాయి. దక్షిణ మధ్య రైల్వే సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు 30 రైళ్లను అదనంగా నడిపేందుకు చర్యలు చేపట్టింది. వాటిలో కాకినాడ, తిరుపతి, బెంగళూరు, విజయవాడ వంటి ప్రాంతాలకే ఎక్కువగా అందుబాటులో ఉన్నాయి. కానీ, విశాఖ, చుట్టుపక్కలప్రాంతాలకు వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు లేవని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డుకు చెందిన వినయ్ అనే ప్రయాణికుడు విస్మయం వ్యక్తం చేశారు.

సమన్వయలేమి...

దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్‌కోస్ట్ రైల్వేల మధ్య సమన్వయం కొరవడటం వల్లే ప్రత్యేక రైళ్ల ఏర్పాటులో నిర్లక్ష్యం నెలకొందని ప్రయాణికులు చెబుతున్నారు. హైదరాబాద్ నుంచి దువ్వాడ వరకు దక్షిణ మధ్య రైల్వే పరిధి కాగా, దువ్వాడ నుంచి విశాఖ తదితర ప్రాంతాలు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌లోకి వస్తాయి. దీంతో హైదరాబాద్ నుంచి కాకినాడకు ప్రత్యేక రైళ్లపై చూపిన శ్రద్ధ విశాఖ వైపు కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈస్ట్‌కోస్ట్ రైల్వే కూడా సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. 'హైదరాబాద్ నుంచి సామర్లకోట వరకు, అక్కడి నుంచి కాకినాడకు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. కానీ, విశాఖకు వెళ్లాలంటే మరో 150 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. సామర్లకోట నుంచి విశాఖకు వెళ్లడం ఎలా సాధ్యం''అని ఫణీంద్ర అనే ప్రయాణికుడు చెప్పారు. రెగ్యులర్ రైళ్లు ఇప్పటికే భర్తీ కావడం, ప్రత్యేక రైళ్లు లేకపోవడంతో ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులపై ఆధారపడాల్సి వస్తోంది. కానీ, గంటల తరబడి కూర్చొని ప్రయాణంచేయడం మహిళలు, పిల్లలు, వయోధికులకు చాలా కష్టం. మరోవైపు బస్సుల కంటే రైళ్లలో చార్జీలు కూడా తక్కువ.

పదిలక్షల మంది వరకు ప్రయాణం

ఏపీలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే సంక్రాంతి వేడుకలకు హైదరాబాద్ నుంచి 25 లక్షల మందికిపైగా నగరవాసులు సొంతూళ్లకు వెళ్లే అవకాశం ఉంది. అందులో కనీసం 10 లక్షల మంది విశాఖ, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందినవాళ్లే ఉంటారని అంచనా. మరికొద్దిరోజుల్లో విద్యార్థులకు సెలవులు ప్రకటించనుండటంతో రైళ్లలో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉంది.

అభివృద్ధిలో దూసుకుపోతున్న భారత్

మిజోరాం గవర్నర్ హరిబాబు



ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న కె.హరిబాబు

తగరపువలస (భీమిలి): నూతన విద్య, ఆర్థిక విధానాల కారణంగా అభివృద్ధిలో దేశం దూసుకుపోతోందని మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. చెరకుపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న గ్యాన్–2కె23 జాతీయ సాంకేతిక ఫెస్ట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న అభివృద్ధిని నేటి తరం అనుభవిస్తుంటే తనకు అసూయగా ఉందన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా దేశం తన అవసరాలను తీర్చుకోవడంతోపాటు విదేశాలకు అవసరమైన ఎగుమతులు చేయగలుగుతోందన్నారు. ప్రపంచానికి అవసరమైన సాంకేతికపరమైన డేటా మనదేశంలో చౌకగా లభిస్తుందన్నారు. విద్యార్థులు తన చుట్టూ ఉన్నవారికి, దేశానికి అవసరమైన వాటిని గుర్తించి ఉత్పత్తి చేయడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా విజయం సాధించాలని సూచించారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి కులం, డబ్బు వంటివాటితో పనిలేదన్నారు. తెలివితేటలు, కష్టపడే తత్వం అలవరచుకోవాలన్నారు. జేఎన్‌టీయూ–కె ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు టెక్నికల్, సాఫ్ట్ స్కిల్స్, లైఫ్‌స్కిల్స్‌ను మెరుగుపరుచుకుంటూ నిరంతరం అభ్యాసం చేయాలన్నారు. వరంగల్ నిట్ ప్రొఫెసర్ ఎం.సైదులు, అవంతి విద్యాసంస్థల డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, మేనేజింగ్ డైరెక్టర్ ఐ.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాతృ(త)త్వం

సృష్టిలో తల్లిది ప్రత్యేక స్థానం. కల్మషంలేని ప్రేమే మాతృతత్వం. వీటికి అద్దం పడుతోంది నంద్యాల జిల్లా వెల్దుర్తి గ్రామంలోని ఘటనలు. వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ వెనుక ఆవు పంది పిల్లలకు పాలు ఇస్తుంటే, వెల్దుర్తి కొత్త బస్టాండు వెనుక కుక్క పిల్లలు పంది వద్ద పాలుతాగుతున్నాయి. ఈ అరుదైన దృశ్యాలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. మాతృతత్వం గురించి మాట్లాడుకున్నారు.
–వెల్దుర్తి(నంద్యాల)



వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ వెనుక ఆవు పాలు తాగుతున్న పందిపిల్ల



వెల్దుర్తి కొత్త బస్టాండు వెనుక పందిపాలు తాగుతున్న కుక్కపిల్లలు

ట్రాన్స్‌ఫార్మర్లపై తప్పుడు లెక్కలు

- వాస్తవ నిల్వలకు దరిదాపుల్లో లేని అంకెలతో పచ్చ పత్రిక రాతలు
- 2021 ఏప్రిల్ నాటికి 633 ఉంటే దాదాపు 90 లక్షలున్నట్లు విష ప్రచారం
- వృథాగా పడి ఉన్నాయంటూ పచ్చి అబద్ధాలు
- టెండర్లలో పాల్గొనని కంపెనీల నుంచి ఎందుకు కొనలేదంటూ వితండ వాదన



సాక్షి, అమరావతి: ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు, నిల్వలపై 'కేరాఫ్ కడప.. విచ్చలవిడిగా ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్లు' శీర్షికతో అర్థం లేని రాతలు, పొంతనలేని లెక్కలతో పచ్చి అబద్ధాలను ప్రచురించి పచ్చ పత్రిక అడ్డంగా దొరికిపోయింది. డిస్కమ్‌లపై బురద చల్లేందుకు ప్రయత్నించి అభాసుపాలైంది. తప్పుడు రాతల వెనుక వాస్తవాలను 'ఏపీసీపీడీసీఎల్' వెల్లడించింది.

ఆరోపణ: 2021 ఏప్రిల్ 1 నాటికి రూ.145.86 కోట్ల విలువైన 88,88,203 ట్రాన్స్‌ఫార్మర్లు డిస్కమ్ పరిధిలోని వివిధ స్టోర్లలో ఉన్నాయి.

వాస్తవం: 2021 ఏప్రిల్ 1 నాటికి రూ.10.77 కోట్లు విలువైన 633 ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే ఉన్నాయి.

ఆరోపణ: 2021 ఏప్రిల్ నుంచి 2022 డిసెంబర్ 31 మధ్య రూ.956.69 కోట్లతో 4,44,09,492 ట్రాన్స్‌ఫార్మర్లను కొనుగోలు చేశారు.

వాస్తవం: 2021 ఏప్రిల్ నుంచి 2022 డిసెంబర్ 31 మధ్య రూ.358.97 కోట్లతో 32,728 ట్రాన్స్‌ఫార్మర్లను మాత్రమే కొనుగోలు చేశారు.

ఆరోపణ: 2022 డిసెంబర్ 31 నాటికి విజయవాడ, గుంటూరు, సీఆర్‌డీఏ, ఒంగోలు స్టోర్స్‌లో రూ.385.38 కోట్ల విలువైన 1,22,61,706 ట్రాన్స్ ఫార్మర్లు నిల్వ ఉంచారు.

వాస్తవం: గత డిసెంబర్ 31 నాటికి అన్ని స్టోర్స్‌లో కలిపి రూ.149.86 కోట్ల విలువైన 16,634 ట్రాన్స్ ఫార్మర్లు మాత్రమే నిల్వ ఉన్నాయి.

ఆరోపణ: ఏడాదిన్నరలోనే ఏపీసీపీడీసీఎల్ పరిధిలో రూ.కోట్ల విలువైన ట్రాన్స్ ఫార్మర్ల కొనుగోలు చేయడం వెనుక భారీ వ్యూహం ఉంది.

వాస్తవం: ప్రస్తుతం స్టోర్లలో నిల్వ ఉన్న 16,634 ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి 13,361 ట్రాన్స్‌ఫార్మర్లను కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం, చోరీకి గురైన చోట్ల కొత్తవి ఏర్పాటు, రోలింగ్ స్టాక్ కోసం వినియోగించనున్నారు. వర్షాలతో పొలాల్లో నీరు చేరడం, కోతల సమయం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడానికి అవకాశం లేక కొంత జాప్యం జరిగింది. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. వేసవి చివరి కల్లా పెండింగ్‌లో ఉన్న అన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు నిల్వ చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వినియోగిస్తారు.

ఆరోపణ: ఏబీపీ, బీహెచ్‌ఈఎల్, ఎల్ అండ్ టీ లాంటి ప్రముఖ కంపెనీలు తక్కువకే ఇస్తుంటే ఎక్కువ ధర చెల్లించి కొంటున్నారు.

వాస్తవం: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన కొనుగోళ్లు పూర్తిగా టెండర్ల ద్వారా మాత్రమే జరుగుతాయి. ఓ పత్రికలో పేర్కొన్న సంస్థలు టెండర్ల ప్రక్రియలో ఇప్పటి వరకూ పాల్గొనలేదు. 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రూ.5 లక్షలకు, 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను రూ.8.5 లక్షలకు కొనుగోలు చేయడం లేదు.

వాస్తవ లెక్కలు ఇవీ (విలువ రూ.కోట్లలో)

జిల్లా స్టోర్స్	01.04.2021 నాటికి స్టోర్లలో అందుబాటులో ఉన్న డీటీఆర్ స్టాక్		01.04.21 నుంచి 31.12.22 వరకు కొనుగోలు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు		31.12.22 నాటికి స్టోర్లలో అందుబాటులో ఉన్న డీటీఆర్ స్టాక్	
	క్వాంటిటీ	విలువ	క్వాంటిటీ	విలువ	క్వాంటిటీ	విలువ
విజయవాడ	102	1.74	9,874	108.3	5,632	50.74
గుంటూరు	261	4.44	14,968	164.17	4,550	40.99
సీఆర్‌డీఏ	74	1.26	678	7.44	315	2.84
ఒంగోలు	196	3.33	7,208	79.06	6,137	55.29
మొత్తం	633	10.77	32,728	358.97	16,634	149.86

“ రజోగుణము వల్ల ఇంద్రియ నిగ్రహము లేకుండుట; తమోగుణము వల్ల బుద్ధిమాంద్యము కలుగుచున్నవి. సత్త్వగుణము వృద్ధిలో నుండగా ఉత్తమ జ్ఞానులు పొందెడు నిర్మలమైన లోకములను పొందుచున్నాడు.

– హైందవ ధర్మం

సాక్షి

శనివారం, జనవరి, 7

‘సర్వోన్నత’ వ్యాఖ్యలు

సంక్లిష్ట సమస్యలెదురైనప్పుడు యాంత్రికంగా వ్యవహరించటంకాక మనసుపెట్టి ఆలోచించి నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం కూడా ఉన్నప్పుడే ఏ వ్యవస్థయినా అందరిచేతా ప్రశంసలందు కుంటుంది. ఇతర వ్యవస్థల మాటెలావున్నా నిత్యం ప్రభుత్వాల నిర్ణయాల్లో, పౌరుల వ్యవహార శైలిలో తప్పొప్పులనెంచే పనిలో నిమగ్నమైవుండే న్యాయవ్యవస్థకు ఈ గుణం మరింత అవసరం. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ నగరంలో రైల్వే శాఖ అధీనంలోనిదని చెబుతున్న 29 ఎకరాల భూమిలో ఆక్రమణదారులను వెంటనే తొలగించాలంటూ గత డిసెంబర్‌లో అక్కడి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తాజాగా సర్వోన్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలను ఈ కోణంలో చూడాలి. సమస్య అన్నిచోట్లా ఉంటున్నదే. పేద, ధనిక తేడా లేకుండా అందరూ చేస్తున్నదే. పట్టణ, నగర ప్రాంతాల్లోని విలువైన భూములు అన్యాక్రాంతం కావడం దశాబ్దాలుగా కనబడుతున్నదే. పల్లెల్లో జరుగుబాటు నానాటికీ కష్టమై ఏదో ఒక పని దొరక్కపోతుందా అన్న ఆశతో నిత్యం వేలాదిమంది సమీపంలోని పట్టణాలకూ, నగరాలకూ లేదా సుదూరతీరాల్లోని నగరాలకూ వలసపోతుంటారు. ఇలా వెళ్తున్నవారు ఆయా ప్రాంతాల్లో తలదాచుకుందుకు అనివార్యంగా కొద్దిపాటి జాగా వెతుక్కోక తప్పదు. సరిగ్గా ఇక్కడే స్థానిక పెత్తందార్లు, మాఫియా ముఠాల వ్యక్తులు రంగప్రవేశం చేస్తారు. తమను ఆశ్రయించిన దిక్కూ మొక్కూలేని జనం నుంచి ఎంతో కొంత లాక్కొని వృథాగా పడుండే సర్కారీ భూముల్లో లేదా స్థానిక సంస్థల భూముల్లో గుడిసెలు వేసుకొనేందుకు ‘అనుమతిస్తారు’. నగరాల్లోని ఏ మురికివాడల చరిత్ర చూసినా ఇంతే. సంపన్న వర్గాలది వేరే కథ. నగరంలో చాలా ముఖ్యమైన ప్రాంతంగా పేరుబడినచోట ఉండే మురికివాడపైనో లేదా అంతవరకూ ఎవరి దృష్టీ పడని సర్కారీ భూమిపైనో కన్నేసి నకిలీ పత్రాలు సృష్టించి వాటి ఆధారంగా ఆక్రమణలకు పూనుకుంటారు. వాటిని చట్టబద్ధం చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. అందుకోసం రాజకీయ పార్టీల్లో చేరి కాలక్రమంలో బడా నేతలుగా ఎదుగుతారు. బాధాకరమైన విషయమేమంటే ఆక్రమణదారులందరినీ వ్యవస్థలు ఒకేలా చూడవు. సమ న్యాయం పాటించవు. ఇతర వ్యవస్థల మాట అటుంచి న్యాయస్థానాలు సైతం ఇటీవల ఇలాంటి ధోరణినే ప్రదర్శిస్తుండటం ఆందోళనకరమైన పరిణామం. నిరుపేదలను వెళ్లగొట్టడంలో అత్యుత్సాహం చూపే వ్యవస్థలే ఆక్రమణదారులైన బడా నేతల విషయంలో ఎక్కడలేని ఉదారతనూ ఒలక బోస్తున్నాయి.

ఉత్తరాఖండ్ హైకోర్టు నిరుడు డిసెంబర్‌లో ఇచ్చిన తీర్పు పూర్వాపరాలు పరిశీలిస్తే న్యాయస్థానాల తీరుతెన్నులెలా ఉంటున్నాయో అర్థమవుతుంది. వివాదంలో ఉన్న 29 ఎకరాల భూమి 2 కిలోమీటర్ల నిడివిన ఉంది. ఈ కాలనీకి గఫూర్ బస్తీ అని పేరు. అందులో ‘ఆక్రమణదారుల’ ఆవాసాలు మాత్రమే కాదు... నాలుగు ప్రభుత్వ పాఠశాలలు, మంచినీటి ట్యాంకులు, మసీదులు, ఆలయాలు, దుకాణాలు ఉన్నాయి. ఈ బస్తీలోని 4,500కుపైగా ఆవాసాల్లో మొత్తంగా 50,000 మంది వరకూ నివసిస్తున్నారు. వీరందరినీ ‘తక్షణం’ ఖాళీ చేయించాలనీ, ఇందుకోసం పారామిలిటరీ దళాలను కూడా వినియోగించవచ్చనీ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ స్థలానికి సమీపంలోని నదిలో అక్రమంగా ఇసుక తవ్వుకుపోతున్నారని 2013లో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) పరిధిని హైకోర్టు తనకు తానుగా విస్తృతపరిచి, ఈ ఆక్రమణల సంగతి కూడా తేలుస్తామని ప్రకటించింది. ఆక్రమణలను క్రమబద్ధీకరించి తీరాలని ఎవరూ డిమాండ్ చేయరు. నిజానికి ఇదే ఉత్తరాఖండ్‌లో పర్యావరణానికి ముప్పు కలిగించేలా బడా పారిశ్రామికవేత్తలు అడవులకూ, నదులకూ ప్రమాదం తెచ్చిపెడుతున్నారు. వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలకు సమీపంలో కాంక్రీట్ నిర్మాణాలు, విశాలమైన రహదారులు వెలుస్తున్నాయి. ఆఖరికి ఉత్తరాఖండ్ సర్కారు అక్కడున్న ఏకైక శివాలిక్ ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని సైతం 2020లో డీనోటిఫై చేసింది. డెహ్రాడూన్, హరిద్వార్, హల్ద్వానీ, తనక్‌పూర్, రాంనగర్ డివిజన్లను ఒరుసుకుని ఉన్న ఈ కేంద్రాన్ని డీనోటిఫై చేసిన తీరును కేంద్ర పర్యావరణ శాఖ కూడా తప్పుబట్టింది. ఇక చట్టవిరుద్ధంగా భారీ యంత్రాల సాయంతో సాగే ఇసుక తవ్వకాలవల్ల వంతెనలు కూలిన సందర్భాలు కూడా లేకపోలేదు. 2013లో అలా వంతెన కూలిన ఉదంతం తర్వాతే ఈ పిల్ దాఖలైంది. హిమానీ నదాలు పారే రాష్ట్రంలో ఇతరేతర పర్యావరణ ఉల్లంఘనలను పట్టించుకోని వ్యవస్థలు నిరుపేదల కాలనీపై విరుచుకు పడాలనుకోవటం ఎలాంటి న్యాయం? గఫూర్ కాలనీవాసుల్లో అత్యధికులు ముస్లింలు గనుకే వారిని వెళ్లగొట్టాలని బీజేపీ సర్కారు కుట్రలు పన్నుతున్నదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో హైకోర్టు ధర్మాసనం కాస్తయినా సున్నితంగా ఆలోచించొద్దా?

హల్ద్వానీలో తలెత్తిన వివాదం 1907 నాటి ప్రభుత్వ రికార్డుల చుట్టూ తిరుగుతోంది. తమ పూర్వీకులు అయిదు దశాబ్దాలక్రితం ప్రభుత్వ వేలంలో సొంతం చేసుకున్నారని కొందరు దాఖలాలు చూపారు. మరికొందరు వేరేవారినుంచి కొన్నట్టు పత్రాలు దాఖలాలు చేశారు. ఇవన్నీ నిజం కాదని న్యాయస్థానాలు భావించినా ఖాళీ చేయించేముందు వారికి ప్రత్యామ్నాయం చూపాలన్న కనీస స్పృహ ఉండాలి. ఆ ప్రత్యామ్నాయం ఆచరణాత్మకంగా ఉండాలి. అన్నీ వదిలి వ్యవస్థలు బుల్‌డోజర్ న్యాయానికే మొగ్గితే పౌరులు ఎవరికి మొరపెట్టుకోవాలి? ఈ పరిస్థితుల్లో సర్వోన్నత న్యాయస్థానం చేసిన సూచనలు విలువైనవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ పట్టించుకోవాల్సినవి.

మహిళలు రోడ్డెక్కాలంటే... భయం!

విశ్లేషణ



కల్పనా విశ్వనాథ్

జనవరి 1 తొలి క్షణాల్లోనే దేశ రాజధానిలో ఒక యువతిని కారుతో ఢీకొట్టి కిలోమీటర్ల దూరం లాక్కుపోయిన ఘటన 2023 సంవత్సరానికి భయానకమైన ప్రారంభాన్ని ఇచ్చింది. రహదారి భద్రత భారతదేశంలో అతిపెద్ద సమస్య. రోడ్డుపై సంభవిస్తున్న మరణాల్లో దాదాపు 90 శాతం అతివేగం, ఓవర్ టేకింగ్, ప్రమాదకరమైన డ్రైవింగ్ వల్లే జరుగుతున్నాయి. ప్రపంచ బ్యాంకు డేటా ప్రకారం, రోడ్డు ప్రమాదాలకు సంబంధించి 20 అగ్రశ్రేణి దేశాల్లో ఇండియా తొలి స్థానంలో ఉంది. వీటికి అదనంగా చీకటిపడ్డాక బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణిస్తున్నప్పుడు లైంగిక దాడి భయం మహిళలను వెంటాడుతుంటుంది. మహిళల కదలికలను హింస, భయం అడ్డుకుంటున్నాయి. వీటికి పేలవమైన ప్రజా రవాణా సేవలు తోడవుతున్నాయి.

జనవరి 1న ఐదుగురు పురుషులు ఉన్న కారు ఒక యువతి బైక్‌ని ఢీకొట్టి పలు కిలోమీటర్ల దూరం ఆమెను లాక్కునిపోయిన ఘోరమైన ఉదంతం, 2023 సంవత్సరానికి భయానకమైన ప్రారంభాన్ని ఇచ్చింది. ఈ ఘటనలో ప్రమాదకరమైన అనేక అంశాలు దాగి ఉన్నాయి. మొదటగా, వారు ఒక అమ్మాయిని తమ కారుతో 4 కిలోమీటర్ల దూరం లాక్కెళ్లి పోతున్నామనే స్పృహ కూడా లేనంత పూటుగా తాగి ఉన్నట్లు వార్తలొచ్చాయి. లేదా వారు స్పృహలో ఉండి ఉండవచ్చు కూడా. రెండు: ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న యువతిని కారుతో ఢీకొట్టిన డ్రైవర్ ఆమెకు సహాయం చేయాలని కూడా భావించలేదు. బదులుగా, అతడు చాలా వేగంగా కారు తోలాడు. ఒక వార్త ప్రకారం, కారులో ఉన్న వారు ఆ తర్వాత కారు ఆపి యువతి శరీరాన్ని కారు కిందనుంచి తొలగించి పారిపోయారు. ఈ విషయంలో వారు ఎలాంటి విచక్షణ, స్పందన లేకుండా వ్యవహరించారు. ఒక చావుకు కారణమయ్యామనే ఆలోచన కూడా వారికి లేదు. ఒక వ్యక్తిని కాపాడటం కంటే తమను తాము కాపాడుకోవడం గురించే వారు ఆందోళన చెందారు. అందుకే రోడ్డుమీదే ఆమెను చనిపోయేలా చేసి వెళ్లిపోయారు.

దారినపోతున్న వారు పోలీసులకు ఆమె గురించి సమాచారం ఇచ్చారు. వీధిలోని సీసీటీవీ కెమెరా ద్వారా కారును గుర్తించారు. పైగా, ఆ మహిళ రోడ్డుమీద వివస్త్రగా పడి ఉన్నందున, ఆమెపై లైంగిక దాడి జరిగి ఉంటుందేమో అనే కోణంలో కూడా విచారణ జరుగుతోంది.

ఆ యువతికి 20 సంవత్సరాలుంటాయి. తన పని ముగించుకుని ఆమె ఇంటికి వెళుతోంది. ఆమెకు ఎదురైన భయానకమైన మరణాన్ని, తద్వారా ఆమె తల్లి, ఇతర కుటుంబ సభ్యుల దుఃస్థితిని తల్చుకోవాలంటే కూడా హృదయం బద్దలవుతోంది. రహదారి భద్రత భారతదేశంలో అతిపెద్ద సమస్య. దుర్బలమైనవారు మరింత ప్రమాదాన్ని ఎదుర్కొంటారు. రోడ్డు పక్కన కూర్చుని లేదా నిద్రపోతున్నవారిని వేగంగా పోతున్న కార్లు ఢీకొని ప్రమాదాలకు గురిచేస్తున్న అనేక ఉదంతాలు ఉన్నాయి. కేవలం 2021లోనే



1.5 లక్షల మంది ఈ రోడ్డు ప్రమాదాల కారణంగా చనిపోయారు. కొన్నేళ్లుగా ఇదే ధోరణి కొన సాగుతోంది. నేషనల్ క్రైమ్స్ రికార్డ్ బ్యూరో గణాంకాల ప్రకారం, వీటిల్లో 1.9 శాతం మద్యం, మత్తు పదార్థాల ప్రభావంలో జరిగినవి. రోడ్డుపై సంభవిస్తున్న మరణాల్లో దాదాపు 90 శాతం అతివేగం, ఓవర్ టేకింగ్, ప్రమాదకరమైన డ్రైవింగ్ వల్లే జరుగుతున్నాయి. 2019 నుంచి ప్రపంచ బ్యాంకు డేటాను పరిశీలిస్తే, అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న 20 అగ్రశ్రేణి దేశాల్లో ఇండియా తొలి స్థానంలో ఉంది.

చీకటిపడ్డాక బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణిస్తున్నప్పుడు లైంగిక దాడికి సంబంధించిన భయం కూడా మహిళలను వెంటాడుతుంటుంది. ఈ ఉదంతంలో లైంగిక దాడి రుజువు కాకున్నప్పటికీ, అలాంటి దాడి జరిగే అవకాశం ఉందన్న వాస్తవం ఈ దేశంలోని ప్రతి మహిళకూ అదనపు ఆందోళనను కలిగిస్తుంటుంది. జాతీయ మహిళా కమిషన్ ప్రత్యేకించి పేర్కొన్నట్లుగా, ఈ కోణాన్ని కూడా ఈ ఉదంతంలో పరిశీలించడం చాలా ముఖ్యం.

నగరాలు మహిళలకు అందిస్తున్న అవకాశాలు, వాటిని వారు దక్కించుకుంటున్న సామర్థ్యాలపై హింస గణనీయమైన ప్రభావం చూపుతోంది. ఐక్యరాజ్యసమితి, ‘ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ విమెన్’ పరిశోధన ప్రకారం నగరాల్లో మహిళలు అనేక రూపాల హింసకు, లైంగిక వేధింపులకు గురవుతున్నారు. పెద్దగా అరిచి భయపెట్టడం, దేహ భాగాలను గట్టిగా నొక్కడం, వెంబడించడంతోపాటు, లైంగిక దాడి వంటి తీవ్ర నేరాలు కూడా జరుగుతున్నాయి. ప్రతిరోజూ జరుగుతున్న ఈ హింస, వేధింపులు నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో మహిళల అనుభవాలను నిర్దేశిస్తున్నాయి. నగరాల్లో మహిళల కదలికలను హింస, భయం అడ్డుకుంటున్నాయి. వీటికి పేలవమైన ప్రజా రవాణా సేవలు తోడవుతున్నాయి. పనిచేయడం, తిరిగి రావడం విషయంలో కీలక వేళల్లో రవాణా ప్రణాళికలు సాధారణంగా పురుషుల ప్రయాణ నమూనాలపైనే దృష్టి పెడుతున్నాయి. మరోవైపు మహిళల ప్రయాణ నమూనాలు వారి సంరక్షక పాత్రల దృష్ట్యా పురుషులతో పోలిస్తే తరచుగా విభిన్నంగా ఉంటున్నాయని మహిళల కదలికలపై ప్రపంచ బ్యాంక్ నివేదిక చెబుతోంది.

మహిళల ప్రయాణాల్లో 84 శాతం వరకు ప్రజా రవాణా ద్వారానే జరుగుతున్నాయని ఇదే నివేదిక తెలుపుతోంది. పనికి నడిచిపోవడాన్నే మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఈ విషయంలో మహిళల వాటా 45.4 శాతంగా ఉండగా, పురుషుల శాతం 27.4గా మాత్రమే ఉంటోంది. పైగా చాలామంది మహిళలు బస్సు ద్వారా ప్రయాణిస్తున్నారు. తాము ప్రయాణిస్తున్నప్పుడు మహిళలు స్తోమతను చూసుకుంటారని ఈ నివేదిక చెబుతోంది. ఖర్చు ఎక్కువయ్యే వేగ ప్రయాణాల కంటే ఖర్చు తక్కువగా ఉండే నిదాన ప్రయాణ సాధనాలనే వీరు ఎంపిక చేసుకుంటున్నారు. రోడ్డు ప్రమాద బాధితుల్లో అధిక శాతం పురుషులేనని నివేదిక చెబుతోంది. అంటే మహిళలతో పోలిస్తే పురుషులు చాలా ఎక్కువగా బయట కెళ్లడానికి ఇష్ట పడుతుంటారనీ, సొంత బైక్‌ని కలిగి ఉంటారనీ, రాత్రిపూట ప్రయాణిస్తుంటారనీ ఇది ఎత్తి చూపు తోంది. మహిళల కదలికలపై ఆంక్షలు అనేవి పితృస్వామిక ఆచారాలు, సంరక్షక భారం నుంచి ఏర్పడుతున్నాయి. పైగా శ్రామిక శక్తిలో మహిళల స్వల్ప పాత్రపై ఇవి ప్రభావం చూపుతున్నాయి.

ప్రపంచంలోకెల్లా రోడ్డు ప్రమాదాల్లో అధిక మరణాలకు సంబంధించి భారతదేశం అత్యధిక రేటును కలిగి ఉంటోంది. బహిరంగ స్థలాల్లో మహిళలపై హింసకు సంబంధించిన అత్యధిక రేటు కూడా భారత్ సొంతమై ఉంది. మన వీధులు, రహదారులు అటు ప్రమాదాలు, ఇటు నేరాల నుంచి తప్పనిసరిగా సురక్షితంగా ఉండాలి. శర వేగంగా వెళ్లే కార్ల కంటే పాదచారుల సురక్షిత కదలికలకు వీలిచ్చేలా వీధులను రూపొందించాలి. ఇదే మన నగరాలను గణనీయంగా మారుస్తుంది. కార్లు అతివేగంగా దూసుకెళ్లేలా, మరిన్ని ఫ్లై ఓవర్లకు, ఓవర్ బ్రిడ్జిలకు, పెద్దగా వెలుతురు లేని రహదారులకు దారులు తీస్తున్న మన ప్రస్తుత రహదారి ప్రణాళికలు పాదచారులు సులభంగా గాయాలకు, హింసకు లోనయ్యేలా రూపొందుతున్నాయి. రద్దీగానూ, చక్కటి వెలుతురుతోనూ ఉంటూ మంచి పేవ్‌మెంట్లు, వీధుల్లో విక్రేతలు, షాపులు, నిఘా కెమెరాలతో కూడిన కెఫేలు తాము సురక్షితంగా ఉన్నామని మహిళలు భావించడానికి ఎంతో అనుకూలంగా ఉంటాయని దేశవ్యాప్తంగా ‘సేఫ్టీపిన్’ సంస్థ ద్వారా జరిగిన భద్రతాపరమైన మదింపులు స్పష్టం చేస్తున్నాయి. అదేవిధంగా, సైక్లింగ్ కోసం మౌలిక వసతుల కల్పన, ప్రజారవాణాను అందుబాటులోనూ, చౌకగానూ ఉంచడం వల్ల వీధుల్లో ట్రాఫిక్ తగ్గుతుంది. ఈ చర్యలు మన వీధులను సురక్షితంగానూ, అందుబాటులో ఉండేలా, ఎక్కువమందికి అనుకూలంగా మలుస్తాయి.

వ్యాసకర్త లింగ, నగరీకరణ నిపుణురాలు; ‘సేఫ్టీపిన్’ సీఈఓ

(‘ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

ఇంకేం అయివుండొచ్చు?



ఇజ్రాయిల్‌లో ఒక 34 ఏళ్ల పురుషుడు తన ఐదో బూస్టర్ డోసు తీసుకున్న గంటలోనే కుప్పకూలి చనిపోయాడు (ఇంకా అప్పటికి అతడు అది వేసిన క్లినిక్‌లోనే ఉన్నాడు). ఆరోగ్య అధికారుల స్పందన: “దీనికీ టీకాకూ సంబంధం ఉందో లేదో తెలియదు.”

– ఎలి డేవిడ్, పరిశోధకుడు

వేరే మార్గాలున్నాయి



మీకు ఒక సినిమా నచ్చితే చూడండి. నచ్చకపోయినా లేదా ఆ సినిమా నిర్మాతలతో ఒప్పందల లేకపోయినా చూడొద్దు. వాళ్లకు తగిలే చోట మీ స్పందన తెలియజేయండి. అది బాక్సాఫీస్ దగ్గర. అంతేగానీ హింస, పద్ధతిగా లేని ప్రవర్తన, బల ప్రదర్శన ఏ ఉద్దేశమూ నెరవేర్చవు.

– ఆనంద్ నరసింహన్, జర్నలిస్ట్

మర్యాద నేర్పాలి



భారతీయుల ప్రవర్తన ఘోరంగా ఉంటోంది. బహిరంగ వర్తన, సభ్యత గురించి పాఠశాల కోర్సులుండాలి. మన దురదృష్టం ఏమిటంటే, అతిదారుణమైన ప్రవర్తనకు ఉదాహరణగా నిలిచే రాజకీయ నాయకులు ఉన్నారు. నలుగురిలో ఎలా నడుచుకోవాలి, మర్యాద, ఇతరులను పట్టించుకోవడం లాంటి అంశాలను చిన్నప్పటినుంచే నేర్పాలి. (‘ఎయిర్ ఇండియా’ ఉదంతం నేపథ్యంలో)

– సాగరికా ఘోష్, జర్నలిస్ట్

ఆక్రమణలను అంగీకరించొద్దు



ఏ రూపంలోని అక్రమ ఆక్రమణల విషయంలోనైనా ప్రభుత్వం ఉక్కుపాదంతో వ్యవహరించాలి. అక్రమాలను ప్రోత్సహించడం అనేది రాజ్యానికి హితం కాదు.

– అభిషేక్ సింఘ్వీ, కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి

ఇలా కూడా ఉంటాం



“మిమ్మల్ని చూస్తే మీరు రాజస్థాన్ వాళ్లలా అనిపించడం లేదు.” “ఏం చేయను? నా ఒంటెకు ఒంట్లో బాగోక, నేను కారులో రావాల్సి వచ్చింది. అందుకని నా ముఖంమీద ఇసుక పడిన జాడలు లేవు.”

– ప్రాచీ భరద్వాజ్, న్యాయవాది

చరిత్ర రచనకు సోపానం

భారతదేశంలో రాష్ట్ర స్థాయిలో హిస్టరీ కాంగ్రెస్ లేని రోజుల్లోనే ‘ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్’ను స్థాపించడంలో ప్రధాన భూమిక పోషించినవారు మల్లిరెడ్డి పట్టాభి రామరెడ్డి. జనవరి 7, 8 తేదీల్లో కడప యోగి వేమన యూనివర్సిటీలో ఆ హిస్టరీ కాంగ్రెస్ తన 45వ వార్షిక సమావేశాన్ని నిర్వహించు కుంటోంది. ఈ సందర్భంగా పట్టాభి రామరెడ్డి గురించీ, ఏపీ హిస్టరీ కాంగ్రెస్ గురించీ సంక్షిప్తంగానైనా మాట్లాడుకోవలసి ఉంది.

పట్టాభి రామరెడ్డి గొప్ప మేధావి. అసాధారణ అధ్యాపకుడు. చరిత్ర పరిశోధకునిగా ఆయన తన తరువాతి తరాలకు మార్గం చూపించారు. ఆయన తొలిసారిగా బీఏ, ఎంఏ కోర్సులలోనూ, ఏపీపీఎస్సీ నిర్వహించే పోటీ పరీక్షలలోనూ ఆంధ్రుల చరిత్రను సిలబస్‌లో చేర్చేలా కృషి చేశారు. తెలుగు వారి చరిత్రను లోతుగా అధ్యయనం సాగించడానికి నెల్లూరు జిల్లా కావలి జవహర్ భారతి కాలేజీలో 1976 మే నెల ఒకటి, రెండు తేదీలలో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ తొలి స్థాపనా సమావేశాలను నిర్వహించారు.



మల్లిరెడ్డి పట్టాభిరామరెడ్డి

ఆయన కోరుకున్న విధంగానే ఏపీ హిస్టరీ కాంగ్రెస్... ఆదిమ యుగాల నుంచి ఇప్పటివరకూ ఉన్న తెలుగు నేల చరిత్ర, సంస్కృతులను అధ్యయనం చేసి విలువైన సంపుటాలను ప్రచురించింది. ఇవ్వాళ దేశంలో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ అంటే ఓ గౌరవం ఉంది. ఒక స్థాయి ఉంది.

పట్టాభి రామరెడ్డి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. ఎమ్ఎన్ రాయ్ ప్రభావానికి లోనై సోషలిస్టు పార్టీ రాజకీయాల్లో పాల్గొన్నారు. తాను చదువుకున్న మద్రాస్ పచ్చయప్పాస్ కళాశాలలోనే అధ్యాపకుడిగా కొంతకాలం పని చేశారు. కావలి ‘జవహర్ భారతి’లో అధ్యాపకుడిగాచేరి అనేక హోదాల్లో పనిచేశారు. అలాగే శ్రీ వెంకటేశ్వరా యూనివర్సిటీలోనూ పనిచేశారు.

ఆయన నెల్లూరు చరిత్రపైనా, మొత్తంగా తెలుగువారి చరిత్రపైనా ఎన్నో గ్రంథాలు రాశారు. ఇంతటి ప్రతిభాశాలి 2004 మార్చి 30న తుదిశ్వాస విడిచారు. ఆయన కలల పంట ఏపీ హిస్టరీ కాంగ్రెస్ మాత్రం తెలుగువారి సేవలో తరిస్తోంది.

– ప్రొ॥ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి

రిటైర్డ్ చరిత్ర ఆచార్యులు, ఎస్వీ యూనివర్సిటీ

బంగారు బాల్యంలో నేర ప్రవృత్తి

అభిప్రాయం



తడకమళ్ళ మురళీధర్

18 ఏళ్ల వయస్సు నిండని నేరం ఆరోపింపబడ్డ ప్రతి బాలుడు, బాలిక 2015 నాటి ‘బాల నేరస్థుల పరిరక్షణ చట్టం’ ప్రకారం జువెనైల్ జస్టిస్ బోర్డు (జేజే బోర్డు) ముందు విచారణ ఎదుర్కోవలసి ఉంటుంది. నేరం చేసిన తేదీ నాటి వయస్సు ప్రామాణికం అవుతుంది. అధికారిక జనన ధ్రువీకరణ పత్రం అందుబాటులో లేనట్లయితే మెడికల్ బోర్డుచే ధ్రువీకరింపబడ్డ వయస్సు ఆధారంగా కోర్టు విచారణ పరిధి నిర్ణయమవుతుంది. అరెస్టు చేసిన రోజు నుండి తుది తీర్పు దాకా జేజే బోర్డు విచారిస్తుంది. ఈ బోర్డులో మొదటి శ్రేణి జ్యుడీషియల్ న్యాయాధికారి, రాష్ట్ర ప్రభుత్వం చేత నియమింపబడే ఇరువురు సామాజిక కార్యకర్తలు సభ్యులుగా ఉంటారు. ఇరువురిలో ఒకరు మహిళ, మరొకరు చైల్డ్ సైకాలజిస్ట్ ఉంటారు.

బెయిలుపై విడుదలయ్యేంత వరకు లేదా తుది తీర్పు దాకా నిందితులను ప్రభుత్వ సంక్షేమ అధికారుల పర్యవేక్షణలోని అబ్జర్వేషన్ హోమ్‌లో ఉంచుతారు. నేరం రుజువయితే నిందితులకు కారాగార శిక్ష బదులుగా జేజే బోర్డు సభ్యులు మందలించి విడుదల చేయటం లేదా మూడు సంవత్సరాలు మించకుండా సంస్కరణ గృహానికి పంపించటం లేదా విడుదల చేసి కొన్నాళ్ల పాటు మంచి ప్రవర్తనకై జిల్లా ప్రొబేషనరీ అధికారి పర్యవేక్షణలో ఉంచటం లేదా సామాజిక సేవ చేసే ఉత్తర్వులు లేదా జరిమానా చెల్లింపుకు ఆదేశాలివ్వటం జరుగుతుంది. ఇందుకై జిల్లా ప్రొబేషనరీ అధికారి ఇచ్చే సామాజిక దర్యాప్తు నివేదికను పరిగణనలోకి తీసుకుంటారు. ఇరువురు సభ్యుల తీర్పులో ఏకాభిప్రాయం రానట్లయితే జ్యుడీషియల్ అధికారి తీర్పు చెలామణి అవుతుంది. నేరం రుజువు కాలేదని జేజే బోర్డు తీర్పిస్తే దానిపై అప్పీలు లేదు. 16 ఏళ్లు పైబడిన నిందితుల కేసుల్లో లేదా అతి హేయమైన నేరం చేసిన కేసుల్లో మాత్రమే అప్పీలు ఉంటుంది.



విచారణ ప్రక్రియ మధ్యలో నిందితులు 18 ఏళ్ల వయస్సు దాటినా, జేజే బోర్డు మాత్రమే కేసు కొనసాగిస్తుంది. నేరం రుజువై ప్రభుత్వ సంస్కరణ గృహానికి పంపబడిన వారిని మంచి పౌరులుగా పరివర్తన తేవటానికి వృత్తి విద్య, కౌన్సెలింగ్ లాంటివి చేపడతారు. హత్య, మానభంగం, లైంగిక అత్యాచారం లాంటి అతి హేయమైన నేరం గురించి 16–18 ఏళ్ల వయసున్న నిందితుడు మానసికంగా, భౌతికంగా తను చేస్తున్న నేరం పరిణామాల గురించి అర్థం చేసుకునే పరిపక్వత ఉండీ నేరం చేసినాడని జేజే బోర్డు ప్రాథమిక అంచనాకు వస్తే ఆ కేసును బాలల కోర్టుకు నిందితుడిని పెద్ద వాడిగా భావించి ఇతర కేసుల్లాగే విచారణ జరిపే నిమిత్తం బదిలీ చేసే విచక్షణాధికారం ఉంది.

ఇదిలా ఉండగా 16–18 ఏళ్ల వయసున్న నిందితులు చేసిన అతి హేయమైన నేరంపై జేజే బోర్డు ఒక నిర్ణాయిక ప్రాథమిక అంచనాకు రావడానికి మార్గదర్శకాలు జారీ చేయాల్సిందిగా ‘బరున్ చంద్ర ఠాకూర్ వర్సెస్ మాస్టర్ భోలు’ అనే కేసు విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం 2022 జూలై 13న ఉత్తర్వులు జారీ చేసింది. వాటికి అనుగుణంగా జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ ముసాయిదా మార్గదర్శకాలు తయారు చేసి, తగిన సలహాలు, సూచనలు 2023 జనవరి 20 లోగా ఇవ్వాల్సిందిగా బహిరంగంగా ప్రజలను, నిపుణులను కోరింది.

ఒకసారి మార్గదర్శకాలకు తుది రూపు వస్తే, అన్ని జేజే బోర్డులు నిందితులు చేసిన అతి హేయమైన నేరంపై ఏకరూప ప్రాథమిక అంచనా తీర్పు వెలువరించే అవకాశముంది. తద్వారా హత్య, లైంగిక దాడి లాంటి అతి హేయమైన కేసులకు పాల్పడిన 16 ఏళ్లు నిండిన నిందితులను బాలల కోర్టులో విచారణ జరిపే అవకాశముంది. అయినా కూడా 18 సంవత్సరాల వయస్సులోపు వారికి మరణ శిక్ష లేదా యావజ్జీవ కారాగార శిక్ష విధించరాదని చట్టం చెప్తోంది.

కొద్ది మాసాల క్రితం జూబ్లీ హిల్స్‌లోని అమ్నీసియా పబ్ వద్ద ఇన్నోవా వాహనంలో బాలికపై సామూహిక అత్యాచార ఆరోపణ కేసులో 16 ఏళ్లు నిండిన నలుగురు బాలురను మామూలు నిందితుల మాదిరే విచారణ జరపాలని జేజే బోర్డు పోక్సో కోర్టుకు పంపించటం మనందరికీ విదితమే.

జాతీయ నేర గణాంకాల నమోదు సంస్థ 2021 వార్షిక నివేదిక ప్రకారం మన దేశంలో బాలబాలికల మీద 2019లో 32,269 కేసులు, 2020లో 29,768 కేసులు, 2021లో 31,170 కేసులు నమోదైనాయి. దీన్ని బట్టి బాలబాలికల్లో హింసాత్మక, నేర ప్రవృత్తి స్థాయి మనకు అవగతమవుతుంది. దీనికి తల్లిదండ్రుల నిరాదరణ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు కొన్ని కారణాలు. వీటిని పరిహరించడం ద్వారానే రేపటి పౌరులను నేర ప్రపంచం లోకి వెళ్లకుండా ఆపగలం.

వ్యాసకర్త విశ్రాంత జిల్లా జడ్జి । 98485 45970

రవి అస్తమించని ప్రవాస భారతీయం

సందర్భం



కోరాడ శ్రీనివాసరావు

ప్రపంచ నలుమూలలా భారతీయులు నివసిస్తున్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం 210 దేశాలలో భారతీయ మూలాలున్నవారు, ఎన్నారైలు కలిపి 3.2 కోట్లకు పైగానే ఉన్నారు. ప్రవాస భారతీయ జనాభా కంటే తక్కువ జనాభా కలిగిన దేశాలు 150 పైనే ఉన్నాయి.

నేడు అనేక దేశాల్లో రాజకీయంగా కూడా భారతీయులు కీలక పదవుల్లో ఉన్నారు. అమెరికా ఉపాధ్యక్ష పదవిని కమలా హారిస్ అలంకరించిన సంగతి తెలిసిందే. అలాగే హైదరాబాద్‌లో జన్మించిన తెలుగింటి బిడ్డ అరుణ మిల్లర్ (కాట్రగడ్డ అరుణ) మేరీలాండ్ రాష్ట్రానికి గత నవంబర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం వివిధ దేశాల్లో భారతీయ మూలాలున్న వ్యక్తులు వివిధ దేశాలకు అధినేతలుగా వ్యవహరిస్తున్నారు. రిషి సునాక్ (బ్రిటన్ ప్రధాని), ఆంటోనియ కోస్టా (పోర్చుగల్ ప్రధాని), మహ్మద్ ఇర్ఫాన్ అలీ (గయానా ప్రెసిడెంట్), పృథ్వీరాజ్ రూపన్ (మారిషస్ అధ్యక్షులు), చంద్రిక పెర్సద్ శాన్ టోఖి (సురినామ్ ప్రెసిడెంట్) లతోపాటు 200 మందికి పైగా భారతీయులు 15 దేశాల్లో వివిధ హోదాల్లో ప్రజాసేవలో ఉన్నారు. వీరంతా అమెరికా, యూకే, కెనడా, గయానా, సురినామ్, ఫిజీ, ట్రినిడాడ్ అండ్ టుబాగో, సింగపూర్, మారిషస్, పోర్చుగల్, దక్షిణాఫ్రికా, మలేసియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో పనిచేస్తున్నారు. వీరు కాకుండా వివిధ దేశాల్లో, కేంద్ర, రాష్ట్ర చట్టసభల్లో సభ్యులుగా ఉన్నవారు చాలామందే ఉన్నారు. గతంలో సింగపూర్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఎస్.ఆర్.నాథన్ (1999–2011), దేవన్ నాయర్ (1981–1985)లు, ఫిజీ ప్రధానిగా పనిచేసిన మహేంద్ర చౌదరి, మలే సియా ప్రధానిగా పని చేసిన మహతీర్ బిన్ మహ్మద్ వంటి వారు భారతీయ మూలాలున్నవారే.



ప్రపంచంలోని అగ్రస్థానాల్లో ఉన్న గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ళ, ఈ మధ్య వరకు ట్విట్టర్ సీఈఓగా కొనసాగిన పరాగ్ అగర్వాల్, పెప్సీకోలా ఒకప్పటి సీఈఓ ఇంద్రనూయి వంటి వారెందరో భారతీయ మూలలున్నవారే. నేడు ప్రపంచంలో వివిధ దేశాల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న ప్రవాస భారతీయులు బ్రిటిష్ రాజ్ కాలంలో, తదనంతరం విదేశాలకు వెళ్ళినవారే. ముఖ్యంగా వ్యవసాయం పనుల కోసం వెళ్ళిన భారతీయులు అక్కడ స్థిరపడ్డారు. మారిషస్, గయానా, ట్రినిడాడ్ అండ్ టుబాగో, కెనడా, దక్షిణాఫ్రికా మలేసియా, ఫిజీ వంటి కామన్వెల్త్ దేశాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నవారు వీరే!

స్వాతంత్ర్యానంతరం ప్రపంచ కలల దేశమైన అమెరికాకు భారతీయ వలసలు ప్రారంభమై, నేడు సుమారు 45 లక్షల మంది ఆ గడ్డపై తమవంతు పాత్ర నిర్వహిస్తున్నారు. 10 దేశాల్లో భారతీయుల జనాభా 10 లక్షలు దాటితే మరో 22 దేశాల్లో లక్షకు పైగా వున్నారు. దర్బన్ నగరాన్ని మినీ ఇండియాగా అభివర్ణిస్తారంటే ఆ నగరంలో భారతీయుల హవాని అర్థం చేసుకోవచ్చు. ప్రతీ ఏడు 25 లక్షల భారతీయులు విదేశాలకు వలస వెళ్తున్నారు భారతీయ వలసల్లో ఇదే పంథా కొనసాగితే ఈ శతాబ్దం అంతానికి భారతీయ పరిమళాలు ధరణి అంతా మరింత వ్యాపించి రవి అస్తమించని ‘భారతీయం’ సాక్షాత్కరిస్తుంది.

వ్యాసకర్త ప్రభుత్వాధికారి, ఏపీ । 94410 08574

(జనవరి 8–10 ప్రవాసీ దివస్ ఉత్సవాల సందర్భంగా)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** బ.పాడ్యమి తె.5.24 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి విదియ, **నక్షత్రం:** పునర్వసు రా.2.07 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.12.50 నుండి 2.36 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.35 నుండి 8.04 వరకు, **అమృతఘడియలు:** రా.11.25 నుండి 1.11 వరకు ; **రాహుకాలం :** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం :** ప.1.30 నుండి 3.00 వరకు ; **సూర్యోదయం** 6.36 ; **సూర్యాస్తమయం** 5.36.

క్లుప్తంగా...

గ్రూప్‌-1లో అదనంగా మరో 19 పోస్టులు

- 111కి పెరిగిన పోస్టుల సంఖ్య
- కోర్టు తుది తీర్పునకు లోబడి ఈ పోస్టుల భర్తీ
- ఏపీపీఎస్సీ ప్రకటన

సాక్షి, అమరావతి: గ్రూప్‌–1 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (ఏపీపీఎస్సీ) జారీ చేసిన నోటిఫికేషన్‌ (28/2022)లో పోస్టుల సంఖ్య 111కి పెరిగింది. 2018లో జారీచేసిన గ్రూప్‌–1 నోటిఫికేషన్‌లోని 167 పోస్టుల్లో 19 జాయిన్‌ అవ్వకపోవడం, భర్తీ కాకపోవడంతో మిగిలిపోయాయి. ఈ నేపథ్యంలో ఆ 19 పోస్టులను ప్రస్తుత గ్రూప్‌–1 నోటిఫికేషన్‌కు జత చేస్తున్నట్లు ఏపీపీఎస్సీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అయితే ఈ పోస్టులకు సంబంధించి కొన్ని అంశాలు న్యాయస్థానం విచారణలో ఉన్నందున కోర్టు తుది తీర్పునకు లోబడి వీటిని భర్తీ చేస్తామని ఏపీపీఎస్సీ తెలిపింది. కాగా, 19 పోస్టుల్లో 17 ఎంపికైన అభ్యర్థులు జాయిన్‌ కాకపోవడంతో మిగిలినవి. అలాగే మరో రెండు భర్తీ కాకుండా ఉన్నవి.

హరియాణ సీఎంకు శారదాపీఠం ఆహ్వానం



సీఎం మనోహర్‌లాల్‌ ఖట్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

సాక్షి, న్యూఢిల్లీ/సింహాచలం: హరియాణ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్‌ ఖట్టర్‌ను ఢిల్లీ శివారు గుర్గావ్‌లోని పీడబ్ల్యూడీ బంగ్లాలో శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి శుక్రవారం కలిశారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాల్లో పాల్గొని రాజ శ్యామల అమ్మవారి అనుగ్రహం, పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకోవాల్సిందిగా కోరారు. అలాగే హరియాణలోని కురుక్షేత్ర వద్ద ఉన్న గుంతిధామ్‌లో శారదాపీఠం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11 నుంచి 16 రోజులపాటు లక్ష చండీయాగం నిర్వహించనున్నట్లు వివరించారు. యాగం నిర్వహణకు సహకరించాలని ముఖ్యమంత్రిని కోరారు.

శ్రీచైతన్య హ్యాట్రిక్‌ ప్రపంచ రికార్డు



వరల్డ్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ రాజీవ్‌ నుంచి సర్టిఫికెట్‌ అందుకుంటున్న సీమ

సాక్షి, హైదరాబాద్‌: ఇప్పటికే రెండు వరల్డ్‌ రికార్డులను సృష్టించి తనకు తానే సాటి అని నిరూపించుకున్న శ్రీచైతన్య స్కూల్‌ ఈనెల 5న మరో ప్రపంచ రికార్డుతో చరిత్ర తిరగరాసింది. 100 రోజుల శిక్షణతో 10 రాష్ట్రాల్లోని 73 బ్రాంచీల నుంచి 400 లింక్స్‌ ద్వారా 2వేలకు పైగా ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులు పాల్గొని 1 నుంచి 100 వరకు మ్యాథ్‌ టేబుల్స్‌ 100 నిమిషాల్లోపు అప్పజెప్పి వరల్డ్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో స్థానం సాధించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య స్కూల్స్‌ అకడమిక్‌ డైరెక్టర్‌ సీమ మీడియాతో మాట్లాడుతూ స్టూడెంట్స్‌, టీచర్స్‌ కృషితోనే ఇంతటి గొప్ప విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్‌ రావు వరల్డ్‌ రికార్డు సాధించిన చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

కౌంటర్‌ దాఖలు చేయండి..

నారాయణ కేసులో ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ : గతేడాది ప్రశ్న పత్రాల లీకేజీ కేసులో మాజీ మంత్రి పి.నారాయణ దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్‌ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. బెయిలు రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్‌ చేస్తూ నారాయణ దాఖలు చేసిన పిటిషన్‌ శుక్రవారం జస్టిస్‌ ఎస్‌.రవీంద్ర భట్‌, జస్టిస్‌ దీపాంకర్‌దత్తాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులిచ్చింది. తదుపరి విచారణ వరకు హైకోర్టు ఆదేశాల్లోని ఆపరేషనల్‌ పార్ట్‌పై సస్పెన్షన్‌ విధిస్తున్నట్లు పేర్కొంది.

కృష్ణా బోర్డు సమావేశం వాయిదా



సాక్షి, హైదరాబాద్‌: ఈనెల 11న జరగాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) సమావేశాన్ని వాయిదా వేసినట్లు బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే శుక్రవారం ఏపీ, తెలంగాణలకు లేఖ రాశారు. సమావేశం కొత్త తేదీని ఖరారు చేసి తెలియజేస్తామని పేర్కొన్నారు.

వేగంగా 'ప్రాధాన్యత' పనులు

పనుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తున్న ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మంత్రులు, ప్రజాప్రతినిధులు గుర్తించిన ప్రాధాన్యత పనులు వేగంగా జరుగుతున్నాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రతి సచివాలయం పరిధిలో అత్యంత ప్రాధాన్యత గల పనులను గుర్తించి, ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. ఇలా అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన రూ.1,002.34 కోట్ల విలువైన 25,934 పనులను పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేశారు. వీటిలో ఇప్పటివరకు రూ.922.88 కోట్ల విలువైన 23,845 పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో రూ.758 కోట్లకు పైగా విలువైన 20,408 పనులు ప్రారంభం కాగా, రూ.32.15 కోట్ల విలువైన 813 పనులను పూర్తి చేశారు. రాష్ట్రంలో మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 2వ తేదీ వరకు 5,173 సచివాలయాలను మంత్రులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. వాటి పరిధిలో ప్రజలకు అవసరమైన అత్యంత ముఖ్యమైన ప్రాధాన్యత పనులను గుర్తించి, వాటి వివరాలను గడప గడపకు మన ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత పనుల పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేస్తున్నారు. ఇలా అప్‌లోడ్‌ చేసిన పనులను వెంటనే మంజూరు చేయడం, వాటిని ప్రారంభించడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. ఈ పనులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఒక్కో సచివాలయం పరిధిలోని పనులకు రూ.20 లక్షల చొప్పున రూ.3,000 కోట్లు మంజూరు చేయడమే కాకుండా, పూర్తయిన పనుల బిల్లుల చెల్లింపునకు తొలి విడతగా రూ.500 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను డీడీవోలకు పంపింది. ఈ పనుల పురోగతిని కూడా ఎప్పటికప్పుడు గడప గడపకు మన ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత పనుల పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేయాలని ఇంజనీరింగ్‌ అసిస్టెంట్లు, ఎంపీడీవోలను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. పూర్తయిన పనుల బిల్లులను సీఎఫ్‌ఎంఎస్‌ పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేసి నిబంధనల ప్రకారం చెల్లించాలని డీడీవోలను ఆదేశించింది. పనుల పురోగతి, బిల్లుల చెల్లింపులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్‌.జవహర్‌ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు.



నిరంతరం పర్యవేక్షణ, అధిక ప్రాధాన్యత : ప్రత్యేక సీఎస్‌ అజయ్‌ జైన్‌

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పనులు మంజూరు, ప్రారంభం, నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని గ్రామ, వార్డు, సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌ జైన్‌ తెలిపారు. ప్రస్తుతం ఈ పనులు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. పూర్తయిన పనుల బిల్లులు చెల్లించేందుకు తొలి దశలో నిధులు విడుదల చేశామన్నారు. పనులు పూర్తవుతున్న కొద్దీ నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రతి గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ ప్రాధాన్యత పనులపై సమీక్షించి, తగిన ఆదేశాలు జారీ చేస్తున్నారని తెలిపారు.

- పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో పీహెచ్‌డీ, ఎంఎస్‌ కోర్సులకు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అకడమిక్‌ డీన్‌ డాక్టర్‌ టి.కురుమయ్య తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో రెండో సెమిస్టర్‌కు సంబంధించి మొత్తం 59 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

'గీతం' ఆక్రమణలోని ప్రభుత్వ భూమి స్వాధీనం

ప్రభుత్వ స్థలంలో కంచె ఏర్పాటు

- పదిచోట్ల హెచ్చరిక బోర్డులు కూడా..
- మొత్తం 5.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు
- కోర్టులో ఉన్న వాటి జోలికి వెళ్లలేదు : ఆర్డీవో భాస్కర్‌రెడ్డి



కంచె వేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కొమ్మాది (విశాఖ జిల్లా) : గీతం వైద్య కళాశాల ఆవరణలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు శుక్రవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకుని కంచె వేశారు. అందులో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటుచేశారు. ఇక్కడ సర్వే నంబర్‌–17లో మొత్తం 14 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో గుర్తించారు. అయితే, ఇందులో కళాశాలకు, ప్రభుత్వ స్థలానికి మధ్యనున్న 5.72 ఎకరాల స్థలంలో ఈ కంచెను ఏర్పాటుచేసినట్లు ఆర్డీవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. వాస్తవానికి సర్వే నంబర్‌ 15, 20, 37, 38లో 40 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైనప్పటికీ అది ప్రస్తుతం కోర్టులో ఉందని తెలిపారు.

గతంలోనే మార్క్‌ చేశాం

ఇక కళాశాలకు ఆనుకుని ఉన్న 14 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలోనే స్వాధీనం చేసుకున్నామని.. అయితే, ఈ స్థలంలో గ్రీనరీ పెంచుతూ, ప్లే గ్రౌండ్‌గా తయారుచేశారని భాస్కర్‌రెడ్డి వివరించారు. అంతేకాక.. ప్రస్తుతం 14 ఎకరాలను గీతం యాజమాన్యం యథేచ్ఛగా ఉపయోగించుకుంటోందని, కలెక్టర్‌ మల్లికార్జున ఆదేశాల మేరకు ఇందులో 5.72 ఎకరాల స్థలానికి కంచె వేసినట్లు భాస్కర్‌రెడ్డి తెలిపారు. మిగిలిన స్థలానికి ప్రభుత్వ భూములు సరిహద్దుగా ఉండటంతో ఎలాంటి కంచెలు ఏర్పాటుచేయలేదని ఆయన చెప్పారు. ఈ స్థలంలో ఎటువంటి నిర్మాణాల్లేవని.. కానీ, త్వరితగతిన కంచె ఏర్పాటు పనులు పూర్తికావాలనే ఉద్దేశంతో తెల్లవారుజామున పనులు చేపట్టామని భాస్కర్‌రెడ్డి తెలిపారు. మొత్తం పదిచోట్ల ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశామని ఆయన వివరించారు. కోర్టులో ఉన్నందున నిర్మాణాల జోలికి వెళ్లలేదని ఆర్డీవో స్పష్టం చేశారు. ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఆయన చెప్పారు.

వైఎస్సార్‌ కంటి వెలుగు మూడో విడతపై దృష్టి

- మే చివరికి పూర్తి చేసేలా చర్యలు
- ఇప్పటికే 22 లక్షల మంది వృద్ధులకు స్క్రీనింగ్‌
- రెండు విడతల్లో 66.17 లక్షల మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు
- 1.58 లక్షల మందికి కళ్లద్దాల పంపిణీ



సాక్షి, అమరావతి: డాక్టర్‌ వైఎస్సార్‌ కంటి వెలుగు పథకం మూడో విడతను ఈ ఏడాది మే నెలాఖరులోగా పూర్తి చేయాలని నిర్దేశించుకున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అదనంగా స్క్రీనింగ్‌ బృందాలను సమకూర్చడం లాంటి అంశాలపై దృష్టి సారించారు. సామూహిక కంటి పరీక్షల ద్వారా 5.60 కోట్ల మంది ప్రజల్లో నేత్ర సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో వైఎస్సార్‌ కంటి వెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2019లో ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆరు దశల్లో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించే ప్రణాళిక రూపొందించారు.

తొలి రెండు దశల్లో ఇలా

తొలి రెండు దశల్లో 60,393 పాఠశాలల్లో 66,17,613 మంది విద్యార్థులకు కంటి సమస్యలు గుర్తించేందుకు స్క్రీనింగ్‌ నిర్వహించారు. నేత్ర సమస్యలతో బాధపడుతున్న 1,58,227 మందికి ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేసింది. 310 మంది విద్యార్థులకు కేటరాక్ట్‌ సర్జరీలు చేశారు. కంటి వెలుగు ద్వారా అత్యధికంగా బీసీ సామాజిక వర్గాలకు చెందిన 34 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరింది. ఇతర విద్యార్థుల్లో ఓసీలు 14.42 లక్షలు, ఎస్సీలు 13.17 లక్షలు, ఎస్టీలు 4.50 లక్షల మంది ఉన్నారు.

మూడో విడతలో 56.88 లక్షల మందికి స్క్రీనింగ్‌

రాష్ట్రంలో 60 ఏళ్ల పైబడిన 56,88,424 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించేలా మూడో విడత కార్యక్రమాన్ని 2020 ఫిబ్రవరిలో ప్రారంభించారు. ఇప్పటి వరకూ 22,91,593 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 10,91,526 మందికి మందుల ద్వారా నయం చేయవచ్చని గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 10,21,007 మందికి కళ్లద్దాలు అవసరం కాగా 8.50 లక్షల మందికి పంపిణీ పూర్తైంది. 1,66,385 మంది వృద్ధులు శుక్లాలతో బాధ పడుతున్నట్టు గుర్తించి ఉచితంగా సర్జరీలు నిర్వహిస్తోంది.

వేగంగా పూర్తయ్యేలా అదనపు బృందాలు

వృద్ధులందరికి కంటి పరీక్షలు వేగంగా పూర్తి చేసేలా ప్రతివారం సమీక్ష నిర్వహిస్తున్నాం. మే నెలాఖరులోగా మూడో విడత పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాం. ఐదు నెలల్లో 33.96 లక్షల మంది స్క్రీనింగ్‌కు వీలుగా అదనపు బృందాలను నియమిస్తాం. పీఎంవో/పీఎంవోఏ రోజుకు 60 మందిని స్క్రీనింగ్‌ చేయాల్సి ఉంటుంది. ఏఎన్‌ఎం, ఆశా వర్కర్‌లు స్క్రీనింగ్‌, కళ్లద్దాల పంపిణీ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటారు. పీహెచ్‌సీ మెడికల్‌ ఆఫీసర్లు తమ పరిధిలో రోజువారి స్క్రీనింగ్‌ కార్యక్రమాలను పర్యవేక్షించాలి.

– డాక్టర్‌ యాస్మిన్‌, డాక్టర్‌ వైఎస్సార్‌ కంటి వెలుగు రాష్ట్ర ప్రత్యేకాధికారి

సీఎం.. నిన్ను భూ స్థాపితం చేస్తా

- కుప్పం నియోజవర్గం గుడుపల్లెలో చంద్రబాబు ధ్వజం



బాబు పర్యటనలో తక్కువగా ఉన్న జనం

సాక్షి, చిత్తూరు : నిబంధనల పేరుతో తనను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని శాశ్వతంగా భూ స్థాపితం చేస్తానని, వైఎస్సార్‌సీపీని బంగాళాఖాతంలో కలిపేస్తానని ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. కుప్పం నియోజకవర్గంలో మూడో రోజు శుక్రవారం ఆయన గుడుపల్లెలో పర్యటించారు. గుడుపల్లె క్రాస్‌ నుంచి బస్టాండు వరకు సుమారు 300 మీటర్లు కాలినడకన వెళ్లారు. తన ప్రచార రథం తిరిగి ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ బస్టాండ్‌ వద్ద రోడ్డుపై ధర్నాకు దిగారు. అక్కడే బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం తన కాన్వాయ్‌లోని ఓ వాహనంపైకి ఎక్కి ప్రసంగించారు. కుప్పంలోనే కాకుండా గుడుపల్లెలోని మూడు రోడ్ల కూడలిలో కూడా భారీ స్థాయిలో బారికేడ్లతో పోలీసులు తీవ్ర ఆంక్షలు పెట్టారన్నారు. వేలాది మంది పోలీసులను ఎందుకు మోహరించారని ప్రశ్నించారు. తన నియోజకవర్గం కుప్పానికి రావడం తప్పా? తానేమైనా నక్సలైట్‌నా.. అంటూ ధ్వజమెత్తారు. 'మా కార్యకర్తలనే కొట్టి తిరిగి మా వాళ్లపైనే కేసులు పెడతారా? ఇష్టానుసారం ప్రవర్తిస్తే ఊరుకునేది లేదు. ప్రజలు తిరగబడితే పారిపోవడం ఖాయం. సైకో ముఖ్యమంత్రి ఆదేశాలతోనే పోలీసులు అతిగా వ్యవహరిస్తున్నారు. పోలీసుల బానిసత్వం సిగ్గుచేటు. ఎవరి డ్యూటీ వారు చేయాలి. నన్ను కుప్పం నుంచి పంపాలని చూశారు. మిమ్మల్ని పంపిస్తాను తప్ప నేను వెళ్లే ప్రసక్తే లేదు. ఇదేం ఎమర్జెన్సీ కాదు. అనుమతులు అడిగితే సమాధానం చెప్పకుండా పోలీసులు పారిపోవడం సిగ్గుచేటు' అని మండిపడ్డారు.

మీకో రూలు.. మాకో రూలా?

'సీఎం జగన్‌రెడ్డీ.. రాజమండ్రిలో సభ పెట్టావు. మంత్రి బొత్స, డిప్యూటీ స్పీకర్‌, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ ర్యాలీలు, సభలు పెట్టిన విషయం తెలియదా? మీకో రూలు.. మాకో రూలా? సిగ్గులేదా?' అని చంద్రబాబు ప్రశ్నించారు. పోలీసులు అందరినీ సమానంగా చూడాలని, లేకపోతే జనమే మీ ముఖాలపై ఉమ్మివేస్తారన్నారు. 'ఇది ప్రజాస్వామ్యమా? ఉన్మాద సీఎం చెబితే అక్రమ కేసులు పెడతారా? జగన్‌ రెడ్డీ.. హద్దులు దాటావు. ఘోరాలు చేశావు. నీ బట్టలు విప్పి నడిరోడ్డుపై నిలబెట్టే రోజులు తొందరలోనే వస్తాయి. నా పోరాటం తెలుగు ప్రజల కోసమే. ఈ సీఎం ఒక్కరికైనా ఉద్యోగం ఇచ్చారా? జాబ్‌ క్యాలెండర్‌ వచ్చిందా? నేను అధికారంలో ఉన్నప్పుడు హంద్రీ–నీవా నీళ్లు రామకుప్పం వరకు తీసుకువచ్చాను. అక్కడి నుంచి కుప్పంకు నీళ్లు తీసుకురావడానికి సీఎం చొరవ చూపలేదు. గతంలో నేను పులివెందులకు నీళ్లు ఇచ్చాను. ఈ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలన్నీ పెరిగిపోయాయి. బాబాయ్‌నే గొడ్డలి పెట్టుతో లేపేసి గుండెపోటుగా చిత్రీకరించారు. పోలీసులకు దమ్ముంటే ఆ కేసును నిగ్గు తేల్చాలి. కందుకూరు ఘటన ప్రభుత్వం, పోలీసు కుట్రలో భాగమే' అని అన్నారు.

దాచేందుకే డ్రామాలు

- 11 మందిని పొట్టనబెట్టుకుని ఏమిటీ ఉన్మాదం?: మంత్రి అంబటి
- ప్రజల ప్రాణాలను పరిరక్షించడానికే జీవో నంబర్‌ 1



సాక్షి, అమరావతి: అధికార దాహం, ప్రచార పిచ్చితో ఇటీవల 11 మందిని పొట్టన పెట్టుకున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రజల ప్రాణాలను పరిరక్షించేందుకు జారీ చేసిన జీవో 1పై మూడు రోజులుగా కుప్పంలో పిచ్చికుక్కలా అరుస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. చట్టాన్ని ఉల్లంఘించి ఉన్మాదిలా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జీవో నంబర్‌ 1ని ఉల్లంఘించి, చట్టాన్ని అతిక్రమిస్తే సహించే ప్రశ్నే లేదని హెచ్చరించారు. తన పర్యటనల్లో ఇటీవల 11 మంది చనిపోయిన ఘటనలను కప్పిపుచ్చేందుకు కుప్పంలో లేనిపోని ఆవేశాన్ని తెచ్చుకుని చంద్రబాబు డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. లాఠీ చార్జీలో ఎవరికీ దెబ్బలు తగలకపోయినా చంద్రబాబు పరామర్శలంటూ ఎల్లో మీడియాలో కవరేజీ ఇవ్వడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కుప్పంలో హింస చెలరేగి కాల్పుల్లో ఎవరైనా మరణించాలని చంద్రబాబు కోరుకుంటున్నారని మండిపడ్డారు. అధికారం కోసం చంద్రబాబు ఎన్ని శవాలపైన అయినా నడుస్తారని వ్యాఖ్యానించారు.

సీఎం జగన్‌ వెంటే కుప్పం

సంక్షేమ పథకాలతో కుప్పంలో ప్రతి ఇంటికీ సీఎం జగన్‌ చేరువయ్యారని అంబటి చెప్పారు. రెవెన్యూ డివిజన్‌ ఏర్పాటు చేసి కుప్పం బ్రాంచ్‌ కెనాల్‌ పనులను వేగవంతం చేసిన సీఎం జగన్‌ వెంట అంతా నడుస్తున్నారని, వరుసగా స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయమే అందుకు నిదర్శనమన్నారు. కుప్పం కోట కూలిపోవడం, వచ్చే ఎన్నికల్లో గెలవలేననే భయంతో చంద్రబాబు పదే పదే పర్యటిస్తూ రౌడీయిజం చేస్తున్నారని ఆరోపించారు. అందుకు భయపడే వారు ఎవరూ లేరని, వచ్చే ఎన్నికల్లోనూ కుప్పంలో టీడీపీకి ఘోర పరాజయం తప్పదని స్పష్టంచేశారు. గత ప్రభుత్వాల హయాంలోనూ సలహాదారులున్నారని అంబటి గుర్తుచేశారు.

వైఎస్సార్‌సీపీ జెండా చూసి బాబు ఆగ్రహం

- స్థానిక టీడీపీ నేతల వల్లే పార్టీ దెబ్బ తినిందని ధ్వజం
- ఆద్యంతం జన స్పందన లేక సీఎంపై తిట్ల దండకం
- ఫొటో, వీడియో గ్రాఫర్లపై బాబు అనుచిత వ్యాఖ్యలు..
- క్షమాపణలు చెప్పకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరిక

గుడుపల్లి/శాంతిపురం/సాక్షిప్రతినిధి, తిరుపతి/తిరుపతి కల్చరల్‌ : స్థానిక నాయకుల వల్లే కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ దెబ్బతినిందని ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన శుక్రవారం రాత్రి కుప్పం నియోజకవర్గంలోని సంగనపల్లిలో డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద స్థానికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ నేపథ్యంలో ఎదురుగా ఉన్న దిమ్మెపై వైఎస్సార్‌సీపీ జెండా, ఫ్యాన్‌ కనిపించాయి. దీంతో చంద్రబాబు ఒక్కసారిగా అసహనానికి గురై.. స్థానిక నాయకులపై మండిపడ్డారు. తాను పార్టీ కోసం, ప్రజల కోసం ఎంతగానో శ్రమిస్తుంటే సొంత పార్టీ వారు కొందరు ఏమీ పట్టనట్టు ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం చిన్నగొల్లపల్లి, ఎం.వి.కొత్తూరు, కోడిగానిపల్లి, సంగనపల్లి, చిన్నపర్తిగుంటలో స్థానికులతో మాట్లాడారు. ఆ తర్వాత బెంగళూరుకు వెళ్లారు.

ఊరూరా జనం కరువే...

తన మూడు రోజుల కుప్పం నియోజకవర్గం పర్యటనలో జనం నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో చంద్రబాబు పబ్లిసిటీ కోసం తాపత్రయపడ్డారు. పోలీసులతో గొడవకు దిగడం, సీఎంను ఇష్టానుసారం తిట్టడం ద్వారా ప్రచారం పొందడానికి యత్నించారు. శుక్రవారం గుడుపల్లిలోనూ జనం రాకపోవడంతో బారికేడ్ల ఏర్పాటు విషయాన్ని తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేశారు. జనం రాకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారని చెప్పుకొచ్చారు. కందుకూరు ఘటన పేరుతో గుడుపల్లి వద్ద సభకు అనుమతి ఇవ్వలేదని పోలీసులపై మండిపడ్డారు. గంటకు పైగా ఊకదంపుడు ఉపన్యాసంతో వచ్చిన కొద్ది మంది కూడా పారిపోయేలా చేశారని ఆ పార్టీ నేతలే చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా గురువారం ఫొటో, వీడియో గ్రాఫర్లపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని, వెంటనే క్షమాపణ చెప్పాలని తిరుపతి ఫొటో, వీడియో గ్రాఫర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూసపాటి మోహన్‌రాజు డిమాండ్‌ చేశారు. తిరుపతిలోని అసోసియేషన్‌ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. ఫొటోలు తీస్తున్న వారి వైపు చూపిస్తూ.. 'ఏయ్‌.. ఎవడు వాడు.. ఎత్తి పడేయండి' అని కార్యకర్తలను ఉసికొల్పడం దుర్మార్గ చర్య అన్నారు. ఈ వ్యాఖ్యల పట్ల క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

9న పీఎం జాతీయ అప్రెంటిస్‌షిప్‌ మేళా

- ఏపీలో 9 జిల్లాల్లో నిర్వహణ
- దేశవ్యాప్తంగా మొత్తం 242 జిల్లాల్లో ఏర్పాట్లు



సాక్షి, న్యూఢిల్లీ : స్కిల్‌ ఇండియా మిషన్‌లో భాగంగా యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా 242 జిల్లాల్లో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్‌ మేళాను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. స్కిల్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ అప్రెంటిస్‌షిప్‌ మేళాలో వివిధ సంస్థలు పాల్గొని యువత కొత్త నైపుణ్యాలు నేర్చుకొనేందుకు అవకాశాలు ఇవ్వనున్నాయి. ఈ అప్రెంటిస్‌షిప్‌ మేళాను ఆంధ్రప్రదేశ్‌లోని 9 జిల్లాల్లో, తెలంగాణలోని 6 జిల్లాల్లో నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం ప్రభుత్వ ఐటీఐ(బీ), కాకినాడ ప్రభుత్వ ఐటీఐ, విజయవాడ ప్రభుత్వ ఐటీఐ, మాచర్ల ప్రభుత్వ రెసిడెన్షియల్‌ ఐటీఐ, ఒంగోలు ప్రభుత్వ ఐటీఐ(బీ), ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ, తిరుపతి ప్రభుత్వ ఐటీఐ, విశాఖపట్నం ప్రభుత్వ ఐటీఐ(ఓల్డ్‌), కడప ప్రభుత్వ ఐటీఐ కాలేజీల్లో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్‌ మేళా నిర్వహించనున్నారు. తెలంగాణలోని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ, ముషీరాబాద్‌ ప్రభుత్వ ఐటీఐ, భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐ, పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ, అల్వాల్‌ ప్రభుత్వ ఐటీఐ, భువనగిరి ప్రభుత్వ ఐటీఐ కాలేజీల్లో ఈ మేళా జరుగనుంది.

ఆదరణ ఉంటే సందుల్లో సభలేల?

▶ మొదటి పేజీ తరువాయి

మాత్రమే సూచించారన్నారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే...

- ▲ చంద్రబాబుకు నిజంగానే ప్రజాబలం ఉంటే, ఆయన సభలకు ప్రజలు వస్తారన్న నమ్మకం ఉంటే మైదానాల్లో ఎందుకు నిర్వహించడం లేదు? రహదారులపై బహిరంగ సభలను మాత్రమే జీవోలో నిషేధించాం. ర్యాలీలను నిషేధించలేదే? జీవోపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే న్యాయస్థానాలకు వెళ్లొచ్చు. అమరావతి నుంచి ప్రతి అంశంలోనూ చంద్రబాబు ఒక వర్చువల్‌ ప్రపంచంలో బతుకుతున్నారు.
- ▲ కుప్పంలో మూడు రోజులుగా చంద్రబాబు రోడ్‌ షో చేస్తూనే ఉన్నారు. క్రేన్లతో ఆయనకు దండలు కూడా వేస్తూనే ఉన్నారు. ఇక మేం అడ్డుకున్నదేముంది? చంద్రబాబుకు జడ్‌ ప్లస్‌ సెక్యూరిటీ కూడా ఉంది. ఆ కోణంలో చూసినా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలి కదా! గుంటూరులో పోలీసులు తక్షణమే స్పందించడం వల్లే మరణాలు తగ్గాయి.
- ▲ పోలీసుల సూచనల మేరకే సీఎం జగన్‌ మీటింగులు జరుగుతున్నాయి. ఇటీవల కర్నూలు రాజ్‌ విహార్‌ సెంటర్‌లో నిర్వహించాలనే ప్రతిపాదన వస్తే ఇరుకు రోడ్డులో వద్దని మేమే చెప్పాం. సీఎం పర్యటనలకు సంబంధించి పోలీసులకు సమాచారం ఇస్తున్నాం. వారి సూచనల ప్రకారం కొన్ని సందర్భాల్లో సభల స్థలాలను కూడా మార్చుకున్నాం.

ఇండిపెండెంట్‌ వ్యవస్థ...


సలహాదారుల నియామకానికి సంబంధించి కోర్టు ఏం చెప్పిందో నాకు తెలియదు కానీ నిప్పులు చెరిగిందంటూ కొన్ని పత్రికలు నోటికొచ్చినట్లు ప్రచురించిన కథనాలపై స్పందించలేం. అలాంటి వ్యాఖ్యలు చేసిందని మేం భావించడం లేదు. న్యాయ వ్యవస్థ.. ఎగ్జిక్యూటివ్‌ వ్యవస్థపై బాస్‌ కాదు. కార్య నిర్వాహక వ్యవస్థ ఇండిపెండెంట్‌ వ్యవస్థ. ఇందులో ఈ మధ్య కాలంలో సంక్లిష్టత పెరిగింది. దానికి అనుగుణంగా నిపుణుల అవసరం కూడా ఉంటుంది. అధికారంలో ఉండే పార్టీ విధానాలు ప్రజల్లోకి సమర్థంగా వెళ్లేందుకు సలహాదారులను నియమించవచ్చు. మా ప్రభుత్వ అవసరాన్ని బట్టి సలహాదారులను నియమిస్తున్నాం. కేంద్రంలో కూడా ఉన్నారు. చంద్రబాబు హయాంలో కూడా నియమించుకున్నారు. టీడీపీ అధికారంలో ఉండగా కన్సల్టెంట్‌ పేరుతో రూ.వందల కోట్లు దోచేశారు.

ప్రభుత్వం ఎవరికీ సబార్డినేట్‌ కాదు..

సలహాదారులు ఉండాలా లేదా? దాని రాజ్యాంగ బద్ధత ఏమిటి? అని పరిశీలించే హక్కు న్యాయ వ్యవస్థకు ఎప్పుడూ ఉంటుంది. అదే సమయంలో ప్రభుత్వం ఎవరికీ సబార్డినేట్‌ కాదు. ప్రభుత్వం జవాబు ఇవ్వాలంటే శాసన వ్యవస్థకు ఇవ్వాలి. ఒకవేళ నియమాలకు విరుద్ధంగా చేస్తే కోర్టులు ప్రశ్నిస్తాయి. ఒక వ్యవస్థ అన్నీ ఆలోచించే నిర్ణయం తీసుకుని ఉంటుందని పరస్పర నమ్మకంతో వ్యవస్థల మధ్య సంబంధాలు ఉండాలి. అలాకాకుండా నేనేదైనా కామెంట్‌ చేయవచ్చని ఎవరైనా అంటే నష్టం జరుగుతుంది. రాజ్యాంగం ఆశించిన సమన్వయం దెబ్బతింటుంది.

ఇంటర్నేషనల్‌ ఇయర్‌ ఆఫ్‌ మిల్లెట్స్‌

- 2023 సంవత్సరాన్ని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- కేంద్ర విదేశీ, పార్లమెంట్‌ వ్యవహారాల మంత్రి మురళీధరన్‌
- విశాఖ ఆర్గానిక్‌ మేళా–2023లో మిల్లెట్‌ ఫుడ్‌ స్టాళ్ల ప్రారంభం



మేళాలో స్టాల్స్‌ను సందర్శిస్తున్న కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్‌

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): దేశంలో సేంద్రియ రైతులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని 'ఇంటర్నేషనల్‌ ఇయర్‌ ఆఫ్‌ మిల్లెట్స్‌'గా ప్రకటించిందని కేంద్ర విదేశీ, పార్లమెంట్‌ వ్యవహారాల సహాయ మంత్రి మురళీధరన్‌ తెలిపారు. విశాఖలోని గాదిరాజు ప్యాలెస్‌ వేదికగా జరుగుతున్న విశాఖ ఆర్గానిక్‌ మేళా–2023ను శుక్రవారం ఆయన సందర్శించారు. మిల్లెట్‌ ఫుడ్‌ స్టాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీధరన్‌ మాట్లాడుతూ చిరుధాన్యాల ఉత్పత్తి, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. దేశంలో 10 వేల ఫార్మింగ్‌ కంపెనీలను సేంద్రియ వ్యవసాయం దిశగా కేంద్రం ముందుకు నడిపిస్తుందన్నారు. వన్‌ డిస్ట్రిక్ట్‌.. వన్‌ ప్రొడక్ట్‌లో భాగంగా దేశంలోని ప్రతి జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉత్పత్తులకు అంతర్జాతీయంగా మార్కెట్‌ కల్పించినట్లు తెలిపారు. ఇందులో అనకాపల్లి బెల్లం, అరకు కాఫీ వంటి ఉత్పత్తులు ఉన్నట్లు వెల్లడించారు. సేంద్రియ పంటలను ప్రోత్సహించే దిశగా ఆర్గానిక్‌ మేళా–2023ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. విశాఖ ఖ్యాతిని ప్రపంచవ్యాపితం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగానే జీ–20 సదస్సుకు విశాఖ వేదిక కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీ జీవీఎల్‌ నరసింహారావు, భారతీయ కిసాన్‌ సంఘ్‌ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, మేళా గౌరవ అధ్యక్షుడు, జీఎస్‌ఆర్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ జీఎస్‌ఎన్‌ రాజు, కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్‌, రైతు మిత్రా టెర్రస్‌ గార్డెన్‌ నిర్వాహకుడు దాట్ల వర్మ, గ్రీన్‌ క్లైమేట్‌ అధ్యక్షుడు జేవీ రత్నం, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి షణ్ముఖరావు, సేంద్రియ పద్ధతిలో సాగుతు చేస్తున్న రైతులు పాల్గొన్నారు.

కూతుళ్లతో సుప్రీంకోర్టుకు సీజేఐ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ శుక్రవారం కోర్టు హాలులో లాయర్లందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. దివ్యాంగులైన తన ఇద్దరు పెంపుడు కూతుళ్లను ఆయన న్యాయస్థానానికి తీసుకువచ్చారు. విజిటర్స్ గ్యాలరీ గుండా వారిద్దరినీ ఫస్ట్‌కోర్ట్‌కు తీసుకు వచ్చారు. తను కూర్చునే చాంబర్‌ను చూపించారు. ఇతర జడ్జీలు కూర్చుని ఉండే చోటును, లాయర్లు వాదించే సమయంలో ఎక్కడి ఉండేదీ వారికి చెబుతూ.. కోర్టు పని విధానాన్ని వివరించారు. కూతుళ్లను వారి కోరిక మేరకు సీజేఐ తీసుకువచ్చారని సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి. వచ్చిన అతిథులను చూసి న్యాయవాదులంతా ఆశ్చర్యానికి గురయ్యారని పేర్కొన్నాయి.

క్లుప్తంగా...

ట్విటర్‌పై హ్యాకర్ల దాడి

లండన్: సామాజిక మాధ్యమం ట్విటర్‌పై హ్యాకర్లు దాడి చేసి 20 కోట్ల మందికి పైగా వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని అపహరించారు. వినియోగదారుల ఈ–మెయిల్ ఇతర వివరాలను ఆన్‌లైన్ హ్యాకింగ్ ఫోరమ్‌లో అమ్మకానికి పెట్టారు. ఇజ్రాయెల్‌కు చెందిన సైబర్ భద్రత పర్యవేక్షణ సంస్థ హడ్సన్ రాక్ హ్యాకింగ్ విషయాన్ని బయటపెట్టింది.

గొడవ పడ్డ అంజలి, నిధి

న్యూఢిల్లీ: ఢిల్లీలో అంజలీ సింగ్ అనే యువతిని కారు ఢీకొట్టి, 12 కిలోమీటర్లు లాక్కెళ్లిన ఘటనలో మరికొన్ని విషయాలు వెలుగుచూశాయి. డిసెంబర్ 31వ తేదీ రాత్రి అంజలి స్కూటీపై ఆమె స్నేహితురాలు నిధి కూడా ఉన్నట్లు తేలింది. అయితే, అంతకుముందు వారిద్దరూ డబ్బు విషయమై ఘర్షణకు కూడా దిగినట్లు అంజలి స్నేహితుడొకరు వెల్లడించాడు. ఈ కేసులో నిందితులను కాపాడేందుకు యత్నిస్తున్నట్లు అనుమానాలున్న అశుతోష్‌ను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మరో అనుమానితుడు అంకుశ్ ఖన్నా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఇలా ఉండగా, మృతురాలు అంజలీ సింగ్ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందజేయనున్నట్లు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ చెప్పారు.

'స్పీకర్ ఎన్నిక'లో మూడో రోజూ విఫలమైన మెక్‌కార్తీ

వాషింగ్టన్: అమెరికా కాంగ్రెస్(పార్లమెంట్)లోని ప్రతినిధుల సభ నూతన స్పీకర్ ఎన్నికపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి కెవిన్ మెక్‌కార్తీని మూడోరోజు సైతం అదృష్టం పలకరించలేదు. స్పీకర్‌గా ఎన్నిక కావడానికి అవసరమైన మెజార్టీ ఓట్లు దక్కలేదు. 11వ రౌండ్ ఓటింగ్‌లోనూ సరిపడా ఓట్లు రాలేదు. స్థానిక కాలమానం ప్రకారం తదుపరి ఓటింగ్ శుక్రవారానికి వాయిదా పడింది. సొంత పార్టీలోనే ప్రత్యర్థులు ఉండడం మెక్‌కార్తీకి ప్రతికూలంగా మారింది. కొత్త స్పీకర్ ఎన్నిక పూర్తికాకపోవడంతో నూతన ప్రతినిధుల సభ ఇంకా పూర్తిస్థాయిలో కొలువుదీరనట్లే లెక్క.

మోదీ హయాంలో రెండు రకాల భారత్‌లు

పానిపట్: "నరేంద్ర మోదీ ఏలుబడిలో రెండు రకాల భారత్‌లు కనిపిస్తున్నాయి. ఒకటి కోట్లాది కార్మికులు, రైతులు, నిరుద్యోగులది. రెండోది దేశంలోని సగం సంపదను గుప్పెట్లో ఉంచుకున్న 100 మంది ధనికులది'' అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ చెబుతున్న హిందుస్తాన్ నిజ స్వరూపం ఇదేనని ఎద్దేవా చేశారు. శుక్రవారం జోడో యాత్ర సందర్భంగా హరియాణాలోని పానిపట్‌లో జరిగిన ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. దేశంలోని చిన్న, మధ్య తరహా వ్యాపారాలను దెబ్బతీసేందుకు ప్రభుత్వం వస్తుసేవల పన్ను(జీఎస్టీ), నోట్ల రద్దు విధానాలను ఆయుధంగా వాడుకుందని ఆరోపించారు.

ముంబై ఎయిర్‌పోర్ట్‌లో రూ.47 కోట్ల డ్రగ్స్ పట్టివేత

ముంబై: ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఇద్దరు వ్యక్తుల నుంచి అధికారులు రూ.47 కోట్ల విలువైన కొకైన్, హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. విమానాశ్రయం కస్టమ్స్ అధికారుల తనిఖీల్లో ఒక వ్యక్తి వద్ద రూ.31.29 కోట్ల ఖరీదు చేసే 4.47 కిలోల హెరాయిన్, మరొకరి వద్ద రూ.15.96 కోట్లుండే 1.596 కిలోల కొకైన్ దొరికింది. వీరిలో ఒకడు కెన్యా ఎయిర్ వేస్ విమానంలో దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్ నుంచి కెన్యాలోని నైరోబీ మీదుగా వచ్చాడు. అతడు 12 డాక్యుమెంట్ ఫోల్డర్లలో హెరాయిన్ దాచాడు. మరో వ్యక్తి ఇథియోపియన్ ఎయిర్ లైన్స్ విమానంలో వచ్చాడు. అతడి లగేజీలోని దుస్తుల గుండీల్లోనూ, హ్యాండ్‌బ్యాగుల్లో రహస్యంగా కొకైన్ దాచి ఉందని అధికారులు తెలిపారు.

కాల్పుల విరమణకు తూట్లు

కీవ్: ఆర్థోడాక్స్ క్రిస్మస్ సందర్భంగా 36 గంటల కాల్పుల విరమణ అంటూ రష్యా ప్రకటించిన కొద్దిగంటల్లోనే తూర్పు ఉక్రెయిన్ ప్రాంతం పేలుళ్లతో దద్దరిల్లింది. ఖెర్సన్‌లోని ప్రధాన నగరం డొనెట్స్క్‌లోని ఫైర్ స్టేషన్‌పై రష్యా క్షిపణి దాడిలో ఒకరు చనిపోగా నలుగురు గాయపడ్డారు. క్రమటోర్స్క్ నగరంపై రష్యా సైన్యం జరిపిన కాల్పుల్లో డజను వరకు భవనాలు దెబ్బతిన్నాయి. బఖ్‌ముత్ నగరంలో రెండు దేశాల ఆర్మీ మధ్య శతఘ్ని కాల్పులు కొనసాగుతున్నాయి. తూర్పు ప్రాంతంలో ముందుకు సాగుతున్న తమ బలగాలను నిలువరించే ఎత్తుగడలో భాగంగానే ఏకపక్షంగా పుతిన్ కాల్పుల విరమణ ప్రకటించారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. తాము కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ పట్టించుకోకుండా ఆక్రమిత ప్రాంతాలపైనా, తమ ఆర్మీపైనా ఉక్రెయిన్ దాడులు కొనసాగిస్తోందని రష్యా ఆరోపించింది.

80 శాతం గ్లేసియర్లు... ఏళ్లలో మాయం!

వాషింగ్టన్: భూ గోళానికి పెను ముప్పు అనుకున్న దానికంటే ముందుగానే ముంచుకొస్తుందా? హిమానీ నదాలపై తాజా అధ్యయనం ఫలితాలు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. ఈ శతాబ్దాంతానికి భూమిపై ఉన్న ప్రతి ఐదు హిమానీ నదాల్లో నాలుగు, అంటే ఏకంగా 80 శాతం నామరూపాల్లేకుండా పోతాయని సదరు అధ్యయనం తేల్చింది! గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలు బాగా ఫలించినా 2100 కల్లా కనీసం 25 నుంచి 41 శాతం హిమానీ సంపద హరించుకుపోతుందని అంచనా వేసింది. ''సగటు ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీలు పెరిగే పక్షంలో మధ్య యూరప్, పశ్చిమ కెనడా, అమెరికాల్లోని చిన్నపాటి హిమానీ నదాలు తీవ్ర ప్రభావానికి లోనవుతాయి. 3 డిగ్రీలు పెరిగితే మొత్తానికే మటుమాయమవుతాయి'' అని అధ్యయనానికి సారథ్యం వహించిన అమెరికాలోని కార్నెగీ మెలన్ వర్సిటీ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డేవిడ్ రౌన్స్ చెప్పారు. ''కర్బన ఉద్గారాలకు ఇప్పటికిప్పుడు పూర్తిగా అడ్డుకట్ట వేయగలిగినా పెద్దగా లాభముండదు. ఇప్పటిదాకా వెలువడ్డ ఉద్గారాలు తదితరాలు హిమానీ నదాలపై చూపే దుష్ప్రభావాన్ని అడ్డుకోలేం. ఇది నిజంగా ఆందోళనకరమైన విషయం'' అన్నారు.





ఘర్షణ పడుతున్న ఆప్, బీజేపీ కౌన్సిలర్లు

ఎంసీడీలో రగడ

ఆప్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య తీవ్ర ఘర్షణ

- తొలుత నామినేటెడ్ సభ్యుల ప్రమాణం
- ఆగ్రహం వ్యక్తం చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ
- మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగకుండానే సభ వాయిదా

న్యూఢిల్లీ: మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ(ఎంసీడీ) సమావేశంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), ప్రతిపక్ష బీజేపీ కౌన్సిలర్ల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. నూతన మేయర్, డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోకుండానే సభ వాయిదా పడింది. ఎన్నికైన కౌన్సిలర్లతో కాకుండా, నామినేట్ అయిన సభ్యులతో తొలుత ప్రమాణ స్వీకారం చేయించడంతో సభలో రగడ జరిగింది. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను దక్కించుకోవడానికి బీజేపీ అడ్డదార్లు తొక్కే అవకాశం ఉందని 'ఆప్' సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మేయర్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయడానికి ప్రిసైడింగ్ అధికారిగా బీజేపీ కౌన్సిలర్ సత్యాశర్మ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నలుగురు నామినేటెడ్ సభ్యులతో ప్రమాణం చేయించారు. దీనిపై ఆప్ కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సత్యాశర్మ సభను గంటపాటు వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమయ్యాక మిగిలిన నామినేటెడ్ సభ్యుల ప్రమాణ స్వీకారం చేస్తుండగా ఆప్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెల్‌లోకి దూసుకొచ్చి, నినాదాలు ప్రారంభించారు. ఎన్నికైన కౌన్సిలర్లతో మొదట ప్రమాణం చేయించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష బీజేపీ కౌన్సిలర్లు సైతం నినాదాలు ప్రారంభించారు. ఆప్ కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలతో ఘర్షణకు దిగారు. దీంతో సభను వాయిదా వేస్తున్నట్లు ప్రిసైడింగ్ అధికారి సత్యాశర్మ ప్రకటించారు.

ఆమ్ ఆద్మీ పార్టీకే సంఖ్యా బలం

మేయర్ ఎన్నిక కోసం ఉద్దేశించిన ఎలక్టోరల్ కాలేజీలో 250 మంది ఎన్నికైన కౌన్సిలర్లు మాత్రమే కాకుండా ఢిల్లీకి చెందిన ఏడుగురు లోక్‌సభ సభ్యులు, ముగ్గురు రాజ్యసభ సభ్యులు, 14 మంది నామినేటెడ్ ఎమ్మెల్యేలు కూడా ఉంటారు. అంటే ఎలక్టోరల్ కాలేజీలో మొత్తం సభ్యుల సంఖ్య 274. నంబర్ గేమ్ ఆమ్ ఆద్మీ పార్టీకే అనుకూలంగా ఉంది. ఆ పార్టీకి 150 ఓట్లు ఉన్నాయి.

కేంద్రం తీరు ఆందోళనకరం

కొలీజియం సిఫార్సుల పెండింగ్‌పై సుప్రీం • రెండోసారి సిఫార్సులనూ తిప్పి పంపుతోంది

- బదిలీ సిఫార్సులూ పెండింగ్‌లోనే
- వీటితో తప్పుడు సంకేతాలన్న కోర్టు
- టైం లైన్‌కు కట్టుబడ్డామన్న కేంద్రం



న్యూఢిల్లీ: న్యాయమూర్తుల నియామకంపై కేంద్రం, న్యాయవ్యవస్థ మధ్య కొనసాగుతున్న వివాదంపై సుప్రీంకోర్టులో శుక్రవారం వాడీవేడి వాదనలు జరిగాయి. కొలీజియం సిఫార్సుల ఆమోదంలో సుప్రీంకోర్టు విధించిన టైం లైన్సను కేంద్రం పాటించడం లేదంటూ దాఖలైన పిటిషన్లపై న్యాయమూర్తులు ఎస్.కె.కౌల్, ఆర్.ఎల్.ఓకా ధర్మాసనం విచారణ జరిపింది. కొలీజియం రెండోసారి సిఫార్సు చేసిన పేర్లను కూడా కేంద్రం తిప్పి పంపుతోందని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ప్రస్తావించగా ఇది ఆందోళనకరమని పేర్కొంది. ''ఇటీవల ఇలా పలు సిఫార్సులను రెండోసారీ తిప్పి పంపారు. పెండింగ్‌లో ఉన్న 22 పేర్లను కూడా వెనక్కు పంపారు. ఇంకా చాలా పేర్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ సిఫార్సులపై కేంద్రానికి సొంత అభిప్రాయాలేవైనా ఉంటే ఉండొచ్చు. కానీ ఎటూ తేల్చకుండా అట్టిపెట్టుకోజాలదు. తప్పుగానో, ఒప్పుగానో ఈ అంశాన్ని తేల్చాల్సిందే. కేంద్రం కావాలంటే కొలీజియం సిఫార్సులపై తన అభిప్రాయాలను మాకు పంపొచ్చు. వాటిని మేం పరిశీలిస్తాం. ఆ మీదట వాటిని పక్కన పెట్టడమో, తిరిగి సిఫార్సు చేయడమో చేస్తాం. కానీ ఒక పేరును కొలీజియం రెండోసారి కేంద్రానికి సిఫార్సు చేసిందంటే ప్రస్తుత నిబంధనల మేరకు సదరు నియామకాన్ని ఆపడానికి వీల్లేదు'' అని గుర్తు చేసింది. కొలీజియం సిఫార్సులను సుదీర్ఘ కాలం పెండింగులో పెడుతుండటం వల్ల ప్రతిభావంతులైన పలువురు తమకు జడ్జి పదవే వద్దంటూ తప్పుకుంటున్నారంటూ ఆవేదన వెలిబుచ్చింది. కొలీజియం రెండోసారి సిఫార్సు చేసిన పేర్లను మూడు నాలుగు వారాల్లోపు కేంద్రం ఆమోదించాలని సుప్రీంకోర్టు 2021 ఏప్రిల్ 20న పొందుపరిచిన టైం లైన్‌లో స్పష్టం చేసింది. హైకోర్టు న్యాయమూర్తుల బదిలీ సిఫార్సులను కూడా కేంద్రం దీర్ఘకాలం పాటు పెండింగ్‌లో పెట్టడం చాలా తప్పుడు సంకేతాలు పంపుతోందంటూ ధర్మాసనం ఆగ్రహం వెలిబుచ్చింది. ''కొంతకాలం క్రితం 10 మంది హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ కొలీజియం సిఫార్సు చేసింది. ఈ బదిలీల విషయంలో కేంద్రం పాత్ర చాలా పరిమితం. అయినా మా సిఫార్సుల్లో రెండింటిని గత సెప్టెంబర్లో, మిగతా వాటిని నవంబర్ చివర్లో ఆమోదించింది! ఇది చాలా తప్పుడు సంకేతాలు పంపుతోంది. న్యాయ వ్యవస్థ, కేంద్రం కాకుండా ఎవరో మూడో శక్తి జోక్యం చేసుకుంటోందన్న అభిప్రాయం కలిగిస్తోంది'' అని జస్టిస్ కౌల్ అన్నారు. ''ప్రతి వ్యవస్థలోనూ మంచీ చెడూ రెండూ ఉంటాయి. ఒక న్యాయమూర్తి బదిలీకి సిఫార్సు చేసేముందు కొలీజియం నిర్దిష్ట ప్రక్రియను తూచా తప్పకుండా అనుసరిస్తుంది. అవసరమైన వారినుంచి అభిప్రాయాలు తీసుకుంటుంది. ఆ తర్వాతే సిఫార్సు చేస్తుంది'' అని చెప్పారు. కొన్నిసార్లు కేంద్రం అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ కొలీజియమే తాను సిఫార్సు చేసిన పలు పేర్లను వెనక్కు తీసుకుందని గుర్తు చేశారు.

ముగ్గురిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా, ఐదుగురిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా కొలీజియం చేసిన సిఫార్సుల విషయం ఏమైందని ధర్మాసనం ప్రశ్నించింది. వాటిని కేంద్రం పరిశీలిస్తోందని, స్పందించేందుకు సమయం కావాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి బదులిచ్చారు. ''దీనిపై నిర్ణయానికి సమయమెందుకు? వారిప్పటికే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు. సీనియర్ న్యాయమూర్తులు'' అని ధర్మాసనం గుర్తు చేసింది. ''పలు హైకోర్టుల్లో సీజే పదవులు ఖాళీగా ఉన్నాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా మేం చేసిన సిఫార్సులను కేంద్రం ఆమోదిస్తే గానీ వీటిపై మేం నిర్ణయం తీసుకోలేం'' అంటూ విచారం వ్యక్తం చేసింది. కొలీజియం సిఫార్సుల పరిశీలనలో సుప్రీంకోర్టు విధించిన టైం లైన్‌కు కట్టుబడేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు ఏజీ పేర్కొన్నారు. హైకోర్టుల కొలీజియం చేసిన 104 సిఫార్సుల్లో 44 పేర్ల పరిశీలన రెండు మూడు రోజుల్లో పూర్తవుతుందన్నారు. విచారణను ధర్మాసనం ఫిబ్రవరి 3కు వాయిదా వేసింది.

పిటిషన్లన్నీ సుప్రీంకోర్టుకు..

స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో దాఖలై, పెండింగ్‌లో ఉన్న అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కలిపేసి, విచారణ నిమిత్తం తమకే బదిలీ చేసుకుంది. ఈ పిటిషన్లపై స్పందించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అన్ని పిటిషన్లకు కలిపి ఫిబ్రవరి 15లోగా ఉమ్మడి వివరణ ఇవ్వాలని సూచించింది. మార్చి 13న తదుపరి విచారణ చేపడతామని వెల్లడించింది.



అమెరికాలోని హవాయి రాష్ట్రంలో దాదాపు నెల రోజులుగా నిద్రాణంగా ఉన్న కిలౌయియా అగ్ని పర్వతం లావా మరోసారి పెల్లుబుకుతోంది. ప్రపంచంలోని చురుకైన అగ్ని పర్వతాల్లో ఇది ఒకటి.



చైనాలోని షాంఘైలో ఉన్న ప్రధాన ఆస్పత్రి బెడ్‌లు నిండిపోవడంతో కోవిడ్ బాధితులకు హాల్‌లోనే చికిత్సలు అందిదృశ్యం

ఆ ప్రబుద్ధుడి ఉద్యోగం ఊడింది

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా విమానంలో మహిళపై మూత్రవిసర్జన చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముంబైవాసి శంకర్ మిశ్రాపై అతడు పనిచేస్తున్న కంపెనీ యాజమాన్యం వేటు వేసింది. ఉద్యోగంలోనుంచి తొలగించింది. శంకర్ మిశ్రా వెల్స్ ఫార్గో అనే బహుళజాతి సంస్థలో ఇండియా చాప్టర్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నాడు. తమ సంస్థలో పనిచేసే సిబ్బంది వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగతంగానూ హుందాగా ప్రవర్తించాలని తాము కోరుకుంటున్నామని వెల్స్ ఫార్గో ఒక ప్రకటనలో వెల్లడించింది. శంకర్ మిశ్రా చేసిన పని తమకు తలవంపులు తెచ్చిందని పేర్కొంది.

కేసు పెట్టొద్దని వేడుకున్నాడు

విమానంలో ప్రయాణికురాలిపై మూత్రవిసర్జన ఘటనలో మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. తనకు తీవ్ర అవమానం జరిగిందని, నిందితుడి ముఖం చూడాలంటే అసహ్యం వేసిందని బాధితురాలు వెల్లడించారు. కేసు పెట్టొద్దని వేడుకున్నాడని, క్షమాపణ కోరాడని చెప్పారు.

డ్రగ్స్ తీసుకున్నా: హ్యారీ

**అమ్మ ఆత్మతో మాట్లాడేందుకు ప్రయత్నించా
కెమిల్లాను పెళ్లాడొద్దని నాన్నను బతిమాలాం**



లండన్: బ్రిటన్ రాచ కుటుంబంపై రాజు చార్లెస్–2 చిన్న కుమారుడు ప్రిన్స్ హ్యారీ సంచలన ఆరోపణల పరంపర కొనసాగుతూనే ఉంది. అన్న ప్రిన్స్ విలియంతో తన బంధం ఎప్పుడూ సమస్యాత్మకంగానే సాగిందంటూ త్వరలో విడుదలవనున్న తన ఆత్మకథలో బయట పెట్టారాయన. ''2021లో ఒకసారి మేమిద్దరం మా నాన్న సమక్షంలోనే తలపడ్డాం. మీరిలా కొట్టుకుని నా చివరి రోజులను దుర్భరంగా మార్చకండంటూ ఆయన మమ్మల్ని విడదీశాడు'' అని వివరించారు. ''రాచ కుటుంబీకుల పెళ్లిళ్లు జరిగే వెస్ట్‌మినిస్టర్ అబేలోని సెయింట్ పాల్స్ కెథడ్రెల్‌లో మెగన్, నేను ఒక్కటయ్యేందుకు కూడా విలియం ఒప్పుకోలేదు'' అన్నారు. రాచరికపు జీవితపు ఒత్తిడిని తట్టుకోలేక ఒక దశలో డ్రగ్స్‌కు అలవాటు పడ్డట్టు చెప్పారు! ''17 ఏళ్ల వయసులో తొలిసారిగా కొకైన్ వాడా. అంత థ్రిల్లింగ్‌గా ఏమీ అన్పించలేదు. తర్వాత ఎటన్ కాలేజీలో చదువుతున్న సమయంలో బాత్రూంలో గంజా తాగాను. కాలిఫోర్నియాకు వెళ్లినప్పుడు మ్యాజిక్ మష్రూమ్స్ వంటివి టేస్ట్ చేశా. 17 ఏళ్లప్పుడే వయసులో నాకంటే పెద్దావిడతో తొలి లైంగికానుభవం రుచి చూశా'' అని వివరించారు. ''12 ఏళ్ల వయసులో నా తల్లి డయానాను ప్రమాదంలో కోల్పోవడం బాధించింది. నిద్ర పోతున్న నన్ను లేపి నాన్న ఆ వార్త చెప్పారు. కానీ కనీసం నన్ను దగ్గరికి కూడా తీసుకుని ఓదార్చలేదు. మరణించిన నా తల్లితో ఎలాగైనా మాట్లాడేందుకు 'శక్తులున్న' ఒక మహిళను ఆశ్రయించా'' అని చెప్పుకొచ్చారు. కెమిల్లాను పెళ్లి చేసుకోవాలని తండ్రి భావించినప్పుడు వద్దని తాను, విలియం బతిమాలామన్నారు. హ్యారీ బయట పెట్టిన ఈ అంశాలపై వ్యాఖ్యానించేందుకు రాజ కుటుంబం తిరస్కరించింది.

దేవభూమికి బీటలు!

**ఉత్తరాఖండ్‌లోని జోషీ మఠ్‌లో
వందలాది ఇళ్లకు పగుళ్లు**

జోషిమఠ్. చార్‌ధామ్ యాత్రకు వెళ్లే భక్తులకు చిరపరిచితమైన పేరు. ఉత్తరాఖండ్‌లో అత్యంత పురాతమైన పట్టణం పూర్తిగా కనుమరుగయ్యే రోజులు దగ్గరకొస్తున్నాయి. జోషిమఠ్‌లో వందలాది ఇళ్లు బీటలు వారాయి. కొన్ని చోట్ల భూమిలోంచి నీళ్లు ఉబుకుబుకి పైకి వస్తున్నాయి. ఈ పట్టణం నిట్టనిలువుగా భూమిలోకి కుంగిపోవడమే దీనికి కారణం. ఏదో ఒక రోజు జోషిమఠ్ మునిగిపోవడం ఖాయమని దశాబ్దాల క్రితమే హెచ్చరికలు జారీ అయ్యాయి.

ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్‌లో ప్రజలు గత కొద్ది రోజులుగా ప్రాణాలరచేతుల్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. దాదాపుగా 600 ఇళ్లు బీటలు వారాయి. నేలకింద నుంచి ఇళ్లల్లోకి నీరు వచ్చేస్తోంది. భూమి కింద నుంచి శబ్దాలు వస్తూ ఉండడంతో స్థానికులు వణికిపోతున్నారు. చార్‌ధామ్ యాత్రికుల కోసం హెలాంగ్ నుంచి మార్వారి వరకు రోడ్డుని వెడల్పు చేసే ప్రాజెక్టు పనులు ముమ్మరంగా చేస్తూ ఉండడంతో ప్రస్తుతం ఈ ముప్పు ముంచుకొచ్చింది. దీంతో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి రంగంలోకి దిగారు. రహదారి నిర్మాణాలన్నీ తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించారు. జోషీమఠ్ పరిస్థితిపై శుక్రవారం అధికారులతో సమీక్షించారు. అక్కడి 600 కుటుంబాలను తక్షణం ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. శనివారం అక్కడ పర్యటించనున్నారు. దాంతో విపత్తు సహాయక బృందాలు ప్రజల్ని తరలిస్తున్నాయి.

ఎందుకీ ముప్పు ?

జోషీమఠ్ పట్టణం కొండల్లో ఏటవాలుగా ఉన్నట్టు ఒకవైపు ఒరిగి ఉంటుంది. అత్యంత పురాతనమైన కొండచరియలపై ఇళ్లు నిర్మించడంతో పునాదులు బలంగా లేవు. అడపా దడపా భూ ప్రకంపనలు పలకరిస్తూనే ఉంటాయి. రైని ప్రాంతంలోని అలకనంద నదికి వరదలు వచ్చినప్పుడల్లా జోషీమఠ్‌లో మట్టిని బలహీనపరుస్తోంది. ఈ ప్రాంతంలో భారీ నిర్మాణాలు చేపట్టవద్దని ఎందరో నిపుణులు హెచ్చరించినా మన ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయి. అభివృద్ధి కార్యక్రమాల కోసం కొండల్ని పేల్చేయడం, ఇష్టారాజ్యంగా తవ్వకాలు, చెట్లు నరికేయడం వంటి చర్యలు జోషీమఠ్ పట్టణాన్ని ప్రమాదంలో పడేశాయి. ఎన్‌టీపీసీకి చెందిన తపోవన్ విష్ణుగఢ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం అతి పెద్ద ముప్పుగా పరిణమించింది. గత ఏడాది ఈ ప్రాజెక్టు దగ్గర ఆకస్మిక వరదలు సంభవించి 200 మంది మరణించిన విషయం తెలిసిందే. ఏడాది పొడవునా చార్‌ధామ్ యాత్ర చేయడానికి వీలుగా హెలోంగ్ నుంచి మార్వారి వరకు 20కి.మీ. మేర చేపట్టిన రహదారి వెడల్పు చేసే ప్రాజెక్టు ముప్పుని మరింత పెంచింది. ప్రస్తుతం ఈ నిర్మాణాలన్నీ తాత్కాలికంగా ప్రభుత్వం నిలిపివేసింది. సమస్యకి శాశ్వతమైన పరిష్కారాలు కనుగొనే వరకు చిన్నపాటి తవ్వకాలు కూడా చేయవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గత ఏడాది జోషీమఠ్‌కి ముప్పుని తొలిసారి గుర్తించారు. చమోలిలో ప్రమాదకరంగా కొండచరియలు విరిగిపడినప్పుడు జోషీమఠ్‌లో ఇళ్లు బీటలు వారాయి. అప్పట్నుంచి ఏదో ఒక రూపంలో ప్రమాదాలు వస్తూనే ఉన్నాయి. దీనికి గల కారణాలపై బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాస్త్రవేత్తల బృందం ఈ పట్టణం ఉన్న ప్రాంతంలో సహజసిద్ధంగా వచ్చే ముప్పుతో పాటు మానవ తప్పిదాలు కారణమని తేల్చింది.



జోషీ మఠ్‌లో పగుళ్లిచ్చిన ఇల్లు, రోడ్డు


50 ఏళ్ల క్రితమే ప్రమాదం గుర్తించిన నిపుణులు

జోషీమఠ్ పూర్తిగా మునిగిపోతుందని 50 ఏళ్ల క్రితమే నిపుణులు అంచనా వేశారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో తరచూ వరదలు రావడానికి గల కారణాలు అన్వేషించడానికి ఏర్పాటు చేసిన మిశ్రా కమిటీ 1976లో ఇచ్చిన నివేదికలో జోషీమఠ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఈ విషయాన్ని ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న వృద్ధులు కథలుగా చెబుతున్నారు. జోషిమఠ్ కనుమరుగైపోతుందా అన్న ఆందోళనలో స్థానికులు దినమొక గండంగా బతుకుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ జోషీమఠ్ ?

హిమాలయాల్లోని ప్రకృతి అందాలకు నెలవు ఈ పట్టణం. చమోలి జిల్లాలో బద్రీనాథ్, హేమ్‌కుండ్ సాహిబ్ మధ్య 6 వేల అడుగుల ఎత్తులో జోషీ మఠ్ ఉంది. కేదార్‌నాథ్, బద్రీనాథ్ యాత్రికులకు స్వాగతం చెబుతున్నట్టుగా ఈ పట్టణం ఉంటుంది. జగద్గురు ఆదిశంకరాచార్యుడు ఎనిమిదో శతాబ్దంలో జోషీమఠ్‌లోనే జ్ఞానోదయం పొందారని ప్రతీతి. ఇప్పటికే అత్యధిక భూకంపం ముప్పు ఉన్న కేటగిరి జోన్–5లో ఈ ప్రాంతం ఉంది.



కుప్పకూలిన జోషిమఠ్ ఆలయం

జోషీమఠ్: హిమాలయాల్లో ఉన్న ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్‌లో ఓ ఆలయం శుక్రవారం సాయంత్రం కుప్పకూలింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని స్థానికులు చెప్పారు. ఆలయ గోడలు పగుళ్లు వారుతుండటంతో 15 రోజుల క్రితమే మూసివేసినట్లు చెప్పారు. సింగ్‌ధర్ వార్డులోని చాలా ఇళ్లు బీటలు వారుతుండటంతో 50 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. అదేవిధంగా, అక్కడికి సమీపంలోనే ఉన్న జల విద్యుత్ కేంద్రంలో పనిచేసే 60 కుటుంబాలను కూడా మరో చోటికి తరలించారు. మర్వారీలోని జలాశయం బీటలు వారి నీరు ధారాళంగా మూడు రోజులుగా దిగువకు వస్తుండటంతో చాలా ఇళ్లు దెబ్బతిన్నాయి. చార్‌ధామ్‌లో కొనసాగుతున్న బైపాస్ రోడ్డు, జల విద్యుత్ ప్రాజెక్టు పనులను, ఔలి రోప్ వే సేవలను నిలిపివేశారు. ఆ ప్రాంతంలో ఏడాది కాలంగా భూమి కుంగిపోతోంది. పక్షం రోజులుగా భూమి కుంగుబాటు మరీ ఎక్కువైంది.

కన్నడ భామల సందడి



బనశంకరి: సంక్రాంతి పండుగ సందర్భంగా చిత్ర కళాపరిషత్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన బెంగళూరు ఉత్సవ ప్రదర్శనను కన్నడ భామలు సలోమిడిసోజా, దీనాపూజారి ప్రారంభించారు. శ్రీకృష్ణుడు, గౌతమబుద్ధుడు, జ్యువెలరీఐటమ్స్, చీరలు ప్రదర్శిస్తూ సందడిచేశారు. ఈ ప్రదర్శన 15 తేదీ వరకు నిర్వహిస్తారు.

న్యూస్‌రీల్

అన్నదాత ఆత్మహత్య

మైసూరు: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మైసూరు జిల్లా హెచ్.డి.కోటె తాలూకా హీరెనంది గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కెంగణ్ణప్ప (60) విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఐదు ఎకరాల్లో పంట కోసం బ్యాంకులో రూ. 5 లక్షలు, మహిళా సంఘం నుంచి రూ. 3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇదే సమయంలో పంటలు సరిగా పండక తీవ్ర మనస్తాపంతో విషం తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెచ్.డి.కోటె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

మైసూరు: భార్య మరణానికి కారణమైన భర్తకు మైసూరు 5వ అదనపు జిల్లా కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. వివరాలు... మైసూరు తాలూకా రామనహుండీలో నివాసం ఉంటున్న రవికుమార్‌కు, నంజనగూడు తాలూకాలోని అహల్య గ్రామానికి చెందిన పుష్పలతతో వివాహం జరిగింది. ఇదిలా ఉంటే భార్య నడవడికపై రవి కుమార్ తరచూ అనుమానించేవాడు. నిత్యం మానసికంగా వేధించేవాడు. అతని వేధింపులు భరించలేక భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దలతో పంచాయితీ పెట్టించి భార్యను ఇంటికి తీసుకొచ్చాడు. అయినా కూడా రవి కుమార్‌లో ఎలాంటి మార్పు కనిపించలేదు. వేధింపులు ఆగలేదు. దీంతో జీవితంపై విరక్తి కలిగిన పుష్పలత అక్కడే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జయపుర పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి మల్లికార్జున, ముద్దాయి రవికుమార్‌కు ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

పట్టుబడిన నగదుపై లోతుగా విచారణ

- నగదుతో పట్టుబడిన ఏఈఈ కోర్టుకు హాజరు

శివాజీనగర: విధానసౌధలోకి రూ.10 లక్షలు తీసుకొస్తూ పట్టుబడిన పీడబ్ల్యూడీ ఏఈఈ జగదీశ్‌ను కేంద్ర విభాగపు పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. కాగా సీబీ కుమారస్వామి నేతృత్వంలో గురువారం అర్ధరాత్రి వరకు పోలీసులు జగదీశ్‌ను విచారించారు. అయితే నగదు గురించి జగదీశ్ నోరు విప్పలేదు. జగదీశ్ మొబైల్ స్వాధీనంలోకి తీసుకొని కాల్‌డేటాను పరిశీలిస్తున్నారు. కాగా నగదు పట్టుబడిన విషయంపై కర్ణాటక పోలీస్ చట్టం కింద కేసు నమోదు చేశారు, దీనికోసం కోర్టు అనుమతి తీసుకోకుండా జగదీశ్‌ను అరెస్ట్ చేశారని ఆయన తరపు న్యాయవాది రాజు ఆరోపించారు. జగదీశ్ లంచం ఇవ్వాలని తీసుకొచ్చిన సొమ్ము కాదని, జగదీశ్‌పై చెక్ బౌన్స్ కేసు నమోదైందని,ఆ కేసు పరిష్కారానికి బెంగళూరుకు నగదు తీసుకొచ్చారన్నారు. విధుల్లో భాగంగా ఓ అధికారిని కలిసేందుకు విధానసౌధకు వెళ్తుండగా ఈ ఘటన జరిగిందని ఆ న్యాయవాది పేర్కొన్నారు.

ఫిబ్రవరి 13న హెలికాప్టర్ యూనిట్ ప్రారంభం



తుమకూరు: తుమకూరు జిల్లా గుబ్బి తాలూకా నిట్టూరు సమీపంలోని బిదరహళ్లి కావల్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన హెచ్ఏఎల్ యూనిట్‌ను ప్రధాని మోదీ ఫిబ్రవరి 13న ప్రారంభిస్తారని తుమకూరు ఎంపీ జీఎస్ బసవరాజ్ తెలిపారు. శుక్రవారం హెచ్ఏఎల్ యూనిట్‌ను ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ అత్యాధునిక హెలికాప్టర్లు తయారు చేస్తారని చెప్పారు.

2ఏకు పట్టు, 24 గంటల డెడ్‌లైన్

- 2డీ రిజర్వేషన్ తిరస్కరించిన పంచమసాలిలు

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 2డీ రిజర్వేషన్‌ను పంచమసాలి సామాజిక వర్గం తిరస్కరించగా, 2ఏ రిజర్వేషన్ కోసం మళ్లీ పట్టుపట్టింది. 2ఏ రిజర్వేషన్ ప్రకటించాలని ప్రభుత్వానికి 24 గంటలు గడువును ఇచ్చింది. లేనిపక్షంలో ఈ నెల 13న ముఖ్యమంత్రి బొమ్మై సొంత జిల్లా హావేరిలోని సీఎం ఇంటి ముందు ధర్నా చేపడుతామని హెచ్చరించింది. నగరంలోని గాంధీభవన్‌లో గురువారం 2డీ పంచమసాలిల పోరాటానికి లభించిన న్యాయమో? అన్యాయమో? అనే విషయంపై చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. తమకు 2ఏ రిజర్వేషన్ కిందనే సదుపాయాలు కల్పించాలి. అయితే ప్రభుత్వం 2డీ రిజర్వేషన్ ప్రకటించిన అనవసరంగా వివాదాలు సృష్టించింది. 24 గంటల్లోగా 2ఏ రిజర్వేషన్ ప్రకటించాలి. జనవరి 12లోగా నోటిఫికేషన్ వెల్లడించని పక్షంలో ఈ నెల 13న హావేరి జిల్లా శిగ్గాంవిలో ఉన్న సీఎం ఇంటి ముందు ధర్నా జరిపేందుకు నిర్ణయించారు. ప్రభుత్వ ప్రకటనను బట్టి పోరాట స్వరూపాన్ని హావేరిలోనే నిర్ణయిస్తామని కూడల సంగమ పీఠం జయమృత్యుంజయ స్వామి తెలిపారు.

హావేరిలో మోగిన కన్నడ డిండిమ

- దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన కన్నడ భాషాభిమానులు
- కన్నడ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి శివరాం హెబ్బార్, హాజరైన సీఎం బొమ్మై



డప్పు కళాకారుల ప్రదర్శన



సమ్మేళన అధ్యక్షుడు దొడ్డరంగేగౌడ ఊరేగింపు

దొడ్డబళ్లాపురం: యాలక్కి నగరంగా కీర్తికెక్కిన హావేరిలో కన్నడ డిండిమ మోగింది. 6వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. హుబ్బళ్లి జాతీయ రహదారి పక్కనే 130 కరాల విస్తీర్ణంలో కన్నడ గంధర్వలోకం భువికి దిగివచ్చినట్టు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు హావేరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అరెబైలు శివరాం హెబ్బార్ కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో కన్నడ పతాకాన్ని కన్నడ సమ్మేళనాన్ని ప్రారంభించారు. కన్నడ తేరుపై సమ్మేళనం అధ్యక్షుడు దొడ్డరంగేగౌడను నగరంలోని ప్రముఖ వీధుల్లో ఊరేగించారు. కసాప రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ జోషి, హావేరి జిల్లా కసాప అధ్యక్షుడు లింగయ్య తదితరులు హాజరయ్యారు. ఇక సమ్మేళనాన్ని వీక్షించడానికి రాష్ట్రం నలుమూలల నుండి వేలాదిగా కన్నడాభిమానులు తరలివచ్చారు.

కన్నడకు పాలనాపరమైన గుర్తింపు ఇవ్వాలి

కన్నడ భాషకు పాలనాపరమైన గుర్తింపు ఇవ్వాలని అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనం అధ్యక్షుడు దొడ్డరంగేగౌడ డిమాండు చేశారు. కన్నడ సాహిత్య సమ్మేళనంలో మాట్లాడిన ఆయన.. కన్నడ భాషకు పాలనాపరమైన గుర్తింపు తెచ్చే ప్రయత్నంలో భాగంగా కన్నడ, సంస్కృతి శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో కన్నడ భాషకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కన్నడ భాష అభివృద్ధికి తీసుకురానున్న కొత్త చట్టంలో ఇవన్నీ చేర్చాలన్నారు. జనవరి నెలలోనే అసెంబ్లీ సమావేశాల్లో ఈ చట్టాన్ని ఆమోదించి అమలు చేయాలని కోరారు. రాష్ట్ర సరిహద్దుల్లో కన్నడ పాఠశాలలు తెరవాలని, మూతపడిన పాఠశాలలను పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రముఖులు, నటుడు రమేష్ అరవింద్, నిర్మలానందస్వామీజీ, రిటైర్డ్ జస్టిస్ సంతోష్ హెగ్డే పాల్గొన్నారు.

కన్నడ సాహిత్య సమ్మేళనం సాహిత్యలోకానికి ముందడుగు

బనశంకరి: అఖిలభారత కన్నడ సాహిత్యసమ్మేళనం సాహిత్యలోకాన్ని ముందుకు తీసుకెళుతుందని బసవరాజబొమ్మై అన్నారు. అఖిలభారత సాహిత్య సమ్మేళనంలో పాల్గొనే ముందు విలేకరులతో మాట్లాడారు. తన సొంతగడ్డపై సమ్మేళనం జరగడం సంతోషకరంగా ఉందన్నారు. భవిష్యత్‌లో కన్నడ సాహిత్యాన్ని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లేందుకు ఈ సమ్మేళనంలో చర్చలు జరగాలన్నారు. కన్నడ భాష అభివృద్ధికి ఇప్పటికే పలు సలహాలు ఇచ్చామని, దీనిపై చర్చించాలన్నారు. న్యాయశాఖ కమిషన్ పూర్తిగా స్పష్టం చేసి అభిప్రాయం తెలిపిందని, వచ్చే శాసనసభ సమావేశాల్లో ఆమోదిస్తామన్నారు. సాహిత్యసమ్మేళనంలో చర్చించే అంశాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందని, ప్రభుత్వం ఇప్పటికే గడినాడు కన్నడిగుల అభివృద్ధికి ప్యాకేజ్ ప్రకటించిందని తెలిపారు.



హాజరైన కన్నడ భాష అభిమానులు



దొడ్డరంగేగౌడతో ముచ్చటిస్తున్న సీఎం బొమ్మై



హావేరి వీధుల్లో కొమ్ము కళాకారులు



అతిథులకు సన్మానం

మహిళపై చిరుత దాడి



మండ్య: చిరుత దాడిలో మహిళ తీవ్రంగా గాయపడింది. మండ్య తాలూకాలోని అవ్వెరహళ్లి గ్రామానికి చెందిన దేవరాజు భార్య బసమ్మణి శుక్రవారం ఉదయం తమ ఇంటివెనుక కొట్టంలో పశువులను కట్టి వేయడానికి వెళ్లగా అప్పటికే పొంచి ఉన్న చిరుత దాడి చేసింది. బాధితురాలు కేకలు వేయడంతోపాటు కాళ్లతో గట్టిగా తన్నడంతో చిరుత కిందపడింది. పశువులు భయాందోళనతో పరుగులు తీయగా చిరుత వాటి వెంట పడింది. దీంతో బసమ్మణి ప్రాణాలతో బయట పడింది. కాగా గాయపడిన బాధితురాలిని ఆస్పత్రికి తరలించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

నకిలీ నోట్ల చెలామణి ముఠా అరెస్ట్

శివాజీనగర: రూ.2వేలు, రూ.500 ముఖ విలువతో ఉన్న నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న ముఠా పట్టుబడింది. తమిళనాడు తుత్తూకుడికి పిచ్చిముత్తు (45), తిరునల్వేలి (53), సుబ్రమణియన్ (60)ను సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. కోటీ 28 లక్షల విలువైన నకిలీ నోట్లను(రూ.2వేల ముఖ విలువ కలిగిన 2300 నోట్లు, రూ.500 ముఖ విలువ కలిగిన 174 నోట్లు), ప్రింటర్ హార్డ్ డిస్క్, మొబైల్‌లను స్వాధీనం చేసుకున్నారని జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎస్.డీ.శరణప్ప ఒక ప్రకటన విడుదల చేశారు. నిందితులపై సిద్దాపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులైన పిచ్చిముత్తు, నల్లకణి ఫైనాన్స్‌ర్లుగా, మరో నిందితుడు సుబ్రమణియన్ ఆడిటర్‌గా ప్రచారం చేసుకునేవారు. నకిలీ నోట్ల చెలామణితోపాటు రుణం కోసం వచ్చిన వారిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు తీసుకెళ్లి అగ్రిమెంట్ చేయించి చార్జీల కింద 1 శాతం చొప్పున నగదు రూపంలో వారిద్వారానే తీసుకునేవారు. రుణం అందినట్లు వారితోనే సంతకాలు తీసుకునేవారు. అనంతరం రుణం ఇవ్వకుండా జాప్యం చేసేవారు. సంతకాలు తీసుకొని రుణం ఇవ్వకపోగా బెదిరింపులకు పాల్పడేవారు.

జయహో కన్నడ కస్తూరి



హావేరిలో ప్రారంభమైన అఖిలభారత కన్నడ సమ్మేళనం కన్నడ భాష అభిమానులను అలరించింది. వేలాది మంది తరలిరావడంతో ప్రాంగణం కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలకు భాషాభిమానులు పోటెత్తారు. హావేరి వీధుల్లో మరగాళ్ల కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.





అభివృద్ధి అంటే బీజేపీ

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



తుమకూరు: దేశంలో అభివృద్ధి అంటే బీజేపీ అని, వినాశనం అంటే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుకు రావాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. శుక్రవారం సాయంత్రం తుమకూరు జిల్లా శిరలో నిర్వహించిన బీజేపీ జన సంకల్ప యాత్ర సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ వంశపారంపర్య పాలన, సమాజాన్ని అవినీతి సమయంలో చేసిందని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ పార్టీ జాతి, ధర్మం పేరుతో రాజకీయం చేస్తోందని అన్నారు. ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 30 కోట్లతో అభివృద్ధి పనులను మోదీ స్వయంగా ప్రారంభించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఎం బొమ్మై, మాజీ సీఎం యడియూరప్ప తదితర నేతలు పాల్గొన్నారు.

నాగరబావిలో చిరుత మళ్లీ ప్రత్యక్షం



నాగరబావిలో ప్రత్యక్షమైన చిరుత

బనశంకరి: బెంగళూరు నగర శివారు ప్రాంతంలో కొద్దిరోజులుగా కనుమరుగైన చిరుత అనూహ్యంగా మళ్లీ కనిపించడంతో నగరవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నాగరబావి చుట్టుపక్కల చిరుత కనబడటంతో ప్రజలు హడలిపోతున్నారు. మూడు రోజుల క్రితం రాత్రి బైక్‌లో వెళ్తుండగా చిరుత కనిపించడంతో వారు తిరిగి వెనక్కి వెళ్లిపోయారు. నాగరబావికి ఆరు కిలోమీటర్ల దూరంలో చిరుత సంచరిస్తోంది. చిరుత సంచరించిన గుర్తులు సీసీటీవీలో నిక్షిప్తమయ్యాయి. ఇప్పటికే అటవీశాఖ అధికారులు చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించి బోనులు ఏర్పాటు చేశారు.

బెంగళూరులో చైన్‌స్నాచర్ల హల్‌చల్

యశవంతపుర: బెంగళూరు నగరం ఉత్తర విభాగంలో చైన్‌స్నాచర్లు హల్‌చల్ చేశారు. నాలుగుచోట్ల మహిళల మెడల్లో గొలుసులు లాక్కెళ్లారు. సర్వమంగళ అనే మహిళ ఎంఇఈ వద్ద శుక్రవారం వేకువజామున కాలినడకన వెళ్తుండగా బైకుపై వచ్చిన దుండగులు ఆమె మెడలోని 60 గ్రాముల చైన్ లాక్కొని ఉడాయించారు. అదేవిధంగా రామయ్యలేఔట్ వద్ద ప్రియలక్ష్మి మెడలోని బంగారు చైన్, జేపీ పార్క్ వద్ద జయప్రభ అనే మహిళ మెడలో 50 గ్రాముల బంగారు చైన్, చొక్కసంద్ర వద్ద లలితమ్మ అనే మహిళ మెడలో 45 గ్రాముల బంగారు చైన్ లాక్కొని ఉడాయించారు. సీసీకెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా దొంగల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

రిజర్వేషన్ల విషయంలో బీజేపీ అబద్ధాలు

- మాజీ సీఎం కుమారస్వామి

దొడ్డబళ్లాపురం: రిజర్వేషన్ల విషయంలో బీజేపీ ప్రభుత్వం ఆటలాడుతోందని, ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారని, ఈ సంగతి ప్రజలు గ్రహించినప్పుడు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి విమర్శించారు. బీదర్ తాలూకా జనవాడలో పంచరత్న రథయాత్రలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... కందిపంట నష్టపోయినా ప్రభుత్వం రైతులను ఆదుకోలేదన్నారు. రైతుల సమస్యలకు ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కారణంగా రైతుల్లో బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో జేడీఎస్ రైతులకు మద్దతుగా పోరాటం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రికి స్యాంట్రో రవి తెలియకపోతే ముఖ్యమంత్రికి స్యాంట్రో రవి ఎందుకు మేసేజ్ చేస్తాడని ప్రశ్నించారు. కుమారకృప చుట్టూ ఏం జరుగుతోందని ప్రశ్నించారు.

నేటినుంచి చిక్కబళ్లాపురం ఉత్సవం

చిక్కబళ్లాపురం: కన్నడ, సంస్కృతి శాఖ జిల్లా పాలకమండలి, డాక్టర్ సుధాకర్ ఫౌండేషన్ చిక్కబళ్లాపురం ఆధ్వర్యంలో చిక్కబళ్లాపురం ఉత్సవాన్ని ఈనెల 7నుంచి 14 వ తేదీ వరకు నగరంలోని సర్ ఎం విశ్వేశ్వరయ్య క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ నాగరాజు తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు మరళు సిద్దేశ్వర స్వామి ఆలయం నుంచి ఉత్సవ మూర్తుల ఊరేగింపు, ఉంటుందని, ఉత్సవాలను ఆదిచుంచనగిరి మఠం పీఠాధ్యక్షుడు డాక్టర్ నిర్మలానందనాథ మహాస్వామి ప్రారంభిస్తారన్నారు. మంత్రులు నాగరాజు, డాక్టర్ సుధాకర్, బైరతి బసవరాజు తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు.

పాఠశాలకు బాంబు బెదిరింపు

యశవంతపుర: పాఠశాలలో బాంబు పెట్టామంటూ బెదిరింపు మెయిల్ రావడంతో విద్యార్థులు హడలిపోయిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. శుక్రవారం రాజాజీనగర ఐదో బ్లాక్‌లోని ఎన్‌పీఎస్ పాఠశాలకు ఓ అపరిచితుడు బాంబు బెదిరింపు మెయిల్ పంపాడు. సంస్థ యాజమాన్యం వెంటనే బసవేశ్వరనగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా వారిని వెంటనే బయటకు పంపించారు. ఏసీపీ రవి నేతృత్వంలో బాంబ్ స్క్వాడ్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎక్కడ బాంబు ఆనవాళ్లు కనిపించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాఠశాల వద్దకు వచ్చారు.

ట్రాక్టర్ బోల్తా..26 మంది విద్యార్థులకు గాయాలు

బనశంకరి: ట్రాక్టర్ బోల్తాపడి 26 మంది విద్యార్థులు గాయపడిన ఘటన ఉత్తరకన్నడ జిల్లా శిరసి తాలూకాలో శుక్రవారం చోటుచేసుకుంది. మొత్తం 90 మంది విద్యార్థులు మళగి నుంచి శుక్రవారం రెండు ట్రాక్టర్లలో ఉత్తరకన్నడకు విహారయాత్ర కోసం విచ్చేశారు. కూళగి వద్ద ఒక ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. 26 మంది గాయపడగా 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను శిరసి పండిత్ ఆసుపత్రికి తరలించారు.

విధానసౌధ షాపింగ్ మాల్

- ప్రియాంక్ ఖర్గే ధ్వజం

శివాజీనగర: విధానసౌధ ఓ షాపింగ్ మాల్‌గా మారిందని, ఇక్కడ పీఎస్ఐ ఉద్యోగాలు, అసిస్టెంట్ ఇంజనీర్ల ఉద్యోగాలు అమ్ముకుంటారని, ఇందులో శాంట్రో రవిలాంటి సంఘ విద్రోహ శక్తులు దళారీలుగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే, కేపీసీసీ అధికార ప్రతినిధి ప్రియాంక్ ఖర్గే ధ్వజమెత్తారు. శుక్రవారం కల్బుర్గిలో విలేకరులతో మాట్లాడుతూ ఒక ఎమ్మెల్యే పీఎస్ఐ నియామకాలకు సంబంధించి రోల్‌కాల్ చేశారు. ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ రూ.10 లక్షల నగదుతో పట్టుబడ్డారు. ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి బీజేపీ హైకమాండ్‌కు మధ్యవర్తి కాగా ఎమ్మెల్యేలు మంత్రులు, అధికారులు ఎమ్మెల్యేలకు మధ్యవర్తులయ్యారని ఆరోపించారు. దీన్నిబట్టి ముఖ్యమంత్రి ప్రభుత్వ పాలన చేస్తున్నట్లు అనిపించటం లేదని, ప్రభుత్వంలో రౌడీ విభాగం ఓపెన్ చేశారని విమర్శించారు. కల్బుర్గి కేడీపీ సభను శనివారానికి వాయిదా వేయటంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రియాంక్, జిల్లా యంత్రాంగానికి కేడీపీ ఎలా జరపాలనేది తెలిసిందో లేదో అర్థం కావటం లేదన్నారు.




బాదామి బనశంకరి నమోస్తుతే

శుక్రవారం బాగల్‌కోటె జిల్లా బాదామి సమీపంలోని బనశంకరిలో అమ్మవారి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు

16 జిల్లాల్లో అభ్యర్థులను బరిలో నిలుపుతాం

- ప్రజల ఆశీస్సులతో పార్టీని ముందుకు తీసుకెళతాం
- కేఆర్‌పీపీ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి



గాలి జనార్దనరెడ్డికి గజమాలతో సత్కారం

సాక్షి,బళ్లారి: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కళ్యాణ, ఉత్తర కర్ణాటక జిల్లాలతో పాటు తమ పార్టీకి అనుకూలమైన ప్రాంతాల్లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 16 జిల్లాల్లో తమ పార్టీ అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తారని కర్ణాటక రాష్ట్ర ప్రగతి పార్టీ(కేఆర్‌పీపీ) వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం రాయచూరు జిల్లా సింధనూరులో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల భారీ బహిరంగ సమావేశంలో మాట్లాడారు. ముందుగా పీడబ్ల్యూడీ క్యాంపు నుంచి భారీ బైక్‌ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. అనంతరం స్త్రీశక్తి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో, విలేకరులతో ఆయన మాట్లాడుతూ గాలి జనార్దనరెడ్డి అంటే డబ్బుతో రాజకీయాలు చేస్తారని చాలా మంది అనుకుంటారని, అయితే డబ్బుతో కాకుండా ప్రజాశీస్సులతో తాను రాజకీయాలు చేస్తానన్నారు.

ఇక ప్రజాభివృద్ధి కోసం పని చేస్తా

12 ఏళ్లగా తాను వనవాసం చేశానని, ఇక ఊరికే ఇంట్లో కూర్చొని ఉండనన్నారు. ప్రజల మధ్యలో, ప్రజల కోసం , ప్రజాభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. కార్యకర్తలే తన బలం అని, రాజకీయాల్లో ఇక వెనక్కి తగ్గే ప్రశ్నే లేదన్నారు. తాను సామాన్య కానిస్టేబుల్ కుమారుడిని అయినా దేవుడు, జనం ఆశీస్సులతో ఈ స్థాయికి వచ్చానని సగర్వంగా చెబుతున్నానన్నారు. ఏ పార్టీతోను పొత్తు పెట్టుకునే ప్రశ్నే లేదన్నారు. తనను రాజకీయంగా వాడుకుని పక్కన పెట్టిన వారికి జనమే బుద్ధి చెబుతారన్నారు. 16 జిల్లాల్లో కలియతిరిగి పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తానన్నారు. తాను అబద్ధాలు చెప్పేవాడు కాదని, చెప్పింది చేస్తానన్నారు. సింధనూరును సింగపూర్‌లా అభివృద్ధి చేస్తామన్నారు. ఈసందర్భంగా కేఆర్‌పీపీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీల నుంచి కేఆర్‌పీపీలోకి చేరికలు

గంగావతి రూరల్: తాలూకాలోని ఒళబళ్లారి చెన్నబసవ మహా శివయోగి 40వ జాతర అమృత మహోత్సవంలో భాగంగా కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ వ్యవస్థాపకులు గాలి జనార్దనరెడ్డి సువర్ణగిరి విరక్త మఠం సిద్ధలింగ మహాస్వామీజీ ఆశీర్వాదంతో తన కార్యాచరణను ప్రారంభించారు. అనంతరం ఆయన సమక్షంలో కేఆర్‌పీపీలోకి పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేరారు. ఈ సందర్భంగా సింధనూరు రెడ్డి సంఘం అధ్యక్షులు సత్యన్నగౌడ, నెక్కంటి మల్లికార్జున్, రైతునగర్ రామసుబ్బారెడ్డితో పాటు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగ మేళాకు స్పందన


ఉద్యోగార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాయచూరు రూరల్: యువత ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎల్‌వీడీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాను ప్రారంభించి ఆయన మాట్లాడారు. నేడు పట్టాలు పుచ్చుకొన్న నిరుద్యోగులు తమకు ఇష్టమైన ఉపాధి అవకాశాలను ఎంచుకొని స్వయం ఉపాధికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. మేళాలో నగరసభ అధ్యక్షురాలు లలిత, కలెక్టర్ చంద్రశేఖర్ నాయక్, జెడ్పీసీఈఓ శశిధర్, ఎస్పీ నిఖిల్‌లున్నారు.

శాకాహారంపై జాగృతి ర్యాలీ

బళ్లారి రూరల్: పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ ఇండియా, ఆంధ్రాళ్ సర్వజ్ఞ పిరమిడ్ ధ్యానకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం శాకాహారంపై జనజాగృతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పిరమిడ్ ధ్యాన కేంద్రం శిక్షకులు మాట్లాడుతూ అన్నివిధాలుగా మాంసాహారం కంటే శాకాహారమే ఆరోగ్యమని తెలిపారు. శాకాహారంలో తగినన్ని పోషక విలువలు సమృద్ధిగా దొరుకుతాయి. శాంతియుత జీవితానికి శాకాహారమే శ్రేష్టమని తెలియజేస్తూ ఆంధ్రాళ్‌లో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పిరమిడ్ ధ్యానకేంద్రం శిక్షకులు, ఆంధ్రాళ్ ప్రజలు పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా ఉంటా

● మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు భరోసా

కంప్లి: నాయనా.. నువ్వు మాకు దూరమైనా మేము సదా మీ వెంటే ఉంటామని ఒక వయోవృద్ధురాలు మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబుకు హామీ ఇచ్చారు. శుక్రవారం కంప్లి క్షేత్రంలో కెరెకెరె గ్రామంలో ఏర్పాటు చేసిన జనాశీర్వాద కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు ఇంటింటికీ వెళ్లి గ్రామస్తుల ఆశీర్వాదం పొందారు. అనంతరం సురేష్‌బాబు మాట్లాడుతూ తనపై ప్రజల్లో ఇంత అభిమానం ఉండటంపై మీ అందరికీ రుణపడి ఉంటానన్నారు. ఈ సారి ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.

జాతర పోస్టర్ విడుదల


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రముఖులు

గంగావతి రూరల్: కొప్పళ గవిమఠం జాతరపై పోస్టర్‌ను బీజేపీ జాతీయ సభ్యుడు సి.వి.చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రచయిత్రి లక్ష్మీదేవి చంద్రశేఖర్, డాక్టర్ శివకుమార్ మాలిపాటిల్, గంగావతి సమాజ సేవకుడు యమనూరప్ప హాదిమని తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవా చట్టాన్ని సంరక్షించాలి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో న్యాయ సేవా చట్టాన్ని సంరక్షించాలని న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి జిల్లాధ్యక్షులు భానురాజ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు న్యాయాంగ వ్యవస్థల బలోపేతానికి సంరక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

జేడీఎస్‌ను గెలిపిస్తే మహిళా రుణాల మాఫీ

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జేడీఎస్ పార్టీ అధికారంలోకి వస్తే 24 గంటల్లో మహిళా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని రాష్ట్ర జేడీఎస్ యువ అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి పేర్కొన్నారు. ఆయన గురువారం సింధనూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జాతీయ పార్టీలు స్థానిక సమస్యలపై స్పందించబోవన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్ 125 మంది ఎమ్మెల్యేల మెజార్టీ కోసం విజన్ పెట్టుకుందన్నారు. రాష్ట్రంలో 40 శాతం కమీషన్ సర్కార్ అధికారంలో ఉందని, ఆ పార్టీకి 40 సీట్లు కూడా రావని అన్నారు.

నిర్మాణ్-2023తో నిర్మాణ రంగానికి మేలు


శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారి రూరల్ : ఇంజనీర్లకు, కట్టడ నిర్మాణ కార్మికులకు, భవన నిర్మాణ యజమానులకు నిర్మాణ్-2023తో ఎంతో మేలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. బళ్లారి అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం కమ్మభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఇంజనీర్లు, కార్మికులందరూ సమస్యలను ఎదుర్కొన్నవారే అన్నారు. కరోనా వేళలో నిర్మాణ రంగం మరింత కష్టకాలాన్ని చవిచూసిందన్నారు. ఇంజనీరింగ్, డిప్లొమో, ఐటీఐ విద్యార్థులకు ప్రయోజనకారిగా ఉందన్నారు. మరో అతిథి నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఇంజనీర్లు మరింత పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ప్రముఖులు, ఇంజనీర్లు సంజీవ ప్రసాద్, డాక్టర్ రమేష్ గోపాల్, శేషాద్రి, ప్రకాశ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాకేశ్ పాల్గొన్నారు.

వాడీవేడిగా పాలికె సామాన్య సమావేశం

● సమస్యల పరిష్కారంలో అధికారుల ఉదాసీనతపై నిలదీత
● సమావేశంలో అధికార, పాలకపక్ష సభ్యుల మూకుమ్మడి ధ్వజం


మాట్లాడుతున్న కార్పొరేటర్ ఇబ్రహీంబాబు, హాజరైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కమిషనర్ తదితరులు

సాక్షి,బళ్లారి: నగరంలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారుల తీరుపై కార్పొరేటర్లు మండిపడ్డారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు వేర్వేరుగా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ధ్వజమెత్తారు. శుక్రవారం నగరంలోని జెడ్పీ కార్యాలయంలో నగర సమస్యలపై మేయర్ మోదుపల్లి రాజేశ్వరి, కమిషనర్ రుద్రేష్, ఉపమేయర్ మాలాన్‌బీ, స్థాయి సమితి అధ్యక్షుడు మోత్కర్ శ్రీనివాస్ పాల్గొన్న సిటీ కార్పొరేషన్ సమావేశంలో కార్పొరేటర్ ఇబ్రహీంబాబు సమావేశం ప్రారంభం కాగానే అధికారులపై విరుచుకుపడ్డారు. నగరంలోని రక్షిత మంచినీటి ప్లాంట్లను ఎందుకు సక్రమంగా నిర్వహించడం లేదని నిలదీశారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్నందున నగరంలో రక్షిత మంచినీటి ప్లాంటును బాగు చేయకపోతే నగరంలో నీటి సమస్య ఉత్పన్నమవుతుందని, తక్షణం సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని లేదా టెండర్ రద్దు చేసి రీ టెండర్ పిలవాలని సూచించారు.

రక్షిత నీటి ప్లాంట్ల నిర్వహణపై ఆగ్రహం

నగరంలో 42 రక్షిత మంచినీటి ప్లాంట్లు ఉండగా మూడు మాత్రమే పని చేస్తున్నాయని, మిగిలిన ప్లాంట్లు పని చేయడం లేదన్నారు. దీంతో ఆయా కాలనీల్లో రక్షిత మంచినీటి కోసం జనం హాహాకారాలు చేస్తున్నారని గుర్తు చేశారు. తుంగభద్ర డ్యాం నుంచి సరఫరా చేసే నీటితో పాటు రక్షిత మంచినీటి ప్లాంటును బాగు చేస్తే నగరంలో వేసవిలో నీటి సమస్య తీరుతుందన్నారు. లేకపోతే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా మంచినీటి సమస్య వచ్చినప్పుడు ఇబ్బందులు పడే కన్నా ముందుగా నిర్వహణ చేయాల్సిన అవసరం ఉందని సమావేశం దృష్టికి తెచ్చారు. మూడు నెలలకొకసారి నగర సమస్యలు, వాటి పరిష్కారం కోసం నిర్వహించాల్సిన సమావేశం ఎందుకు నిర్వహించడం లేదని పలువురు సభ్యులు ప్రశ్నించారు. మాజీ మేయర్, పాలికె 13వ వార్డు కార్పొరేటర్, పాలికె ప్రతిపక్ష నాయకుడు ఇబ్రహీంబాబు మాట్లాడుతూ నూతన లేఅవుట్లు ఎక్కడబడితే అక్కడ ఏర్పాటు చేస్తున్నారన్నారు. అక్కడ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, పలు లేఅవుట్లలో సెప్టిక్‌ట్యాంక్‌లు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సెప్టిక్ ట్యాంకుల నిర్వహణ లేమితో ఇబ్బందులు

మరికొన్ని లేఅవుట్లలో సెప్టిక్ ట్యాంకులు ఉన్నా, నిర్వహణ లేకపోవడంతో ప్రైవేటు భూముల్లోకి డ్రైనేజీ నీరు వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు లేఅవుట్లు వేసి, డబ్బులు చేసుకుని చేతులు దులుపుకుంటున్నారని, దీనిపై సమగ్రంగా నిర్వహణ ఆలోచన చేసి సరికొత్త రూల్స్ రూపొందించాలన్నారు. ఫారం-2పై కూడా సుదీర్ఘంగా చర్చించారు. ప్రైవేటు బుడా లేఅవుట్ల గురించి వచ్చే సమావేశంలోపు సమగ్ర నివేదిక తీసుకుని సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. రక్షిత మంచినీటి ప్లాంట్ల నిర్వహణ కూడా కార్పొరేషన్ స్వాధీనం చేసుకుంటే నీటి సమస్య తీరుతుందన్నారు. కార్పొరేటర్లు మించు శ్రీనివాస్, ప్రభంజన్ కుమార్, వివేక్, నందీష్ తదితరులు కూడా నగర సమస్యలపై అధికారుల దృష్టికి తెచ్చారు. రక్షిత మంచినీటి ప్లాంటును బాగు చేసి నగరంలో వచ్చే వేసవిలో నీటి సమస్యను తీర్చాలని సూచించారు. పౌరకార్మికులను పర్మినెంట్ చేసే విషయం, రోడ్లు, డ్రైనేజీ తదితర నగర మౌలిక సమస్యలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

కులమత రాజకీయాలకు నేను వ్యతిరేకం

● మాజీ సీఎం సిద్ధరామయ్య


మాట్లాడుతున్న సిద్ధరామయ్య

హుబ్లీ: తాను హిందువునే అయినా కులమత రాజకీయాలను, హిందుత్వాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తానని మాజీ సీఎం సిద్ధరామయ్య తెలిపారు. హుబ్లీ విమానాశ్రయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి వ్యతిరేకత లేదు. అయితే మందిరాన్ని రాజకీయాలకు వినియోగించుకోరాదన్నారు. మత రాజకీయాలతో ఒక మతానికి వ్యతిరేకంగా ఉద్వేగాలకు గురి చేసే రాజకీయాలను తాను వ్యతిరేకిస్తానన్నారు. ప్రతి గ్రామంలో రాముడు, ఆంజనేయుల గుళ్లున్నాయి. మేం వాటిని నిర్మించలేదా? అని ప్రశ్నించారు. మత రాజకీయాలు చేసే పార్టీలకు ప్రజలను పాలించే అర్హత లేదన్నారు. కులమతాల పేరిట రాజకీయాలు చేయడం తప్పు అని అన్నారు. సమాజంలో హిందు, ముస్లిం, క్రైస్తవులతో పాటు వివిధ ధర్మాలు సమానమే అన్నారు. వీటి పేరున రాజకీయాలు చేయడం మంచిది కాదన్నారు. తాను హిందూ విరోధిని కాను, హిందుత్వానికి విరోధినన్నారు.

క్రికెట్ విజేతలకు ట్రోఫీ ప్రదానం


ట్రోఫీని అందుకుంటున్న విజేత జట్టు సభ్యులు

గంగావతి రూరల్: నగరంలోని చెన్నబసవ స్వామి తాలూకా క్రీడాంగణంలో నిర్వహించిన జీపీఎల్-7 కెరీర్ ఛాంపియన్స్ మ్యాచ్ ఫైనల్స్‌లో వడ్డరహట్టి మారుతీ నాయక్ మయూర ఇలెవన్ జట్టుపై కౌన్సిలర్ నవీన్ మాలిపాటిల్ కిష్కింధా జట్టు గెలుపొందింది. విజేత కిష్కింధా జట్టుకు ఛాంపియన్ ట్రోఫీని ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి అందించి మాట్లాడారు. ఆటలో గెలుపు ఓటములను సమాన మనసుతో చూడాలని రన్నర్‌గా నిలిచిన జట్టుకు మనోధైర్యాన్నిచ్చారు. అనంతరం నగర వీధుల్లో డోలు భజనల మధ్య ఛాంపియన్ ట్రోఫీతో ఊరేగించారు. ఈ సందర్భంగా వివిధ జట్ల కెప్టెన్లు వలి, రాము యాదవ్, రమ, ధనుష్, ప్రవీణ్, మీరజ్‌కర్, ప్రశాంత్ పరగి, మంజునాథ ఎడెగౌడ, ప్రశాంత్ చిత్రగార, సంగప్ప చలువాది, మంజునాథ హడవద, నాయకులు, ఏపీఎంసీ సభ్యులు శివకుమార్ మాలిపాటిల్, విశ్వనాథ అక్కి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బనశంకరి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న గ్రామ ప్రజలు

బళ్లారిఅర్బన్: తాలూకాలోని శిడిగినమొళ గ్రామంలో వెలసిన బనశంకరి దేవి 14వ రథోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని బనశంకరి దేవికి విశేష పూలు, ఆభరణాలతో అలంకరణ పూజలను జరిపారు. బనశంకరి దేవస్థానం నుంచి గ్రామంలోని ప్రధాన వీధి మీదుగా రామప్ప దేవస్థానం వరకు నిర్వహించిన రథోత్సవంలో గ్రామ పెద్దలు, భక్తులు ఊరేగింపుగా సాగారు. కోలాటం, గొరవయ్యల నృత్యాలు, బ్యాండ్ వాయిద్యాలతో ఆనందోత్సాహాల మధ్య బాణసంచాను పేలుస్తూ దేవస్థానంలో వరకు రథోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హగరి ఎస్ఐ శశిధర్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. జీపీ అధ్యక్షులు పూజారి రుద్రయ్య, మాజీ అధ్యక్షులు ఓంకార్ నాయుడు, చెన్నప్పరెడ్డి, తిమ్మయ్య, హుచ్చప్ప, శీన, లక్ష్మణ బావి తదితరులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తాదులు తరలివచ్చారు.

సదాశివను వ్యతిరేకిస్తూ 10న సంకల్ప సమావేశం


మాట్లాడుతున్న గోపీనాయక్ తదితరులు

బళ్లారిటౌన్: న్యాయమూర్తి ఏజే సదాశివ కమిషన్ నివేదికపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని కేంద్రానికి సిఫారస్సు చేయరాదని ఈనెల 10 బెంగళూరులో నమ్మగోర సేన కర్ణాటక ఆధ్వర్యంలో సంకల్ప సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సేన జిల్లాధ్యక్షుడు గోపీనాయక్ తెలిపారు. శుక్రవారం పత్రికా భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీల్లో ఉన్న 101 వర్గాల వారందరినీ పరిగణలోకి తీసుకుని వారి అభిప్రాయాలు సేకరించి చర్చించాలన్నారు. అయితే పక్షపాతంగా ఈ నివేదికపై సిఫార్సు చేస్తున్నందున దీన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా నకిలీ ప్రమాణ పత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నేతలు స్వామినాయక్, చంద్రానాయక్, కృష్ణనాయక్, సంతోష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

11న చక్కెర కర్మాగారాన్ని ప్రారంభించాలని ర్యాలీ

హొసపేటె: నగరంలో చక్కెర కర్మాగారాన్ని వెంటనే ప్రారంభించాలని, విద్యుత్ మీటర్లను, వ్యవసాయ నూతన చట్టం అమలును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న నగరంలో బృహత్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హసిరు సేనె జిల్లా సంచాలకుడు సణ్ణక్కి రుద్రప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకర్ల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంతకు ముందు నగరంలో ఉన్న ఐఎస్ఆర్ చక్కెర కర్మాగారాన్ని మూసివేయడంతో తుంగభద్ర ఆయకట్టు రైతులకు ప్రతి ఏటా వేలాది ఎకరాల్లో పండించిన చెరుకు వంటను కోత కోసిన అనంతరం ఇతర జిల్లాల్లో ఉన్న చెరుకు కర్మాగారాలకు సరఫరా చేస్తుండటం కష్టకరంగా, తీవ్ర సమస్యగా మారిందన్నారు. ఈనేపథ్యంలో వెంటనే నగరంలోని ఐఎస్ఆర్ చక్కెర కర్మాగారాన్ని ప్రారంభించి చెరుకు రైతులకు అనుకూలం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కార్తీక్, నేతలు మల్లికార్జున, నాగరాజ్ రేవణ్ణ సిద్దప్ప, రుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

యువత కబడ్డీలో రాణించాలి


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: యువత కబడ్డీ పోటీలలో రాణించాలని గ్రామీణ కాంగ్రెస్ యువ నేత చంద్రశేఖర్ నాయక్ పిలుపు ఇచ్చారు. శుక్రవారం తాలూకాలోని మండలగేరి గోకార్‌సాబ్ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాగా గురువారం రాత్రి నిర్వాహకులు దర్గాలో విశేష పూజలు నిర్వహించారు. ఇలా ఉండగా తాలూకాలోని అరళిబండలో రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ శాంభవి దేవి ఆలయాన్ని దర్శించి ఆలయ ప్రధాన గురువు మరిస్వామి ఆశీర్వాదం పొందారు.

రాష్ట్రంలో మళ్లీ లాటరీ విక్రయాలు ?

● నిషేధం ఎత్తేయాలని లాటరీ వర్తకుల సంఘం మనవి

సాక్షి బెంగళూరు: రాష్ట్రంలో కొన్నేళ్లుగా నిషేధంలో ఉన్న లాటరీ విక్రయాలు తిరిగి పునఃప్రారంభం కానున్నాయనే సమాచారం వినిపిస్తోంది. లాటరీ విక్రయాలను పునః ప్రారంభించాలని రాష్ట్ర లాటరీ చిల్లర వర్తకుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ విషయంపై గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌కు, ముఖ్యమంత్రికి ఆ సంఘం లేఖ రాసింది. లాటరీ విక్రయాలను పునఃప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది. ఈ విషయంపై గవర్నర్ కార్యాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ వచ్చింది. లాటరీ విక్రయాలపై ప్రభుత్వం నిర్ణయం గురించి ఆరా తీస్తూ ఈ లేఖ ఉంది. ఈ క్రమంలో మళ్లీ రాష్ట్రంలో లాటరీ విక్రయాలు పునఃప్రారంభం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. లాటరీ విక్రయ వ్యాపారం పొరుగు రాష్ట్రం కేరళలో ఎంతో ఫేమస్ కాగా గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఏడు లాటరీలను నిర్వహించేది. వార్షికంగా వందల కోట్ల రూపాయల మేర ఆదాయం వచ్చేది. లాటరీ విక్రయాలతో వేలాదిమంది ఏజెంట్లు జీవనం సాగిస్తూ ఉండేవారు. అయితే లాటరీ విక్రయాల ద్వారా వేలాది కుటుంబాలు వీధిన పడుతున్నాయని 2007లో రాష్ట్ర ప్రభుత్వం వీటిపై నిషేధం విధించింది. దీనిపై కొందరు 2014లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు కూడా ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు పలికింది. అయితే తాజాగా మళ్లీ లాటరీ విక్రయ సంఘం ప్రభుత్వానికి పునఃప్రారంభం కోసం మనవి చేయడంతో ఈ అంశం మళ్లీ తెరమీదకు వచ్చింది. గతంలో ప్రభుత్వ సంస్థ ఎంఎస్ఐఎల్ ద్వారా ఈ లాటరీలను సర్కార్ విక్రయించేది. రాష్ట్రంలో సంప్రదాయక లాటరీ వ్యవస్థను పునఃప్రారంభించాలని ఆ సంఘం మనవి చేసింది. రాష్ట్ర వనరులు పెరగడమే కాకుండా నిరుద్యోగులకు ఉపాధి కల్పించే అవకాశం ఈ లాటరీ వ్యవస్థ ద్వారా ఉందని మనవి చేసింది. అయితే ఈ విషయంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని అంతా ఆసక్తి నెలకొంది.

యువకుడిపై దాడి

యశవంతపుర: ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన యువతితో మాట్లాడుతున్న ఓ సముదాయానికి చెందిన యువకుడిపై మరో సముదాయానికి చెందిన యువకుల గుంపు దాడి చేసింది. దక్షిణకన్నడ జిల్లా సుబ్రమణ్యలోని కల్లుగుండకి చెందిన యువకుడు ఆ అమ్మాయితో మాట్లాడుతుండగా గమనించిన యువకుల గుంపు అతనిపై దాడికి పాల్పడింది. తలకు బలమైన గాయలు కావటంతో సుళ్య ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

క్రిష్ణగిరి: ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు. మహారాజగడ పోలీసుల కథనం మేరకు జిల్లా కేంద్రం క్రిష్ణగిరి తిరువళ్లువర్ నగర్‌కు చెందిన ప్రకాష్(31) ఈనెల 3వ తేదీ బైక్‌లో ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం క్రిష్ణగిరి – కుప్పం రోడ్డులో కే.పూజారిపట్టి వద్ద విగతజీవిగా కనిపించాడు. ప్రకాష్ తండ్రి ఫిర్యాదు మేరకు మహారాజగడ పోలీసులు వెళ్లి పరిశీలించగా వంటిపై గాయాలున్నట్లు తేలింది. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

నృత్య కళాకారులకు ప్రశంసాపత్రాల పంపిణీ

గంగావతి రూరల్: నగరంలోని గురుచెన్నబసవ శివయోగి జాతర మహోత్సవంలో భాగంగా శుక్రవారం నటరాజ నృత్య కళా సంస్థ నేతృత్వంలో భరత నాట్య ప్రదర్శనను తాత మఠంలోని వేదికలో ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రశస్తి పురస్కృతురాలు, సంస్థ సంస్థాపకురాలు హెచ్ సుమారాణి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని హెచ్ గౌసలప్ప అధ్యక్షతన నిర్వహించారు ముఖ్య అతిథులుగా సంతోషదేవి బాఠియా, బాబులాల్ బాఠియా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పనులకు శ్రీకారం


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి: నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో జీజీఎం పథకం అమలు చేసినట్లు ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. శుక్రవారం తాలూకాలోని జవుకు గ్రామంలో రూ.83.77 లక్షల ఖర్చుతో జీజీఎం తాగునీటి పథకం పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయిల ద్వారా రక్షిత నీటిని అందిస్తామన్నారు. గ్రామీణ ప్రజలకు తాగునీటి కోసం నెల్లుడి, జవుకు చెరువులను అభివృద్ధి చేసి ఎల్ఎల్‌సీ కాలువ ద్వారా నీరు అందిస్తామన్నారు. చిత్రదుర్గలో ఎస్సీ, ఎస్టీ సమావేశంలో ఎస్టీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ ప్రణాళిక విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖులు ఎస్.మల్లికార్జున, పంపాపతి, కుమారస్వామి, ఎస్.సిద్దప్ప, ఎస్.బసవరాజ్, టీ.బసవరాజ్, ఆర్.పంపనగౌడ, రాజనగౌడ, అంజనాపుర వీరభద్రగౌడ, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వకుళసాలి భవనానికి స్థలమిస్తాం

స్వకుళసాలి సమాజ సముదాయ భవనానికి స్థలం కోసం జిల్లాధికారికి ప్రతిపాదన అందించి స్థలాన్ని అందిస్తామని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యేకు నేకార స్వకుళసాలి సముదాయ తాలూకా అధ్యక్షులు అంజినప్ప మశిగార్ అందించిన వినతిపత్రంపై ఆయన స్పందించి మాట్లాడారు. ఈ సందర్భంగా తిప్పణ్ణ, ఎం.భరత్‌కుమార్, ఎస్.మల్లికార్జున, శివ, లక్ష్మణ, సుభద్రమ్మ, లత, కుసుమ, గీత, శ్రీదేవి, రత్నమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

హొసపేటె: తాలూకాలోని మలపనగుడి, హొసూరు గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయితీల ఆధ్వర్యంలో మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం(నరేగ) కింద చేపట్టిన మంచినీటి నిర్వహణ అభివృద్ధి పనులను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి జీవీ.రమేష్ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను నాణ్యతగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామాలను స్వచ్ఛతగా ఉంచుకొని ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు గంగాధర, రఘు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాల నుంచి విముక్తికి స్వామీజీ పాదయాత్ర

రాయచూరు రూరల్: దురలవాట్లతో కుటుంబాలు వీధి పాలు కాకుండా ఉండడానికి కలబుర్గి జిల్లాలో ఓ స్వామీజీ సద్భావన పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. కూలీ, నాలీ పనులు చేసే పేదలు మద్య, ధూమపాన వ్యసన విముక్తి పొందాలంటూ అఫ్జల్‌పూర్ గురుమళేంద్ర శివాచార్య సంస్థాన మఠాధిపతి విశ్వారాధ్య మళేంద్రశివాచార్య భిక్షాపాత్ర పట్టుకొని తాలూకాలో సద్భావన పాదయాత్రను ప్రారంభించారు. అఫ్జల్‌పూర్ తాలూకా మణ్ణూరు నుంచి స్వామీజీ చేపట్టిన ఈ పాదయాత్ర 23 రోజుల పాటు 118 గ్రామాల్లో సంచరిస్తుంది. పాదయాత్రలో దురలవాట్లకు లోను కావద్దని ప్రచారం చేస్తున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా దురలవాట్లైన సిగరెట్, బీడీ, పొగాకు, గుట్కా, బీరు సీసాలను స్వామీజీ భిక్షాపాత్రలోకి ప్రజలు స్వచ్ఛందంగా పారవేస్తున్నారు.

కోలారు వార్తలు...

అన్ని మతాల వారికి యాత్ర సౌలభ్యం


ఓం శక్తి ఆలయానికి భక్తులను పంపుతున్న దృశ్యం

కోలారు : కేజీఎఫ్ నుంచి అన్ని మతాల వారికి వారి పుణ్యక్షేత్రాల దర్శనానికి యాత్ర సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. శుక్రవారం కేజీఎఫ్ నుంచి ఓం శక్తి ఆలయానికి వెళ్లే మహిళా భక్తులకు ఉచిత బస్ వ్యవస్థను కల్పించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇప్పటికే తమిళనాడులోని మేల్‌వరత్తూరు ఆది పరాశక్తి, శబరిమలై ఆలయానికి సుమారు 150 బస్సులను పంపించినట్లు తెలిపారు. క్రైస్తవులు, ముస్లింలకు కూడా పుణ్యక్షేత్రాల దర్శనానికి ఈనెల 16 తర్వాత ఉచిత బస్, భోజన వ్యవస్థ కల్పిస్తామన్నారు.

సిద్ధరామయ్యకు మద్దతివ్వండి

శ్రీనివాసపురం : ఈ నెల 9వ తేదీన కోలారుకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మద్దతిచ్చి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి కృష్ణబైరేగౌడ పిలుపునిచ్చారు. శుక్రవారం తాలూకాలోని మద్దేరి గ్రామంలో ఏర్పాటు చేసిన సిద్ధరామయ్య పర్యటన పూర్వ సిద్ధతా సమావేశంలో ఆయన కార్యకర్తలు, పార్టీ నాయకులనుద్దేశించి మాట్లాడారు. సిద్ధరామయ్య ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కోలారు జిల్లాకు కేసీ వ్యాలి నీటిని అందించి జిల్లాలో నీటి సమస్యను పరిష్కరించారు. సిద్ధరామయ్య కృషి వల్లనే నేడు కోలారు జిల్లాలో అంతర్జలాల స్థాయి పెరిగి రైతుల వ్యవసాయానికి ఎంతో అనుకూలమైందన్నారు. కోలారు నుంచి సిద్ధరామయ్య పోటీ చేసి గెలిచి ముఖ్యమంత్రి అయితే నియోజకవర్గాన్ని ఎన్నో విధాలుగా అభివృద్ధి చేస్తారన్నారు. కోలారు ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ, పరిషత్ మాజీ ఉప సభాపతి వి ఆర్ సుదర్శన్, ఎమ్మెల్సీలు నసీర్ అహ్మద్, అనిల్‌కుమార్, మునియప్ప, శ్రీకృష్ణ, టిఎపిసిఎంఎస్ అధ్యక్షుడు నాగనాళ సోమణ్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నియామకాల్లో షరతులు తగదు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో విధుల నిర్వహణకు కార్యకర్తలు, సహాయకుల నియామకాలకు విధించిన షరతులను తొలగించాలని రాష్ట్ర అంగన్‌వాడీ కార్య కర్తల సంఘం డిమాండ్ చేసింది. గురువారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి జిల్లాధ్యక్షురాలు పద్మ మాట్లాడారు. కేంద్రప్రభుత్వ ఆదేశాల్లో వయోపరిమితి ఆధారంగా పదోన్నతుల్లో రాష్ట్ర ప్రభుత్వం సవరించిన ఆదేశాలతో పదోన్నతులు కోల్పోయే వారికి అవకాశం కల్పించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ముగ్గురికి ఆర్థిక సహాయం

కోలారు : ప్రమాదానికి గురైన పార్శ్వవాయువుతో బాధపడుతున్న ముగ్గురికి డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు బ్యాలహళ్లి గోవిందగౌడ వారి చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. నగరంలోని మునేశ్వర నగర నివాని గార పని చేసుకుని జీవనం సాగిస్తున్న నాగరాజ్ ప్రమాదంలో కాలికి శస్త్ర చికిత్స చేయించుకోవాల్సి ఉండగా కూతురు పెళ్లి కోసం దాచుకున్న రూ.లక్షన్నర తన చికిత్స కోసం ఖర్చు చేసుకున్నాడు. జీవన నిర్వహణ కష్టంగా ఉండడాన్ని గుర్తించిన గోవిందగౌడ ఆయన నివాసానికి వెళ్లి చికిత్సకు, జీవన నిర్వహణకు ఆర్థిక సహాయం అందించారు. దీనికి తోడు వచ్చే నెలలో జరగాల్సి కుమార్తె వివాహానికి అయ్యే ఖర్చును తానే భర్తిస్తానని హామీ ఇచ్చారు. అదే కాలనీలో గత పదేళ్లుగా పూలు అమ్ముకుని జీవిస్తున్న లక్ష్మమ్మకు పార్శ్వ వాయువు తగిలి ఇబ్బంది పడుతుండడాన్ని గుర్తించి ఆ మహిళ కష్టాన్ని తెలుసుకుని ఆమె ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందించారు. కారంజికట్టలో నివాసం ఉంటున్న గాయత్రి అనే మహిళ కూడా పార్శ్వవాయుతో బాధపడుతూ జీవనం గడవడం కష్టంగా ఉందని తెలుసుకున్న గోవిందగౌడ ఆమె ఇంటికి వెళ్లి చికిత్సకు, ఇల్లు గడవడానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బ్యాంకు డైరెక్టర్ నాగనాళ సోమణ్ణ, కె వి దయానంద తదితరులున్నారు.

ఎలుగుబంటి దాడిలో రైతుకు తీవ్రగాయాలు

హొసపేటె: ఎలుగుబంటి దాడిలో రైతుకు తీవ్రగాయాలైన ఘటన తాలూకాలోని కాకుబాళు గ్రామ శివార్లలో శుక్రవారం జరిగింది. సండూరు తాలూకా జోగ గ్రామ నివాసి ముస్టూరప్ప(58) ఉదయం తమ బంధువుల ఇంటికి వెళుతుండగా అకస్మికంగా ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. అతనిని మెరుగైన చికిత్స కోసం బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్దతు ధర ప్రకటించాలి

రాయచూరు రూరల్: జిల్లాలో రైతులు పండించిన పత్తి, మిరప పంటలకు మద్దతు ధర ప్రకటించాలని రైతు సంఘం అధ్యక్షుడు శరణప్ప పేర్కొన్నారు. ఆయన గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రైతుల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని పత్తికి క్వింటాల్‌కు రూ.12 వేల మద్దతు ధర కేటాయించాలని అన్నారు.

ఆక్రమిత అటవీభూమి స్వాధీనం

● స్థలానికి ఫెన్సింగ్ వేసిన సిబ్బంది


స్వాధీనం చేసుకున్న స్థలాన్ని వేసిన ఫెన్సింగ్

కోలారు : నాగలాపురం గ్రామ సమీపంలోని సర్వే నెంబర్ 143 లోని 12 ఎకరాల ఆక్రమిత అటవీభూమిని అటవీశాఖ అధికారులు పూర్తిగా స్వాధీనం చేసుకుని సరిహద్దులను గుర్తించి స్థలంలో ఫెన్సింగ్ వేశారు. సదరు స్థలాన్ని జిల్లా యంత్రాంగం మొక్కలను పెంపకానికి గాను అటవీశాఖకు గత 50 ఏళ్ల క్రితమే అందించింది. అయితే ఇటీవల స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకోవడంతో అటవీశాఖ అధికారులు ఆ స్థలంలో ఆక్రమణలను తొలగించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో అటవీశాఖ సిబ్బంది ఆక్రమణదారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని ముగ్గురు అటవీశాఖ సిబ్బంది గాయపడ్డారు. పోలీసులు ఆక్రమణదారులను అరెస్టు చేయడంతో అటవీశాఖ అధికారులు శుక్రవారం స్థలం వద్దకు వెళ్లి సరిహద్దులను గుర్తించి చుట్టూ ఫెన్సింగ్ వేసి భద్రం చేశారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

కోలారు : విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలని డీడీపీఐ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం నగర సమీపంలోని సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన విజ్ఞాన ఉత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు శాస్త్ర సాంకేతికతపై బాల్యం నుంచే తగిన శిక్షణ ఇస్తే వారు ఉత్తమ సాధకులు అవుతారన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే ప్రయత్నాన్ని సంస్థ చేస్తోందన్నారు. విద్యార్థులు మూఢనమ్మకాలను పక్కనబెట్టి విజ్ఞాన విషయాల పట్ల శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు ప్రభాకరరెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బసవకుమార్, జిల్లా శిక్షణాధికారి సీఆర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నోటు పుస్తకాల పంపిణీ



శివమొగ్గ: బెంగళూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఆర్.చంద్రు శివమొగ్గ తాలూకాలోని కుంసి, చుట్టు పక్కల గ్రామాల్లో నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. శుక్రవారం కుంసి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మూడు వేల మందికి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కుంసి గ్రామానికి చెందిన చంద్రు బెంగళూరులో వ్యాపారవేత్తగా ఎదిగారు. ప్రతి ఏడాది పిల్లలకు నోటు పుస్తకాలను అందిస్తున్నారు.

ఇంటిని విక్రయిస్తామని వంచన

మైసూరు: ఇంటిని లీజుకు ఇస్తామని చెప్పి రూ.5 లక్షలు తీసుకొని వంచనకు పాల్పడిన ఘటన మైసూరులో చోటు చేసుకుంది. సిద్దార్థ నగరలోని వినయ మార్గంలో పానీపూరిని విక్రయించి జీవనం సాగిస్తున్న జయలక్ష్మి అద్దె ఇంటి కోసం గాలిస్తుండగా కుంబారహళ్లి 3వ క్రాస్‌లోని ఇంటిని రూ.5 లక్షలకు లీజుకు ఇస్తామని మహదేవమ్మ, కుమారి, గౌరి, పుట్టమాదయ్య, లోకేష్, మంజు ముందుకు వచ్చారు. అయితే రూ.8లక్షలకే ఇంటిని విక్రయిస్తామని, అయితే ఇంటిపై బ్యాంకులో రూ.2.88లక్షల రుణం ఉందని చెప్పారు. నగదు ఇస్తే అప్పు తీర్చి ఇంటిని ఇస్తామని నమ్మబలికారు. దీంతో జయలక్ష్మి రూ.5లక్షలు అందజేసింది. అనంతరం ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించకుండా ముఖం చాటేశారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

బస్సులో మంటలు

మైసూరు: ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సులో మంటలు చెలరేగిన ఘటన శుక్ర వారం చోటు చేసుకుంది. వివరాలు... మైసూరు చాముండిబెట్టలోని నాడిన శక్తి దేవత చాముండేశ్వరి అమ్మవారి దర్శనానికి 50 మంది ప్రయాణికులు వచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. బస్సు కొండ మార్గంలో ఉండగా డీజిల్ లీక్ కావడంతో సైలెన్సర్ నుంచి మంటలు వచ్చాయి. డ్రైవర్ వెంటనే గుర్తించి ప్రయాణికులను కిందకు దించి మంటలను ఆర్పివేశారు. సకాలంలో గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది.

లారీ బోల్తా, డ్రైవర్ మృతి

మైసూరు: లారీ అదుపుతప్పి బోల్తా పడటంతో డ్రైవర్ మృతి చెందగా, క్లీనర్ తీవ్రగాయపడిన ఘటన చామరాజనగర తాలూకా సువర్ణావతి జలాశయం సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతుడిని అనిశ్ (30)గా గుర్తించారు. పుణజనూరి నుంచి చామరాజనగరకు వస్తుండగా వేగానికి లారీ మలుపు వద్ద పల్టీ కొట్టింది. గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైతు జల సమాధి

మైసూరు: రైతు జలసమాధి అయిన ఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా వడ్డంబాలు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు మహదేవ శెట్టి(46) గ్రామ సమీపంలోని లక్ష్మణ తీర్థ నదిలో పశువులను శుభ్రం చేస్తూ లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. హుణసూరు గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కిలాడీ లేడీలు

మైసూరు: బంగారు దుకాణంలో కొనుగోలు దారులకు వచ్చిన ఇద్దరు మహిళలు చెవి కమ్మలు తస్కరించిన ఘటన మైసూరులో నగరంలో చోటుచేసుకుంది. నగరంలోని అశోక రోడ్డులో ఉన్న పవన్ జువెలరీ దుకాణంలోకి ఇద్దరు మహిళలు చెవి కమ్మలు చూపించాలని అడిగారు. నిర్వాహకుడు నగలు వారికి చూపించి ఆయన క్యాష్ కౌంటర్ వద్ద ఉన్న సమయంలో ఒరిజనల్ కమ్మల స్థానంలో నకిలీవి పెట్టి అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు. వీరి వాలకంపై అనుమానించిన యజమాని సీసీ కెమెరాలో పరిశీలించగా కమ్మల చోరీ బయటపడింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బీజేపీ పోలింగ్ బూత్ కార్యకర్తల సమావేశం




కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర పరిధిలో స్థానిక ఎమ్మెల్యే అరవింద లింబావళి ఆదేశాల మేరకు హాళెహళ్లి పోలింగ్‌బూత్ సంఖ్య 61, 62లో పోలింగ్‌బూత్ విజయం అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ కార్యకర్తలు, ఇంటింటికి వెళ్లి స్వీట్లు పంపిణీ చేసి బీజేపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఆవులహళ్లి వార్డు ఇన్‌చార్జ్ కెంపణ్ణ, బెంగళూరు ఉత్తర తాలూకా మాజీ అధ్యక్షుడు బాగ్యమ్మ సతీష్, గ్రామీణ విభాగం మండల ప్రధాన కార్యదర్శి కేవీ.నాగరాజు, కిత్తగనూరు గ్రామ పంచాయతీ సభ్యుడు నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రమణీయం..రథోత్సవం



అమ్మవారి కలశాలను తీసుకువస్తున్న కమిటీ అధ్యక్షుడు బసవరాజ్ తదితరులు



ప్రత్యేక అలంకరణలో బనశంకరిమాత



భక్తజనసంద్రం మధ్య రథోత్సవం

- కిక్కిరిసిన బనశంకరీ ఆలయం
- అమ్మవారికి విశేష పూజలు

బనశంకరి: భక్తుల మొక్కులు తీర్చే కల్పవల్లి బనశంకరీదేవి బ్రహ్మరథోత్సవం అశేషభక్త జనవాహిని మధ్య అంగరంగవైభవంగా జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ శాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీదేవి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ, విశేషపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మేళతాళాలతో అమ్మవారి కలశాలను ఊరేగింపుగా ఆలయ అధ్యక్షుడు బసవరాజ్ కమిటీ సభ్యులు, ఈఓ పద్మ తదితరులు రథం వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని రథంపై అధిష్టించారు. అంతకు ముందు అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. మధ్యాహ్నం 12.50 నిమిషాలకు శుభ మేష లగ్నంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏహెచ్.బసవరాజ్, కమిటీ సభ్యులు రథాన్ని లాంఛనంగా లాగి ప్రారంభించారు. రథం ముందుకు కదలగానే భక్తులు అరటిపండ్లు, దవనం విసిరి మొక్కులు తీర్చుకున్నారు. రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. శుక్రవారం కావడంతో భక్తులు నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు.

నేడు తెలుగు పాస్టర్ల సమావేశం

శివాజీనగర: నగరంలోని మత్తికెర హెచ్‌ఎంటీ లేఔట్‌లో ఉన్న రసెల్ మెమోరియల్ తెలుగు చర్చిలో శనివారం కర్ణాటక తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో తెలుగు పాస్టర్ల సమావేశం జరుగనుందని కేటీసీఎంఎఫ్ సంస్థాపక అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ ఎం.బెంజమిన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర తదితర జిల్లాల్లో సేవలందిస్తున్న పాస్టర్లను ఆధ్యాత్మికంగా బలపరచాలనే ఉద్దేశ్యంతో కేటీసీఎంఎఫ్ పని చేస్తున్నట్లు తెలిపారు. శనివారం జరిగే పాస్టర్ల సమావేశంలో ప్రసంగీకులు డాక్టర్ జాన్‌పాల్, డాక్టర్ రెవరెండ్ జేడీ మోజస్ దైవవర్తమాన్ని వినిపిస్తారని తెలిపారు.

కేంద్ర మంత్రితో బచ్చేగౌడ భేటీ



నితిన్ గడ్కరితో మాట్లాడుతున్న ఎంపీ బచ్చేగౌడ

కృష్ణరాజపురం: రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని గురువారం బెంగళూరులో బెంగళూరు గ్రామీణ ఎంపీ బచ్చేగౌడ కలిశారు. నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వివరించారు. కృష్ణరాజపురంలో కేబుల్ వంతెన నుంచి హొసకోటెలో ఉన్న కొళతూరు గేట్ వరకు హెలివేటెడ్ కారిడార్ నిర్మించాలని విన్నవించారు.

శివమొగ్గ జిల్లాలో 14.41 లక్షల ఓటర్లు



శివమొగ్గ: శివమొగ్గ జిల్లాలో ఓటర్లు 14,41,833 మంది ఉన్నారు. ఈ మేరకు 2023 సంవత్సరపు ఓటర్ల ఫైనల్ జాబితాను కలెక్టర్ సెల్వమణి విడుదల చేశారు. ఇందులో పురుషులు 7,14,490, మహిళలు 7,27,310 మంది ఉన్నారు. కొత్తగా 22,185 మంది ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. అందులో పురుషులు 11,760, మహిళలు 10,419 మంది ఉన్నారు.

చిరుతల కోసం గాలింపు ముమ్మరం



గాలింపు చర్యల్లో అటవీ సిబ్బంది

మైసూరు: మైసూరు నగరంలో నడిబొడ్డున ఉన్న సీఎఫ్‌టీఆర్‌ఐ సంస్థ ఆవరణంలో చిరుతల జోడిగా కనిపించడంతో అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. చిరుతలు తిరుగుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో అధికారులు బోనులు ఏర్పాటు చేసి అటవీ సిబ్బంది తీవ్రంగా గాలిస్తున్నారు. మూడు రోజులుగా చిరుతల కోసం వేట కొనసాగుతూనే ఉంది. చిరుతలను వెంటనే బంధించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చెరకు తోటలో చిరుత కూనలు

మైసూరు: మైసూరు జిల్లా టి.నరిసిపుర తాలూకాలో చిరుత కూనలు బయటపడ్డాయి. యాచేనహళ్లి గ్రామానికి చెందిన రైతు క్యాతేగౌడ పటేల్‌కు చెందిన చెరకు తోటలో రెండు చిరుత కూనలు కనిపించడంతో అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీ సిబ్బంది అక్కడికి చేరుకుని చిరుత కూనలను స్వాధీనం చేసుకుని సంరక్షణ కేంద్రానికి తరలించారు. తల్లి చిరుత కోసం రెండు బోనులు ఏర్పాటు చేశారు.

నిందితుడిపై కాల్పులు



ఆస్పత్రిలో మంజునాథ్

యశవంతపుర: హత్య కేసుకు సంబంధించి పంచనామా చేస్తుండగా పోలీసులపై దాడి చేసి పారిపోవడానికి యత్నించిన నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపిన ఘటన గురువారం కలబుర్గిలో జరిగింది. గాయపడిన మంజునాథ్‌స్వామిని ఆస్పత్రికి తరలించారు. హత్యకేసుకు సంబంధించి మంజునాథ్‌ను పోలీసులు గురువారం సాయంత్రం ఘటన స్థల్లానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో నిందితుడు పోలీసులపై చాకుతో దాడి చేయడానికి యత్నించాడు. దీంతో పోలీసులు కాలిపై కాల్చడంతో అతను కుప్పకూలిపోయాడు. నిందితుడితో పాటు గాయపడిన కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించారు. చౌక్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కొనసాగిన అన్నదాతల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

కెలమంగలం: ఉద్దనపల్లి ప్రాంతంలో 5వ సిఫ్‌కాట్ ఏర్పాటుకు ప్రభుత్వం వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకునేందుకు నోటీసులు జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ బాధిత రైతులు చేపట్టిన ఆందోళన కొనసాగింది. గురువారం ఉద్దనపల్లి ప్రాంతంలో రైతులు ఆందోళన నిర్వహించగా కెలమంగలం పోలీసులు వారిని అరెస్ట్ చేసి ప్రైవేట్ కళ్యాణమంటపానికి తరలించి సాయంత్రం విడుదల చేశారు. శుక్రవారం మళ్లీ బాధిత రైతులు ఆందోళన చేపట్టారు. తమకు జీవనాధారమైన సారవంతమైన భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు.

ఐక్యతా సమావేశాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సోమయ్య, చిత్రంలో ఎమ్మెల్యే శివశంకర్ రెడ్డి తదితరులు

గౌరిబిదనూరు: ఈ నెల 8న చిత్రదుర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరగనున్న ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర స్థాయి ఐక్యతా సమావేశానికి తాలూకా నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన స్వగ్రామం నాగసంద్రలోని ఇంటిలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. దాదాపు 5 లక్షల మంది సమావేశానికి హాజరుకానున్నారని, పార్టీ ప్రముఖులు సోనియా, రాహుల్‌గాంధీ, రణదీప్ సుర్జేవాలా, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ తదితరులు రానున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవరెడ్డి, హనుమంత రెడ్డి, ప్రకాశరెడ్డి, ఇంద్రకుమార్, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం





అవగాహన జాతా దృశ్యం, సిరిధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్

తుమకూరు: సిరిధాన్యాలు ప్రకృతి ప్రసాదించిన అద్భుత సహజ ఆహార ధాన్యాలని, వాటిని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా అధికారి వైఎస్ పాటిల్ అన్నారు. శుక్రవారం నగరంలో సిరిధాన్యాల వినియోగంపై అవగాహన జాతాను ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో పోషక విలువలు కలిగిన సిరిధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల పిల్లల్లో మంచి ఎదుగుదల ఉంటుందన్నారు. చిరు ధాన్యాల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, ప్రజలకు వీటిపై అవగాహన కల్పించడానికి జాతా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. జాతాలో పెద్ద ఎత్తున విద్యార్థులు, స్థానికులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పరిశీలిస్తున్న యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

కెలమంగలం: తళి సమితిలోని బిన్నమంగలం నుంచి గుమ్మళాపురం వరకు రూ. 40 లక్షలతో జరుగుతున్న తారు రోడ్డు పనులను తళి యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరిశీలించారు. నాణ్యత పాటించాలని, త్వరగా ముగించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గిరీష్‌స్వామి పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

గౌరిబిదనూరు: కేంద్ర, రాష్ట్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ నగర అధ్యక్షుడు, నగరసభ సభ్యుడు మార్కెట్ మోహన్ బూత్ స్థాయి నాయకులకు సూచించారు. పట్టణంలోని 121వ బూత్ పరిధిలో నాయకుల ఇళ్లపై పార్టీ జెండాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాబోవు ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్, జయణ్ణ, వేణుమాధవ్, అరుణమ్మ, రమేష్, ఫైరోజ్ పాల్గొన్నారు.

జాతర ప్రారంభం



తుమకూరు: తుమకూరు జిల్లా శిర తాలూకా పట్టనాయకనహళ్లిలో చరిత్ర ప్రసిద్ధి చెందిన శ్రీ గురుగుండ బ్రహ్మేశ్వర స్వామి జాతర వేడుకలను శుక్రవారం స్ఫటికపురి మహాసంస్థాన మఠానికి చెందిన పీఠాధ్యక్షుడు శ్రీ నంజావధూత స్వామీజీ ప్రారంభించారు. పది రోజుల పాటు వేడుకలు జరుగుతాయి.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరి మృతి



యశవంతపుర: బాగలకోట జిల్లా ముథోళ వద్ద సవదత్తి యల్లమ్మ జాతర ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఉండగా ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా 15 మంది గాయపడ్డారు. శుక్రవారం కుళలి నిరాణి చక్కెర ఫ్యాక్టరీ వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి 20 అడుగుల లోతులో ఉన్న చెరకు తోటలో పడిపోయింది. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వీరిలో గోవింద పాటిల్ (20), హనుమంత బొమ్మనక్క సవర (20) మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హోసూరు వార్తలు..

ప్లస్‌టూ విద్యార్థిని అదృశ్యం

హోసూరు: బంధువుల ఇంటికి అంటూ వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని తల్లిదండ్రులు హోసూరు మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు... ధర్మపురికి చెందిన 17 ఏళ్ల విద్యార్థిని అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌టూ చదువుతోంది. రెండు రోజుల క్రితం హోసూరు సమీపంలోని పేరండపల్లిలో నివాసముంటున్న బంధువుల ఇంటికెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో గాలించారు. జాడ తెలియకపోవడంతో హోసూరు మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి

హోసూరు: నిర్మాణంలో ఉన్న ఇంటి ముందు ఏర్పాటు చేసిన నీటి తొట్టిలో పడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...పట్టణంలోని అణ్ణానగర్ ప్రాంతానికి చెందిన థామస్ కూతురు ఆషియా (8). గురువారం సాయంత్రం చిన్నారి ఇంటి ముందు ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి మృతి చెందింది. పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బాలిక మృతదేహాన్ని హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఒకే దేశం ఒకే రేషన్‌కార్డు డెమో విడుదల

హోసూరు: జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా ఒకే దేశం ఒకే రేషన్‌కార్డు డెమోను జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో కలెక్టర్ జయచంద్రభానురెడ్డి విడుదల చేశారు. ఈ పథకం ద్వారా అర్హులైన వినియోగదారులు దేశవ్యాప్తంగా ఏ రేషన్ దుకాణంలోనైనా రేషన్ వస్తువులు కొనుగోలు చేసుకోవచ్చునని తెలిపారు. డీఆర్వో రాజేశ్వరి, అధికారులు వేడియప్పన్, మహమ్మద్ అస్లాం, సతీష్‌కుమార్, హోసూరు కార్పొరేషన్ కమిషనర్ బాలసుబ్రమణి, ఏకాంబరం, సుకుమార్ పాల్గొన్నారు.

ఓం శక్తి ఆలయానికి భక్తులు



ఆలయానికి బయలుదేరుతున్న భక్తులు

చింతామణి: తమిళనాడులోని మేల్‌మరవత్తూరు ఓం శక్తి ఆలయానికి శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్లారు. తాలుకాలోని సంతకల్లహళ్లి గ్రామానికి చెందిన భక్తుల కోసం సమాజ సేవకుడు గోపి బస్సు ఏర్పాటు చేశారు.

పాఠశాల స్థాయి పెంపుపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న ప్రముఖులు

హోసూరు: హోసూరు తాలూకా కొత్తపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఉన్నతోన్నత పాఠశాలగా స్థాయి పెంచే విషయంపై శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులతో అభిప్రాయాలు సేకరించారు. సేవగానపల్లి, కొత్తపల్లి, కొడియాళం తదితర గ్రామాల విద్యార్థులు పై చదువుల కోసం బాగలూరు, నెల్లూరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఇక్కడే చదువుకునేలా పాఠశాల స్థాయిని పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరడంతో పాఠశాల ప్రాధానోపాధ్యాయిని మమతా వెంకటేష్, జిల్లా కౌన్సిలర్ ఆర్.కే. రవికుమార్ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. హోసూరు యూనియన్ వైస్ చైర్మన్ కే. నారాయణస్వామి పాల్గొన్నారు.

పొంగల్ కానుకలకు టోకన్ల వితరణ



లబ్ధిదారులకు టోకెన్లు అందజేస్తున్న కలెక్టర్

హోసూరు: పొంగల్ కానుకలకు సంబంధించి క్రిష్ణగిరి జిల్లా కావేరిపట్టణం సమితి బెన్నేశ్వరమఠం గ్రామంలో రేషన్‌కార్డుదారులకు జిల్లా కలెక్టర్ జయచంద్రభానురెడ్డి శుక్రవారం టోకన్లు వితరణ చేశారు. గిడ్డంగిలో నిలువ ఉంచిన పొంగల్ కానుకలను పరిశీలించారు. క్రిష్ణగిరి జిల్లాలో 5,58,934 రేషన్‌కార్డుదారులకు పొంగల్ కానుకగా కిలో బియ్యం, కిలో చక్కెర, నిలువెత్తు చెరకుగడతో పాటు రూ. వెయ్యి నగదును ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అధికారులు ఏకాంబరం, సుకుమార్, సుందరం, కుమార్, రమేష్ పాల్గొన్నారు.

ఇద్దరు కుమారుల సహా తండ్రి ఆత్మహత్య

యశవంతపుర: జీవితంపై విరక్తితో తండ్రి తన ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి కలబురిగి జిల్లా ఆళంద పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని శరణనగరకు చెందిన మహామల్లప్ప (35), కుమారులు శ్రేయా (11), మనీశ్ (12)లు బస్ డిపో సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది చిన్నారుల మృతదేహాలను వెలికితీశారు. మహామల్లప్ప మృతదేహం కోసం గాలిస్తున్నారు. ఆళంద పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సిమెంట్ పిల్లర్ విరిగిపడి సెక్యూరిటీ గార్డు మృతి

బొమ్మనహళ్లి: ఇంటి రేకులపై సిమెంట్ పిల్లర్ కూలిపోవడంతో అందులో నిద్రిస్తున్న సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన శుక్రవారం బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ తాలూకా శెట్టిహళ్లిలో చోటుచేసుకుంది. మృతుడిని ఒడిసాకు చెందిన గౌరిన్ శియోల్ (28)గా గుర్తించారు. ఓ కంపెనీలో సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న గౌరిన్ శియోల్ రాత్రి తన ఇంటిలో నిద్రిస్తుండగా ఆ ఇంటి పక్కనే నిర్మాణంలో ఉన్న నాణ్యతలేని ఓ పిల్లర్ సిమెంట్ రేకులపై పడింది. రేకులను చీల్చుకుంటూ గౌరిన్ నిద్రిస్తున్న చోట పడిపోయింది. గౌరిన్ తలకు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అత్తిబెలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సిగ్నల్ వద్ద టిప్పర్ బీభత్సం

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ ఎయిర్‌పోర్టు వద్ద టిప్పర్ లారీ బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన టిప్పర్ లారీ వరుసగా ఏడు కార్లను ఢీకొంది. కార్లు ధ్వంసమయ్యాయి. దేవనహళ్లి వైపు వస్తున్న టిప్పర్ లారీ సిగ్నల్‌లో నిలిచి ఉన్న కార్లను వేగంగా ఢీకొంది. దేవనహళ్లి ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అదృష్టవశాత్తు ప్రమాదంలో ఎటువంటి ప్రాణహాని జరగలేదు.

చిక్కలో వాహనాల మళ్లింపు

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం ఉత్సవాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్‌ను మళ్లించే చర్యలు చేపట్టారు. బెంగళూరు నుంచి వచ్చే వాహనాలు, వెళ్లే వాహనాలు శనివారం నుంచి 14వ తేదీ రాత్రి 11 వరకు ఎన్‌హెచ్ 44 వాబసంద్ర బ్రిడ్జి నుంచి రాకపోకలు ఉంటాయి. అదే విధంగా గౌరిబిదనూరు నుంచి వచ్చే వాహనాలు కళవార ముద్దేనహళ్లి నుంచి నంది క్రాస్ హైవే నుంచి రావాల్సి ఉంటుందని కలెక్టర్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్‌ఐఏ అదుపులో యువకులు

బనశంకరి: శివమొగ్గ తుంగా తీరంలో ట్రయల్ బాంబుబ్లాస్ట్ కేసుకు సంబంధించి ఎన్‌ఐఏ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఆరు చోట్ల దాడులు చేసి కీలక ఆధారాలు సేకరించారు. శుక్రవారం కూడా దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఐఏ దావణగెరె జిల్లా హొన్నాళిలో నదీమ్ అనే యువకుడిని అదుపులోకి తీసుకుంది.

అదుపులో అనుమానిత ఉగ్రవాది స్నేహితుడు

బనశంకరి: ఉడుపి బ్రహ్మావరలో అనుమానిత ఉగ్రవాది మునీర్‌ను ఇప్పటికే అదుపులోకి తీసుకున్న ఎన్‌ఐఏ అధికారులు తాజాగా అతని స్నేహితుడు రేశాన్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. బ్రహ్మావర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాజుద్దీన్ కుమారుడే రేశాన్. ఇతను అనుమానిత ఉగ్రవాది మునీర్‌తో సంబంధాలు కలిగి ఉన్నాడనే అనుమానంతో ఎన్‌ఐఏ అధికారులు శుక్రవారం అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

మళ్లీ తెరపైకి కమీషన్ల వ్యవహారం

శివాజీనగర: మాజీ మంత్రి ఈశ్వరప్పకు వ్యతిరేకంగా ఆరోపణ చేసిన దివంగత కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ ఎవరెవరికి కమీషన్ ఇచ్చారనే సమాచారం వెలుగులోకి వచ్చింది. ఈశ్వరప్ప పీఏకు రూ.25 వేలు, బిల్ కమిషన్ అంటూ మరో రూ.4.15 లక్షలు ఇచ్చినట్లు సివిల్ వర్క్ చేయించిన ఓ గ్రామ పంచాయతీ అధ్యక్షుడి సెల్‌ఫోన్ చాట్‌లో వెలుగు చూసినట్లు సమాచారం. కాగా ఈశ్వరప్పపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఇప్పటికే ఆయనకు కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే.

ఆకుపచ్చ ధనం



రేష్మా రంజన్

పచ్చగా కళకళలాడటం అంటే ఏమిటో రేష్మా రంజన్‌కు తెలుసు. అందుకే తృప్తినివ్వని గవర్నమెంట్ ఉద్యోగాన్ని వదిలి మరీ ఇంట్లో ఉండిపోయింది. ఇంట్లో ఏం చేసింది? తనకిష్టమైన మొక్కలు పెంచింది. మట్టి, నీరు, కుండీ, ఆకు, ఎరువు... ఇవి ఎలా ఉపయోగిస్తే ఇంటి మొక్కలు అందంగా అద్భుతంగా ఉంటాయో బాగా తెలుసుకుంది. వాటినే వీడియో పాఠాలు చేసింది. 'ప్రకృతీస్ గార్డెన్' పేరుతో వందలాది వీడియోలు చేసింది. పది లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఏర్పడ్డారు. రేష్మా దిశా నిర్దేశంలో ఇళ్లల్లో మొక్కలు పెంచుతున్నారు. వారు హ్యాపీగా ఉన్నారు. దీనివల్ల వచ్చే ఆదాయంతో రేష్మా పచ్చగా ఉంది.

జార్ఖండ్‌లోని బొకారోలో రేష్మా రంజన్ ఇంటికి వెళితే చిన్న సైజు వనంలో అడుగు పెట్టినట్టు ఉంది. దాదాపు 2000 అందమైన, రకరకాల కుండీల్లో వందలాది రకాల మొక్కలు కనిపిస్తాయి. కొత్తిమీర, పాదీనాతో మొదలు ఆపిల్, అవకాడో వరకూ రేష్మా కుండీల్లో సృష్టించనిది అంటూ ఏదీ లేదు. ఒక కుండీలో ఉల్లిపాయలు పెరుగుతుంటాయి... మరో కుండీలో అనాసపళ్లు... ఇంకో కుండీలో చిలగడ దుంపలు, మరో కుండీలో నేతి బీరకాయలు... ఇక పూలైతే లెక్కే లేదు. వాటి మధ్య కూచుని వీడియోలు చేస్తుంటుంది రేష్మా. కేవలం తను పెంచి చూసిన మొక్కల గురించే ఆమె మాట్లాడుతుంది. ఆ అనుభవాల నుంచి వచ్చిన పాఠాలు కాబట్టే ఆమెకు పది లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు.

■ బాల్యం ముఖ్యం

బాల్యంలో ఏర్పరిచే మంచి ప్రభావాలు వారికి జీవితాంతం ఉంటాయి అనడానికి రేష్మ రంజన్ ఒక ఉదాహరణ. రేష్మాది బొకారో అయినా ఐదో క్లాస్ వరకూ బీహార్‌లోని పల్లెలో అమ్మమ్మ, తాతయ్య దగ్గర పెరిగింది. తాతయ్య ఇంట్లో విపరీతంగా చెట్లు. 'దారిన పసిబిడ్డను వదిలి వెళ్లిపోతే చూసినవారు ఎలా కలత చెందుతారో ఎవరైనా ఏదైనా మొక్కను పారేసి ఉంటే మా తాత అంత కలత చెందేవాడు' అంటుంది రేష్మా. అతడు ఎక్కడ ఏ మొక్క నిర్లక్ష్యంగా పడేసి ఉన్నా తెచ్చి ఇంట్లో దానికి ప్రాణం పోసేవాడు. రేష్మా మూడో క్లాసు పాసై నాలుక్కు వెళుతున్నప్పుడు మూడు మొక్కలు తెచ్చి వీటిని నువ్వే పెంచాలి అని చెప్పాడు తాతయ్య. 'అయితే నేను మరీ అతిగా పెంచి ఎక్కువ నీళ్ళు, ఎక్కువ ఎరువు వేసేసి వాటిని చంపేశాను' అని నవ్వుతుంది రేష్మా. ఆ గుణపాఠం నుంచి బాల్యంలోనే మొక్కలను ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో నేర్చుకుంది. 'అదే మొక్కల మీద నా ప్రేమకు అంకురం' అంటుంది రేష్మా.

■ అందమైన ఇల్లు

మొక్కలు ఎలా అంటే అలా పెంచడం కాదు. వాటిని అందమైన కుండీల్లో అందమైన అరల మీద పెడితే వచ్చే అందాన్ని కూడా రేష్మా చెబుతుంది. సహజంగా ఎరువుల్ని, క్రిమి సంహారకాలను ఎలా తయారు చేసుకోవాలో చూపుతుంది. సేంద్రియ విధానాలు కూడా చూపుతుంది. ఇండోర్ ప్లాంట్స్ ఎలా శుభ్రం చేయాలి అనే ఆమె వీడియో ఇండోర్ ప్లాంట్స్ ఉన్నవారంతా చూడతగ్గది. 'వాల్ డెకరేషన్'గా గోడలకు కుండీలు బిగించి ఎలాంటి మొక్కలు పెంచాలో చూపుతుంది. ఇంకా ఆమె చెప్పే విషయాలు అనంతం.

■ ఉద్యోగంలో అసంతృప్తి

ఇంటర్ తర్వాత ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐ.సి.ఏ.ఆర్) నుంచి అగ్రికల్చర్ సైన్స్ డిగ్రీ చేసిన రేష్మా ఆ వెంటనే అగ్రికల్చర్ కోఆర్డినేటర్‌గా ప్రభుత్వ ఉద్యోగం పొందింది. '2015లో నాకు ఉద్యోగం వచ్చింది. నాకు ఇష్టమైన ఉద్యోగం అనుకున్నాను. నా పని రైతులకు వారి పంట పోషణలో సాయం చేయడం. కాని నా లాంటి చిన్న పిల్ల చెప్తే వినడం ఏమిటి అనుకునేవారో లేదా వారి సంప్రదాయ జ్ఞానం మీద విశ్వాసమో కాని నేను చెప్పే సూచనలు రైతులు వినేవారు కాదు. అంతేకాదు మట్టిని బట్టి, విత్తును బట్టి పంటలో మార్పు చేర్పులు చెప్పే లక్ష్యం చేసేవారు కాదు. ఆ అసంతృప్తి నాకు ఉండేది. మరో వైపు ఉద్యోగం వల్ల నేను స్వయంగా మొక్కలు పెంచలేకపోయేదాన్ని. అదే సమయంలో నా చదువును చూసి ఫ్రెండ్స్ ఫలానా మొక్కలు ఎవరు వేయాలి... ఫలానా తీగను ఎలా పెంచాలి... అని సలహా అడిగేవారు. ఈ అన్ని సమస్యలకు సమాధానంగా ఉద్యోగం మానేసి యూట్యూబ్ చానల్ మొదలెట్టాను' అంటుంది రేష్మా.

■ పదివేల మంది అనుకుంటే

'నేను మొక్కలు, తీగలు, పూల చెట్లు, పండ్ల చెట్లు, కూరగాయలు, ఇండోర్ ప్లాంట్లు... వీటన్నింటిని ఎలా పెంచారో, కేర్ తీసుకోవాలో చెప్తే నాలాగే మొక్కలను ఇష్టపడే ఒక పదివేల మంది అయినా ఫాలో కాకపోతారా అనుకున్నాను. సహజ పద్ధతిలో గులాబీ పెంచడం ఎలా? అనేది నా మొదటి వీడియో. దానికి వచ్చిన ఆదరణ అంతా ఇంతా కాదు. పదివేల మంది అనుకుంటే రెండు మూడేళ్ల లోనే లక్ష మంది అయ్యారు. 2016 నుంచి నా పాఠాలు కొనసాగితే 2022 చివరకు పది లక్షల మంది సబ్‌స్క్రయిబర్స్ అయ్యారు. ప్రొడక్ట్ ప్రమోషన్స్ కోసం వచ్చే వారి వల్ల కాని,



యూట్యూబ్–ఫేస్‌బుక్ పేజ్ వల్ల కాని నాకు నెలకు లక్ష నుంచి లక్షన్నర ఆదాయం వస్తోంది' అంటుంది రేష్మా.

ఒక పనిలో పూర్తిగా నైపుణ్యం ఉంటే ఆ పనిలో ఆనందం, ఆదాయం రెండూ పొందవచ్చు. మీకు బాగా మొక్కలు పెంచడం వస్తే రేష్మాలా యూట్యూబ్ చానల్ నడపొచ్చు. బాగా మొక్కలు పెంచాలని ఉంటే ఆమె చానల్ ఫాలో కావచ్చు.

'అందరూ మొక్కలు పెంచితే ప్రపంచం పచ్చగా మారడానికి ఎక్కువ టైమ్ పట్టదు' అని రేష్మా చెప్పే మాట అందరూ వినాలి.



9 చుక్కలు, సందు చుక్క చుట్టూ 1 వచ్చేవరకు



డి.భానుమతి
పాకాల టౌన్, తిరుపతి జిల్లా



సిరిపురం లక్ష్మీకళ
విద్యానగర్, నకిరేకల్



19 చుక్కలు ఎదురు చుక్క 1 వచ్చేవరకు

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com
(మీ ఊరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)

లాక్డౌన్ సమయంలో చాలా మంది క్రియేటివ్ ఆలోచనలతో వెలుగులోకి వచ్చారు. అదేవిధంగా బిజినెస్ రంగంలోనూ ఎదిగారు. అలాంటివారి జాబితాలో ముందుంటారు సీమా మక్వానా. ముంబైలో ఉంటున్న సీమ కరోనా సమయంలో ఇంట్లో వారి కోసం ముఖ్యంగా పిల్లలు ఇష్టపడేలా హెల్తీ బన్స్, ఫాస్ట్ ఫుడ్‌ను తయారు చేసేది. వాటి తయారీని పెంచి తమ అపార్ట్‌మెంట్ సభ్యులకు పంచేది. ఈ రోజు సీమా చేసే బన్స్‌కి ఫాస్ట్ ఫుడ్‌కి విదేశీల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. దీని వెనక ఉన్న ఆమె కృషి ఎంతో మందికి ప్రేరణనిస్తోంది.

హెల్తీ ఫాస్ట్ ఐడియా

పిల్లల నుండి పెద్దల వరకు ఫాస్ట్ ఫుడ్‌ని అందరూ ఇష్టపడతారు. అయితే, జంక్ ఫుడ్ అని వాటిని ఎక్కువగా తినని వ్వరు. కానీ, నోరూరించే ఆరోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్ అందుబాటులో ఉంటే ఎవరూ అడ్డుచెప్పరు. అదే థీమ్‌తో హెల్తీ ఫాస్ట్‌ఫుడ్‌ని అందిస్తుంది సీమా మక్వానా. దేశంలోనే మొదటి సారి హెల్తీ ఫాస్ట్ ఫుడ్ తయారీదారుగా పేరు తెచ్చుకుంది. ఈ తయారీ వెనక చోటు చేసుకున్న పరిణామాలను ఇలా వివరిస్తుంది.. ''వంట చేయడం, కొత్త వంటకాలను ప్రయత్నించడం నా అభిరుచి. ప్రతి వంటకాన్ని ఆరోగ్యకరమైనదిగా మార్చడం అంటే నాకు చాలా ఇష్టం. ఇద్దరు పిల్లల తల్లిని అవడంతో వారికి రుచికరమైన ఆహారాన్ని ఎలా ఇవ్వాలా అనే ఆలోచిస్తుంటాను. తల్లిగా వారి ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో నాకు తెలుసు. అందుకే, నా పిల్లలు నేను తయారు చేసే ఫుడ్ తప్ప ఇతర జంక్ ఫుడ్‌ను ఎప్పుడూ ఇష్టపడరు.





సీమా మక్వానా

నమ్మకమైన బ్రాండ్

లాక్‌డౌన్ టైమ్ అందరిలోనూ సృజనాత్మక ఆలోచనలకు, పనులు చేయడానికి అవకాశం ఇచ్చింది. నేను మా అత్తమామలు, ఇరుగుపొరుగు వారితో సహా అందరికీ ఫుడ్ సిద్ధం చేసేదాన్ని. అప్పటి నుంచి నాలో నలుగురి కోసం నేనేమీ చేయలేకపోతున్నానే అనే గిల్టీ భావన దూరమైంది. ఆరోగ్యకరమైన, అందరికీ మేలు చేసే ఫాస్ట్ ఫుడ్ తయారు చేస్తూ దీనినే ఒక నమ్మకమైన బ్రాండ్‌గా రూపొందించాలనుకున్నాను. ఆ ఆలోచన నుంచి వచ్చిందే బన్స్ అండ్ డెలుచాస్.

హెల్తీ కంపెనీ

దేశంలోనే మొదటి సారి చేతితో తయారుచేసే ఆరోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్ కంపెనీగా బన్స్ అండ్ డెలుచాస్ నిలిచింది. వంటల తయారీలో ఉపయోగించేవన్నీ సేంద్రియ పదార్థాలే. ఇండియన్, ఇటాలియన్, చైనీస్ గ్రేవీలతో స్టఫ్డ్ బన్స్ తయారు చేస్తాను. అన్నిరకాల రుచికరమైన కుల్చా ర్యాప్‌లు, స్నాక్ స్టఫ్డ్ వాఫ్లెస్‌ను కస్టమైజ్డ్ ఫింగర్ లీకీ డిప్స్‌తో సర్వ్ చేస్తాం. పండగల సమయాల్లో ఆరోగ్యకరమైన కొత్తతరహా వంటకాలను అందిస్తాం.

మంచి స్పందన

ప్రతి వ్యాపారంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. కానీ వాటిని తెలివిగా ఎదుర్కోవడం ముఖ్యం. ఒక గృహిణిగా ఇటి పనులు, బాధ్యతలు నిర్వహించడం, ఆర్డర్‌లన్నింటిని పూర్తి చేయడం కష్టంగా ఉంటుంది. కానీ నా కల అన్నింటికన్నా బలమైనది. కష్టమర్ల నుండి వచ్చే మంచి స్పందన కూడా నేను మరింత కష్టపడేలా ప్రోత్సహిస్తుంది.

నా కూతురే గొప్ప ప్రేరణ

నేను చదివింది పదవ తరగతి వరకే. కానీ, నాకెప్పుడూ సొంతంగా ఏదైనా పని చేయాలని ఉండేది. నాకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి స్పెషల్లీ ఛాలెంజ్డ్ కిడ్. నా ఫాస్ట్‌ఫుడ్ వెంచర్‌కి వెనకాల అతి పెద్ద ప్రేరణ నా కూతురు. తను నా వంటకాలకు ఫీడ్ బ్యాక్ ఇచ్చేది. సొంతంగా ఏదైనా ప్రారంభించమని ప్రోత్సహిస్తుంటుంది. చాలా కుటుంబాలు ప్రతిభావంతులైన మహిళలకు వారి అభిరుచిని కొనసాగించడానికి మద్దతు ఇవ్వవు. కానీ, నా కుటుంబం నుండి నాకు మద్దతు లభించింది. మా కుటుంబం నన్ను ఎంతగానో సపోర్ట్ చేస్తున్నప్పటికీ నేను తల్లిని. నా బిడ్డలను జాగ్రత్తగా చూసుకోవాలి. అలాగే గృహిణిగా కుటుంబ బాధ్యతలనూ చూసుకోవాలి. కొన్నేళ్ల క్రితం మా ఇంటికి దగ్గరలో ఉన్న ఒక బొమ్మల లైబ్రరీలో పనిచేశాను. కానీ, రోజూ బాబును వదిలి ఇంటి నుంచి బయటకు రావడం కష్టంగా ఉండటంతో ఆ పని మానేశాను. పిల్లలను చూసుకుంటూ వంట పనులు చేయడం ఇష్టంగా మారింది.



విదేశాలకు ఎగుమతి..

మా ఉత్పత్తుల కంపెనీ ప్రధాన లక్ష్యం ఫాస్ట్ ఫుడ్ స్టైల్‌లో ఫుడ్‌ని ఆరోగ్యకరంగా అందించడం. గోధుమ పిండితో బన్స్ తయారు చేస్తాను. అన్ని పదార్థాలు శాకాహారమే. బన్ లోపల కూరగాయలను, సాస్‌ను స్టఫ్‌గా ఉపయోగిస్తాను. దీని వల్ల ఎంత దూరం తీసుకువెళ్లినా బన్ లోపలి పదార్థం బయటకు రాదు. ఇదే మా సక్సెస్‌కు కారణం. విదేశాల నుంచి ఆర్డరు రావడానికి కూడా ఇదే కారణం. ప్రధాన ఆహార పరిశ్రమలో ప్రవేశించడానికి ఫ్రాంచైజ్ నెట్‌వర్క్‌ను ప్రారంభించబోతున్నాను. సొంతంగా వెబ్‌సైట్ ఉంది. దీని ద్వారానే కాకుండా ఫుడ్ డెలివరీ కంపెనీల నుంచి కూడా ఆర్డర్లు వస్తుంటాయి.

దేశం నలుమూలల నుంచే కాదు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా నుంచి ఆర్డర్లు వస్తుంటాయి. నా బంధువు కారణంగా వ్యాపారం విదేశాలకు చేరుకుంది. ఈ పనిని ప్రారంభించినప్పుడు ఆరు రోజుల తర్వాత నా తయారీ ప్యాకెట్‌ను కోరుకున్నవారికి పంపగలిగాను. పది రోజుల వరకు ఆహారం పాడవని విధంగా జాగ్రత్తలు తీసుకున్నాను. అక్కడి వారికి నా ఫుడ్ టేస్ట్ బాగా నచ్చింది. దీని తర్వాతే నా బన్స్ అండ్ డెలుచాస్‌ని విదేశీయులకూ అందివ్వగలను అనుకున్నాను. త్వరలో విదేశాలలోనూ నా వెంచర్‌ని ప్రారంభించాలనుకుంటున్నాను'' అని ఆనందంగా వివరిస్తుంది సీమా.

విడిచి వెళ్లినా.. చేయి వీడలేదు!

ట్రెండ్

పాత సినిమాల్లో చనిపోయిన భార్య ఫొటో దగ్గర నిలబడి గుమ్మడి వంటి భర్తో, ఎస్.వి.రంగారావు వంటి భర్తో తమ ఉద్వేగాలు చెప్పుకోవడం చూసేవాళ్లం. అలాగే అంజలి, కన్నాంబ వంటి భార్యలు తమ భర్తల ఫొటోల ముందు నిలబడి 'చూశారా... మీ కొడుకు ఎంతటి ప్రయోజకుడయ్యాడో' అంటూ దుఃఖానంద అశ్రువులు జారవిడిచేవారు. కాని ఇటీవలి కాలంలో ఈ ఫొటోల స్థానంలో ఏకంగా సిలికాన్ శిల్పాలు ఇళ్లల్లో తమ జీవన భాగస్వాముల గుర్తుగా చేరుతున్నాయి. తమిళనాడు, ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లో తల్లి కోసం తండ్రి శిల్పాన్ని చేయించిన పిల్లలు, తండ్రి కోసం తల్లి శిల్పాన్ని చేయించిన ఆత్మీయులు ఉన్నారు. ఇప్పుడు కోల్‌కటాకు చెందిన ఒక రిటైర్డ్ ఉద్యోగి తన భార్య మీద ప్రేమను శిల్ప ప్రతిష్ఠ ద్వారానే కొంతైనా చాటుకోగలను అంటున్నాడు.

39 ఏళ్లు కలిసి మెలిసి జీవించిన భార్యను ఏ భర్త మర్చిపోగలడు? కోవిడ్ వల్ల ఆమె 2021లో మరణిస్తే చివరి చూపుకు కూడా అతను నోచుకోలేదు. కాని ఆమెను ప్రత్యక్షంగా రోజూ చూడదలిచాడు. అందుకే రెండున్నర లక్షలు ఖర్చుపెట్టి ముమ్మూర్తులా ఆమెనే పోలిన సిలికాన్ విగ్రహాన్ని ఇంట్లో ప్రతిష్ఠించగలిగాడు. బంధువులు, అయినవాళ్లు వారించినా వినలేదు. 'భార్యను ప్రేమించేవాడికే భార్య లేని లోటు తెలుస్తుంది' అంటున్నాడు కోల్‌కతాకు చెందిన తపస్ శాండిల్య. భార్య మీద ప్రేమకు ఇది కొలమానం కాకపోవచ్చుగాని భార్యను ఏ మాత్రం ప్రేమిస్తున్నాం అని భర్తలు ఆలోచనలో పడుతున్నారు ఈ విగ్రహం చూసి.

చివరి చూపులకు నోచక

కోల్‌కటాకు చెందిన తపస్ శాండిల్య, అతని భార్య ఇంద్రాణి దాదాపు 40 ఏళ్లు వైవాహిక జీవితం గడిపారు. దురదృష్టవశాత్తు 2021 మేలో కోవిడ్ వల్ల ఇంద్రాణి మరణించింది. 'ఆ సమయంలో నేను ఐసొలేషన్‌లో ఉన్నాను. ఆస్పత్రిలో ఆమెను చూసుకోలేకపోయాను. అలాగే ఆమె అంతిమయాత్రకు కూడా లేను. నా బాధ వర్ణించరానిది' అంటాడు శాండిల్య. ఆమె చనిపోయాక ఆ హటాత్‌లోటు



భార్య ఇంద్రాణి సిలికాన్ విగ్రహంతో తపస్ శాండిల్య



అతణ్ణి నిలువనీయలేదు. 'పదేళ్ల క్రితం మయాపూర్ (బెంగాల్)లోని ఇస్కాన్ టెంపుల్‌ను మేము దర్శించాం. అక్కడ స్వామి వేదాంత నిలువెత్తు విగ్రహం ఉంది. అది నిజం మనిషిలా ఉంది. అప్పుడు నా భార్య ఇలాంటిది నాది కూడా ఉంటే ఎంత బాగుంటుంది అని మాట వరసకు అంది. ఆమె మరణించాక నాకు ఆ మాట, ఆ విగ్రహం గుర్తుకు వచ్చాయి. అలాంటి విగ్రహం తయారు చేసి ఇంట్లో ఉంచితేనే ఆమె లేని లోటు తీరుతుందని భావించాను' అన్నాడు తపస్.

శిల్పి అన్వేషణలో

అలా అనుకున్నాడుగాని అందుకు తగ్గ శిల్పి ఎవరు అనేది అతనికి తెలియలేదు. చివరకు మ్యూజియమ్‌లకు వ్యాక్స్, సిలికాన్ విగ్రహాలు తయారు చేసిచ్చే అదే రాష్ట్రానికి చెందిన సుబిమల్ దాస్ అనే శిల్పిని కలిశాడు. రెండున్నర లక్షల ఖర్చు అంచనాకొచ్చింది. 'ఇది చౌరస్తాలో పెట్టే విగ్రహం లాంటిది కాదని నాకు అనిపించింది. భావోద్వేగాలతో ఒక భర్త చేయించుకుంటున్న భార్య విగ్రహం. అది వీలైనంత జీవకళతో ఉండాలని ముఖంలో ఎక్స్‌ప్రెషన్ ఉండాలని నిశ్చయించుకున్నాను. మహనీయులంటే వారిని చూసి చూసి మనకు ముద్ర పడిపోయి ఉంటారు. వారి శిల్పం సులువు. కాని జీవితంలో ఎప్పుడూ చూడని ఒక సగటు ఇల్లాలి విగ్రహం తయారు చేయడం సవాలే' అన్నాడు సుబిమల్ దాస్. అయితే ముందు క్లే మోడల్ తయారు చేశాడు పోలికల కోసం. తపస్ కూడా ఈ క్లే మోడల్ తయారయ్యేంత వరకు సుబిమల్ దాస్ తోడు ఉన్నాడు. అది సంతృప్తిగా ఉందని అనిపించాక ఫైబర్ మోడల్ దానికి సిలికాన్ కాస్టింగ్ పూర్తయ్యాయి. 'కేవలం జుట్టు ఇమడ్చడానికే 30 రోజులు పట్టింది' అంటాడు తపస్ శాండిల్య. 'నా భార్య నా కొడుకు పెళ్లిలో కట్టుకున్న వస్త్రాలు విగ్రహానికి తొడిగాను. హాల్లో సోఫాలో ఆమె కూచుని ఉంటే అచ్చు నా భార్య ఇంట్లో ఉన్నట్టే అనిపిస్తోంది' అని సంతృప్తిపడుతున్నాడు.

చనిపోయిన మనిషి రూపాన్ని అలా ఇంట్లో పెట్టడం మంచిది కాదని బంధువులు వారించినా తపస్ వినలేదు. గిట్టని వాళ్లు ప్రచారం కోసం ఇదంతా చేస్తున్నాడని విమర్శించారు కూడా.

ఆ సంగతి అలా ఉంచితే భార్య పట్ల బాధ్యతగా ఉండే భర్తలు ఆ బాధ్యతే ప్రేమ అనుకుంటూ ఉంటారు. తమని ప్రేమించడం భార్యల వంతు అన్నట్టుగా ఉంటుంది వీరి వైఖరి. అనుకోని ఎడబాటు వస్తే ఆమెను చూసుకోవాల్సినంత ప్రేమగా చూసుకోలేదు అని వగచే బదులు ఉన్నప్పుడే దాంపత్య బంధాన్ని ప్రేమ బంధంగా మలుచుకోవడంలో శ్రద్ధ చూపడం మేలు. ఏ భార్యాభర్తలైనా కలకాలం ప్రేమగా బతకడమేగా కావాల్సింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
453	133
59,900	17,859

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	10,496	△ 193
డోజోన్స్	33,527	△ 597
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,699	△ 66
డాక్స్	14,610	△ 174
షాంఘై	3,158	△ 2
నికాయ్	25,974	△ 153

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	55,587 ▽ 209
బంగారం (99.5 స్వచ్ఛత)	55,363 ▽ 210
వెండి (కిలో)	67,888 △ 210

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		84.57	80.89
£	బ్రిటన్ పౌండ్		84.69	89.20
€	యూరో		95.75	100.59
¥	జపాన్ ఎన్ (100)		49.00	74.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.40	58.24
S$	సింగపూర్ డాలర్		59.15	63.68
SAR	సౌదీ రియాల్		21.06	22.74
UAE D	యూఏఈ దిర్హామ్		21.62	23.42
¥	చైనా యువాన్		10.93	12.96

అమెజాన్ ఇండియాలో 1,000 ఉద్యోగాల కోత



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సిబ్బందిని తగ్గించుకునే ప్రక్రియలో భాగంగా ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారత్‌లో సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కంపెనీకి భారత్‌లో 1 లక్ష మంది ఉద్యోగులు ఉండగా సుమారు 1 శాతం సిబ్బందిపై ఉద్వాసనల ప్రభావం పడవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రపంచవ్యాప్తంగా 18,000 మందిని తొలగించాలని నిర్ణయం తీసుకోవడంతో భారత్‌లో 1,000 మంది సిబ్బందిపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నాయి. మరోవైపు అంతర్జాతీయంగా తమ అమెజాన్ స్టోర్స్, పీఎక్స్‌టీ (పీపుల్, ఎక్స్‌పీరియన్స్, టెక్నాలజీ) విభాగాల్లో ఎక్కువగా కోతలు ఉండనున్నాయని కంపెనీ ప్రతినిధి తెలిపారు. 2021 డిసెంబర్ 31 నాటికి అమెజాన్‌లో 16,08,000 మంది ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ ఉద్యోగులు ఉన్నారు.

హైదరాబాద్‌లో జీ స్క్వేర్ రెండో ప్లాట్ ప్రాజెక్టు

హైదరాబాద్: దక్షిణ భారతదేశంలో ప్రముఖ ప్లాట్ ప్రమోటర్ జీ స్క్వేర్ ఎపిటోమ్ హౌసింగ్ సంస్థ హైదరాబాద్‌లో రెండో ప్రతిష్టాత్మక ప్లాట్ ప్రాజెక్టును చేపట్టింది. 'కాబోయే గచ్చిబౌలి'గా పేర్కొంటున్న హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి మార్గంలో 1,242 ఎకరాల విస్తీర్ణంలో జీ స్క్వేర్ ఎపిటోమ్ ఇంటిగ్రేటెడ్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మొదటి దశ ప్రాజెక్ట్‌లో 368 ఎకరాలను 140కు పైగా అంతర్జాతీయ సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నారు. వంద ఎకరాల గోల్ఫ్ కోర్స్, 40 ఎకరాల లగ్జరీ రిసార్ట్, వెల్‌నెస్ కేంద్రం, స్పోర్ట్స్ అకాడెమీ, స్కూల్, కాలేజీతో పాటు మరెన్నో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదుపాయాలు ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఉంటాయి. ''ఇటీవల బీఎస్ రెడ్డి నగర్‌లో ఆవిష్కరించిన మా మొదటి ప్రాజెక్ట్ జీ స్క్వేర్ ఈడెన్ గార్డెన్‌కు అపూర్వ స్పందన లభించింది. ఈ స్ఫూర్తితో పలు లైఫ్‌స్టైల్ ఫీచర్లతో 1242 ఎకరాల విస్తీర్ణంలో మరో ఇంటిగ్రేటెడ్ సిటీని ప్రారంభించాము. రాబోయే కొద్ది ఏళ్లలో తూర్పు కారిడర్‌లో భారీగా ధరలు పెరగనున్నాయి. ఇప్పుడు పెట్టుబడులు పెట్టిన వారికి మంచి రాబడులు వస్తాయి'' అని జీ స్క్వేర్ హౌసింగ్ సీఈవో ఈశ్వర్ ఎన్ తెలిపారు.



ఈ ఏడాది వృద్ధి 7 శాతమే!

- తయారీ, మైనింగ్ రంగాల పేలవ పనితీరు
- కేంద్రం తొలి ముందస్తు అంచనా గణాంకాలు విడుదల



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 7 శాతానికి పరిమితం అవుతుందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) తొలి ముందస్తు అంచనాలు వెల్లడించాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే (8.7 శాతం) ఇది 1.7 శాతం తక్కువ కావడం గమనార్హం. తయారీ, మైనింగ్ రంగాల పేలవ పనితీరు వృద్ధి రేటు అంచనా భారీ తగ్గుదలకు కారణమని తొలి అంచనాలు వెలువరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తయారీ రంగంలో అసలు వృద్ధిలేకపోగా 1.6 శాతం క్షీణత నమోదవుతుందని ఎన్‌ఎస్‌ఓ అంచనా. 2021-22లో ఈ రంగం 9.9% వృద్ధిని నమోదు చేసింది. మొత్తం ఎకానమీలో పారిశ్రామిక రంగం వెయిటేజ్ దాదాపు 15 శాతంకాగా ఇందులో మెజారిటీ వాటా తయారీ రంగానికి కావడం గమనార్హం. ఇక మైనింగ్‌లో కూడా వృద్ధి రేటు 11.5 శాతం నుంచి 2.4%కి పడిపోతుందని అంచనాలు వెలువడ్డం గమనార్హం. కాగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 6.8% అంచనాలకన్నా కేంద్రం అంచనాలు 20 బేసిస్ పాయింట్లు అధికంగా ఉండడం గమనార్హం. ఎన్‌ఎస్‌ఓ ప్రకటనలో ముఖ్యాంశాలు ఇవీ..

- జీడీపీలో దాదాపు 15 శాతం వాటా కలిగిన వ్యవసాయ రంగంలో వృద్ధి 3.5 శాతంగా ఉండనుంది. 2021-22లో ఈ రేటు 3%.
- ట్రేడ్, హోటల్, రవాణా, కమ్యూనికేషన్లు,, బ్రాడ్‌కాస్టింగ్ విభాగానికి సంబంధించిన సర్వీసుల వృద్ధి రేటు 11.1 శాతం నుంచి 13.7 శాతానికి చేరనుంది.
- ఫైనాన్షియల్, రియల్టీ, ప్రొఫెషనల్ సేవలలో వృద్ధి రేటు 4.2% నుంచి 6.4%కి పెరగనుంది.
- అయితే నిర్మాణ రంగంలో వృద్ధి రేటు 11.5%నుంచి 9.1 శాతానికి తగ్గనుంది.
- పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ, ఇతర సేవల వృద్ధి రేటు కూడా 12.6% నుంచి 7.9%కి పడనుంది.
- స్థూల విలువ జోడింపు (గ్రాస్ వ్యాల్యూ యాడెడ్- జీవీఏ) ప్రాతిపదికన 2022-23లో వృద్ధి రేటు 8.1% నుంచి 6.7%కి తగ్గనుంది. ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రాంతం, పరిశ్రమ లేదా రంగంలో ఉత్పత్తి చేసిన వస్తువులు, సేవల విలువే జీవీఏ. ఇంకా చెప్పాలంటే జీడీపీలో ఒక నిర్దిష్ట రంగం ఉత్పత్తి తోడ్పాటును జీవీఏ ప్రతిబింబిస్తుంది. అన్ని రంగాల జీవీఏలను కలిపి, పన్నులు-సబ్సిడీలకు సంబంధించి అవసరమైన సర్దుబాటు చేస్తే ఆర్థిక వ్యవస్థ జీడీపీ విలువ వస్తుంది.

ఎన్‌ఎస్‌ఓ అంచనా విలువల్లో.. 2011-12 స్థిర ధరల ప్రాతిపదికన (ద్రవ్యోల్బణం సర్దుబాటు చేస్తూ) వాస్తవ జీడీపీ విలువ 2021-22లో రూ.147.36 లక్షల కోట్లయితే, ఇది 2022-23లో రూ.157.60 లక్షల కోట్లకు పెరగనుందని ఎన్‌ఎస్‌ఓ తాజా అంచనా. అంటే వృద్ధి రేటు 7 శాతం అన్నమాట.

2022-23పై పలు సంస్థల అంచనాలు (శాతాల్లో)

సంస్థ	అంచనా
ఐఎంఎఫ్	6.8
ప్రపంచ బ్యాంక్	6.9
ఫిక్కీ	7.0
సిటీగ్రూప్	6.7
గోల్డ్‌మన్ శాక్స్	7.0
ఆర్‌బీఐ	6.8
ఏడీబీ	7.0
ఎస్‌బీఐ	6.8
మూడీస్	7.6
క్రిసిల్	7.3
ఇండియా రేటింగ్స్	6.9

లోటస్ చాకొలెట్‌లో మరింత వాటా

రిలయన్స్ ఓపెన్ ఆఫర్



న్యూఢిల్లీ: లోటస్ చాకొలెట్‌లో మరో 26 శాతం వాటా కొనుగోలుకి రిలయన్స్ గ్రూప్ కంపెనీలు రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్, రిలయన్స్ రిటైల్ వెంచర్స్ ఓపెన్ ఆఫర్ ప్రకటించాయి. లోటస్ చాకొలెట్ వాటాదారుల నుంచి ఈ వాటాను సొంతం చేసుకునేందుకు ఓపెన్ ఆఫర్ చేపట్టనున్నట్లు తెలియజేశాయి. ఇందుకు షేరుకి రూ. 115.5 ధరను నిర్ణయించినట్లు 2 సంస్థల తరఫున ఆఫర్‌ను చేపట్టనున్న డీఏఎం క్యాపిటల్ తెలియజేసింది. తద్వారా 33.38 లక్షల షేర్లను కొనుగోలు చేయనున్నట్లు తెలియజేసింది. పూర్తి వాటాకు రూ. 38.56 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఓపెన్ ఆఫర్ ఫిబ్రవరి 21న ప్రారంభమై మార్చి 6న ముగియనున్నట్లు పబ్లిక్ నోటీస్ ద్వారా తెలియజేసింది.

3 నెలల గరిష్టం

రిలయన్స్ సంస్థలు కన్నేయడంతో లోటస్ చాకొలెట్ షేరు బీఎస్‌ఈలో గురువారం రూ. 149ను దాటి ముగిసింది. ఇది మూడు నెలల గరిష్టంకాగా.. శుక్రవారం(6న) సైతం షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. రూ. 157 సమీపంలో నిలిచింది. కంపెనీ చాకొలెట్లు, కోకోవా ప్రొడక్టులు, డెరివేటివ్స్‌ను రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. రిలయన్స్ కన్జూమర్.. రిలయన్స్ రిటైల్ ఎఫ్ఎంసీజీ విభాగంకాగా.. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్ కంపెనీలివి. లోటస్ చాకొలెట్‌లో గత వారమే రిలయన్స్ కన్జూమర్ ప్రమోటర్ల నుంచి 51 శాతం వాటాను చేజిక్కించుకుంది.

మూడోరోజూ బేర్ గుప్పిట్లో మార్కెట్

- 60 వేల దిగువకు సెన్సెక్స్
- తొలి వారం నష్టాల ముగింపు
- నిఫ్టీ 133 పాయింట్ల పతనం
- ఎఫ్ఎంసీజీ షేర్లకు మాత్రమే లాభాలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ఈ కొత్త ఏడాది తొలి వారాన్ని నష్టాలతో ముగించింది. ద్రవ్యోల్బణం, కఠిన ద్రవ విధాన వైఖరి భయాలతో దేశీయ స్టాక్ సూచీలు మూడోరోజూ నష్టాలు మూటగట్టుకున్నాయి. భారత మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం, ముడిచమురు ధరలు మళ్లీ పెరగడం, ప్రపంచ మార్కెట్లలో బలహీనతలు, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి నేలచూపులు తదితర అంశాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 453 పాయింట్లు నష్టపోయి 59,900 వద్ద స్థిరపడింది. ఈ సూచీలో ఐదు షేర్లు మాత్రమే లాభపడగా, మిగిలిన అన్ని దెబ్బతిన్నాయి. నిఫ్టీ 133 పాయింట్లు పతనమై 17,859 వద్ద నిలిచింది. ఉదయం అతి స్వల్ప లాభాల్లో మొదలైన సూచీలు.., అంతర్జాతీయ ప్రతికూల సంకేతాల నేపథ్యంలో వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. ఎఫ్ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 683 పాయింట్లు క్షీణించి 59,670 వద్ద, నిఫ్టీ 196 పాయింట్లను కోల్పోయి 17,796 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు వరుసగా 0.73%, 0.72 శాతం చొప్పున నష్టపోయాయి.

బ్యాంక్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు

- ప్రత్యామ్నాయ మార్గాల్లో రీ-కేవైసీ
- స్పష్టం చేసిన రిజర్వ్ బ్యాంక్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కేవైసీ విషయంలో బ్యాంక్ ఖాతాదారులకు ఊరట కలిగించేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుంది. చెల్లుబాటు అయ్యే పత్రాలను ఖాతాదారులు ఇప్పటికే బ్యాంక్‌కు సమర్పించి తమ చిరునామాను మార్చుకోనట్లయితే.. నో యువర్ కస్టమర్ (కేవైసీ) వివరాలను అప్‌డేట్ చేయడానికి ఇకపై వారి బ్యాంక్ శాఖలను సందర్శించాల్సిన అవసరం లేదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. కేవైసీ సమాచారంలో ఎటువంటి మార్పు లేకుంటే కస్టమర్లు నమోదిత ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, ఏటీఎంలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా స్వీయ డిక్లరేషన్‌ను సమర్పించవచ్చు. కేవైసీ అప్‌డేషన్ కోసం కస్టమర్లు శాఖల సందర్శన కోసం బ్యాంకులు పట్టుబట్టరాదని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్న నేపథ్యంలో.. రిజర్వ్ బ్యాంక్ గురువారం దీనికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసింది. దీని ప్రకారం కేవైసీ సమాచారంలో ఎటువంటి మార్పు లేకుంటే.. తిరిగి కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడానికి వినియోగదారు నుండి సెల్ఫ్ డిక్లరేషన్ సరిపోతుంది. ఇందుకు తగు ఏర్పాట్లు చేయాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. చిరునామాలో మార్పు మాత్రమే ఉన్నట్లయితే వినియోగదార్లు ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, ఏటీఎంలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా సవరించిన/నవీకరించిన చిరునామాను అందించవచ్చు.

జనవరి 25న తొలి విడత గ్రీన్ బాండ్ల జారీ

2 విడతల్లో రూ.16,000 కోట్ల సమీకరణ

ముంబై: రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) జనవరి 25, ఫిబ్రవరి 9వ తేదీల్లో.. రెండు విడతలుగా సావరిన్ గ్రీన్ బాండ్లు (ఎస్‌జీఆర్ బాండ్స్) జారీ చేయనుంది. రెండు విడతల ద్వారా రూ.8,000 కోట్ల చొప్పున మొత్తం రూ.16,000 కోట్ల సమీకరణ లక్ష్యం. కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యంగా ప్రభుత్వ రంగ ప్రాజెక్టులకు ఈ నిధులను సమకూర్చడం జరుగుతుంది. వార్షిక బడ్జెట్ (2022-23)లో ప్రకటించిన విధంగా, కేంద్ర ప్రభుత్వం తన మొత్తం మార్కెట్ రుణాలలో భాగంగా గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం వనరులను సమీకరించడానికి సావరిన్ గ్రీన్ బాండ్‌లను జారీ చేస్తుంది.



గ్లాండ్ ఫార్మా చేతికి సినెక్సీ

100% వాటా కొనుగోలుకి రెడీ



న్యూఢిల్లీ: ఔషధ రంగ హైదరాబాద్ కంపెనీ గ్లాండ్ ఫార్మా.. యూరోపియన్ సంస్థ సినెక్సీ గ్రూప్‌లో పూర్తి వాటాను సొంతం చేసుకోనున్నట్లు వెల్లడించింది. 100 శాతం వాటా కొనుగోలుకి ఎఫ్‌పీసీఐ సినో ఫ్రెంచ్ మిడ్‌క్యాప్ ఫండ్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొంది. సింగపూర్‌లోని సొంత అనుబంధ సంస్థ గ్లాండ్ ఫార్మా ఇంటర్నేషనల్ పీటీఈ ద్వారా వాటా కొనుగోలు ఒప్పందంపై సంతకాలు చేసినట్లు తెలియజేసింది. గతేడాది నవంబర్‌లో చేసుకున్న పుట్ ఆప్షన్ ఒప్పందం ప్రకారం 12 కోట్ల యూరోల(సుమారు రూ. 1,015 కోట్లు)కు సినెక్సీ గ్రూప్‌ను కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. అనుబంధ సంస్థలతోపాటు 2004లో ఏర్పాటైన సినెక్సీ గ్రూప్ ప్రధానంగా ఫార్మాస్యూటికల్ ప్రొడక్టుల కాంట్రాక్ట్ తయారీ, అభివృద్ధి సంస్థ(సీడీఎంవో)గా సేవలందిస్తోంది.

సాక్షి స్పోర్ట్స్

హుసాముద్దీన్‌కు స్వర్ణం

జాతీయ సీనియర్ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ బంగారు పతకం సాధించాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన అతను సర్వీసెస్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఎస్‌ఎస్‌సీబీ)కు ప్రాతినిధ్యం వహించాడు. 57 కేజీల ఫైనల్లో హుసాముద్దీన్ 4-1తో సచిన్ (రైల్వేస్)ను ఓడించాడు. హిస్సార్‌లో శుక్రవారం ముగిసిన ఈ పోటీల్లో సర్వీసెస్ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను నిలబెట్టుకుంది. ఈ జట్టుకు చెందిన బాక్సర్లు మొత్తం 10 పతకాలు సాధించారు. ఇందులో ఆరు స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలున్నాయి. భారత మేటి బాక్సర్ శివ థాపా (అస్సామ్) స్వర్ణం సాధించాడు. 63.5 కేజీల ఫైనల్లో అతను అంకిత్ నర్వాల్ (రైల్వేస్)పై గెలుపొందాడు. సర్వీసెస్ బాక్సర్లలో విశ్వామిత్ర చొంగ్థామ్ (51 కేజీలు), సచిన్ (51 కేజీలు), ఆకాశ్ (67 కేజీలు), సుమిత్ (75 కేజీలు), వాకోవర్‌తో నరేందర్ (ప్లస్ 92 కేజీలు) పసిడి పతకాలు గెలిచారు.



ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిస్తేనే...



- సిరీస్ విజయంపై భారత్ దృష్టి
- నేడు శ్రీలంకతో చివరి టి20
- టీమిండియాపైనే ఒత్తిడి
- రా.గం.7 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్-1'లో ప్రసారం

రాజ్‌కోట్: టి20 సిరీస్‌లో ఆఖరి పోరుకు భారత్, శ్రీలంక సిద్ధమయ్యాయి. ఇరు జట్ల లక్ష్యం ఒక్కటే... సిరీస్ వశం చేసుకోవడం. దీంతో నిర్ణాయక పోరు మరింత ఆసక్తికరంగా మారింది. గత మ్యాచ్ ఫలితం, ప్రదర్శన చూస్తే ఆతిథ్య జట్టు కంటే శ్రీలంక జట్టే మేటిగా ఉంది. టీమిండియా గతి తప్పిన బౌలింగ్, టాపార్డర్ వైఫల్యం ఏమాత్రం కొనసాగినా మ్యాచే కాదు... సిరీస్‌నే మూల్యంగా చెల్లించుకోవాల్సి వుంటుంది. ఈ నేపథ్యంలో ఒత్తిడంతా భారత శిబిరంపైనే ఉంది. పొట్టి సిరీస్ గెలుచుకోవాలంటే గట్టి పోరాటం చేయాల్సిందే!

ఓపెనర్లు మెరిపించాలి

గత రెండు మ్యాచ్‌ల్లోనూ ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్ నిరాశపరిచారు. వీరిద్దరు శుభారంభం ఇవ్వలేకపోయారు. తొలి మ్యాచ్‌లో కిషన్ రాణించినా పెద్దగా మెరిపించలేకపోయాడు. కీలకమైన ఆఖరి పోరులో ఇద్దరు బాధ్యత తీసుకోవాలి. లేదంటే అది ఇన్నింగ్స్‌పై కచ్చితంగా ప్రభావం చూపిస్తుంది. సూర్యకుమార్ ఫామ్‌లో ఉన్నాడు. అతనిపై జట్టు మేనేజ్‌మెంట్‌కు ఏ బెంగా లేదు. అక్షర్ పటేల్ రూపంలో అదనపు బ్యాటింగ్ బలం కనిపిస్తున్నప్పటికీ రెగ్యులర్ బ్యాటర్లు హార్దిక్ పాండ్యా, దీపక్ హుడా బ్యాట్లకు పనిచెబితేనే లంక బౌలింగ్‌పై పట్టు సాధించవచ్చు. అప్పుడే పోరాడే స్కోరైనా... ఛేదించే లక్ష్యమైనా సాకారమవుతుంది.

బెంగంతా బౌలింగ్‌పైనే...

ఈ సిరీస్‌లో భారత బౌలింగ్ తీసికట్టుగానే ఉంది. ప్రధాన బౌలర్లే ఓవర్‌కు పది పైచిలుకు పరుగులు ఇవ్వడం జట్టును ఆందోళన పరుస్తోంది. అర్ష్‌దీప్ గత మ్యాచ్ 'నోబాల్స్'ను మరిచి లయ అందుకోవాల్సి ఉంది. ఉమ్రాన్ మలిక్ నిప్పులు చెరుగుతున్నప్పటికీ వైవిధ్యం కొరవడటంతో ధారాళంగా పరుగులు సమర్పించుకుంటున్నాడు. చహల్ మ్యాజిక్ కరువైంది. మొత్తంగా నిలకడలేని బౌలింగ్ జట్టుకు ప్రతికూలంగా పరిణమించింది. నిర్ణాయక పోరులో సమష్టి బాధ్యత కనబరిస్తే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. లేదంటే కష్టాలు తప్పవు.

ఆత్మవిశ్వాసంతో లంక సేన

గత మ్యాచ్ ఫలితమే కాదు... ఆటతీరు కూడా శ్రీలంక జట్టులో ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచింది. బ్యాటింగ్‌లో మెరుపులు, ఆరంభంలో వికెట్లు షనక సేనను పైచేయిగా నిలబెట్టింది. ఓపెనర్లు నిసాంక, కుశాల్ మెండిస్‌లతో పాటు అసలంక, షనక ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో కసున్ రజిత, మదుషంక, షనక సమష్టిగా భారత బ్యాటర్స్‌ను వణికించారు. సిరీస్‌ను తేల్చే ఈ మ్యాచ్‌లోనూ తమ జోరు కనబరచాలనే పట్టుదలతో ఉన్నారు. ముఖ్యంగా బ్యాటింగ్‌కు స్వర్గధామమైన రాజ్‌కోట్ పిచ్‌పై మరోసారి తమ బ్యాటింగ్ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు.

తుది జట్లు (అంచనా)


భారత్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్, సూర్యకుమార్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, అక్షర్ పటేల్, చహల్, అర్ష్‌దీప్, శివమ్ మావి, ఉమ్రాన్ మాలిక్.

శ్రీలంక: షనక (కెప్టెన్), నిసాంక, కుశాల్ మెండిస్, అసలంక, భానుక రాజపక్స, ధనంజయ డిసిల్వా, హసరంగ, కరుణరత్నే, తీక్షణ, మదుషంక, కసున్ రజిత.

పిచ్-వాతావరణం

బ్యాటింగ్‌కు బాగా అనుకూలమైన వికెట్ ఇది. కాబట్టి ప్రేక్షకులకు మెరుపుల విందు, మ్యాచ్‌లో భారీ స్కోర్లు గ్యారంటీ. టాస్ గెలిచిన జట్టు ఛేజింగ్‌కే మొగ్గు చూపుతుంది. వర్షం ముప్పు లేదు.

'కాస్త సహనం ప్రదర్శించాలి'



- వచ్చే టి20 ప్రపంచకప్‌కు జట్టును సిద్ధం చేస్తున్నాం
- భారత హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్

పుణే: వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్ కోసం జట్టును తీర్చిదిద్దే పనిలో ఉన్నామని, కుర్రాళ్ల ప్రదర్శన విషయంలో కాస్త సహనం ప్రదర్శించాలని భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ వ్యాఖ్యానించాడు. యువ ఆటగాళ్లకు మరింత అనుభవం కావాలని అతను అభిప్రాయం వ్యక్తం చేశాడు. గురువారం శ్రీలంక చేతిలో 16 పరుగుల తేడాతో భారత్ ఓడిన తర్వాత ద్రవిడ్ మీడియాతో మాట్లాడాడు. 'భారత జట్టులోని కుర్రాళ్లలో మంచి ప్రతిభ ఉంది. అయితే ఇంకా నేర్చుకునే దశలో ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడుతూ ఉంటేనే నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. అందుకే వారి విషయంలో మనం కాస్త ఓపిక ప్రదర్శించాలి. వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్ కోసమే ఈ టీమ్‌ను సిద్ధం చేస్తున్నాం. వరల్డ్ కప్ సెమీ ఫైనల్ ఆడిన టీమ్‌తో పోలిస్తే జట్టులో చాలా మారింది. ముగ్గురు, నలుగురు మాత్రమే ప్రస్తుత తుది జట్టులో ఉన్నారు' అని ద్రవిడ్ చెప్పాడు. ఈ వ్యాఖ్యతో టి20 క్రికెట్‌లో కోహ్లి, రోహిత్ శర్మవంటి సీనియర్ల ఆట ముగిసిందని ద్రవిడ్ పరోక్షంగా చెప్పినట్లయింది. ఈ ఏడాది జరిగే వన్డే వరల్డ్‌కప్‌పైనే అందరి దృష్టీ ఉంటుంది కాబట్టి కొత్త కుర్రాళ్లకు టి20ల్లో అవకాశం ఇచ్చేందుకు ఇదే సరైన సమయంగా ద్రవిడ్ భావిస్తున్నాడు. 'వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్, వన్డే వరల్డ్ కప్‌ల గురించి అంతా ఆలోచిస్తున్నారు. అందుకే ఈ ఫార్మాట్‌లో కొత్తవారికి అవకాశాలు అవసరం. వారికి తగినన్ని మ్యాచ్‌లు ఇచ్చి అండగా నిలవడం అవసరం. కుర్రాళ్లు ఉన్న టీమ్‌లకు ఇలాంటి మ్యాచ్‌లలో ఓటములు సహజమని అర్థం చేసుకోవాలి' అని ద్రవిడ్ స్పష్టం చేశాడు.

గ్రాండ్‌మాస్టర్‌గా ప్రణేశ్

రిల్టన్ కప్‌లో విజేతగా నిలిచిన భారత కుర్రాడు



స్టాక్‌హోమ్: తమిళనాడుకు చెందిన 16 ఏళ్ల ఎం.ప్రణేశ్ భారత 79వ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపు పొందాడు. స్టాక్‌హోమ్‌లో జరిగిన రిల్టన్ కప్‌లో విజేతగా నిలిచిన ప్రణేశ్ టైటిల్ గెలుచుకోవడంతో పాటు గ్రాండ్‌మాస్టర్ హోదా కూడా సాధించాడు. ఈ టోర్నీకి ముందే అతను మూడు జీఎం నార్మ్‌లు పొందగా, ఇప్పుడు 2500 ఎలో రేటింగ్ పాయింట్లు (లైవ్) కూడా దాటాడు. 'ఫిడే' సర్క్యూట్‌లో తొలి టోర్నీ అయిన రిల్టన్ కప్‌లో ప్రణేశ్ 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. 136 మంది ఆటగాళ్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో ఆడిన 9 గేమ్‌లలో అతను 8 గెలిచి ఒకటి ఓడాడు. తెలంగాణకు చెందిన రాజా రిత్విక్ 6 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ప్రముఖ చెస్ కోచ్ ఆర్‌బీ రమేశ్ వద్ద ప్రణేశ్ శిక్షణ పొందుతున్నాడు. 'అద్భుత ప్రదర్శన కనబర్చిన ప్రణేశ్‌కు నా అభినందనలు. మంచి స్కోరుతో అతను విజేతగా నిలిచాడు. మన దేశంలో గ్రాండ్‌మాస్టర్ల సంఖ్య వేగంగా పెరుగుతోంది' అని దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ స్పందించారు.

ఆంధ్ర ఘన విజయం

154 పరుగులతో హైదరాబాద్ చిత్తు

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి'లో ఆంధ్ర జట్టు కీలక విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం ముగిసిన మ్యాచ్‌లో ఆంధ్ర 154 పరుగుల తేడాతో హైదరాబాద్‌ను చిత్తు చేసింది. 401 పరుగుల లక్ష్యం ముందుండగా...ఓవర్‌నైట్ స్కోరు 75/2తో ఆట కొనసాగించిన హైదరాబాద్ 73.3 ఓవర్లలో 246 పరుగులకే ఆలౌటైంది. చందన్ సహాని (87 బంతుల్లో 56; 10 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించగా...రోహిత్ రాయుడు (46), అలంకృత్ అగర్వాల్ (35), శశాంక్ (33) కొద్దిగా పోరాడారు. ఆంధ్ర బౌలర్లలో 5 వికెట్లతో కేవీ శశికాంత్ (5/68) ప్రత్యర్థిని దెబ్బ కొట్టగా...సుదర్శన్‌కు 3 వికెట్లు దక్కాయి. ఆడిన నాలుగు మ్యాచ్‌లలో హైదరాబాద్‌కు ఇది మూడో ఓటమి కాగా... ఆంధ్రకు రెండో విజయం. మంగళవారంనుంచి జరిగే తమ తర్వాతి మ్యాచ్‌లో ఢిల్లీతో ఆంధ్ర...సౌరాష్ట్రతో హైదరాబాద్ తలపడతాయి.





ప్రతిష్టాత్మక ఇండియన్ స్టయిల్ రెజ్లింగ్ 'హింద్ కేసరి' పోటీలు శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. పురుషులు, మహిళల విభాగాల్లో కలిపి దేశవ్యాప్తంగా సుమారు 550 మంది రెజ్లర్లు ఇందులో పాల్గొంటున్నారు. తొలి రోజు పోటీల్లో ఒక దృశ్యం.

సర్ఫరాజ్ పోరాటంతో...

'డ్రా'గా ముగిసిన పాక్, కివీస్ టెస్టు



కరాచీ: పాకిస్తాన్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు ఉత్కంఠభరిత మలుపులు తిరిగి చివరకు 'డ్రా'గా ముగిసింది. ఒక దశలో పాక్ ఓటమి ఖాయమనిపించి, ఆపై గెలుపు అవకాశం చిక్కినా వాడుకోలేకపోగా... పేలవ బౌలింగ్‌తో చివరకు కివీస్ 'డ్రా'తో సంతృప్తి పడాల్సి వచ్చింది. 319 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 0/2తో ఆట కొనసాగించిన పాక్ శుక్రవారం మ్యాచ్ ముగిసే సమయానికి 90 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. సర్ఫరాజ్ అహ్మద్ (176 బంతుల్లో 118; 9 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత సెంచరీ సాధించగా...షాన్ మసూద్ (35), సౌద్ షకీల్ (32), ఆగా సల్మాన్ (30) అండగా నిలిచారు. ఒక దశలో 80 పరుగుల వద్దే పాక్ 5 వికెట్లు కోల్పోయింది. అయితే సర్ఫరాజ్, షకీల్ ఆరో వికెట్‌కు 123 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. సల్మాన్‌తో కూడా సర్ఫరాజ్ వేగంగా 70 పరుగులు జత చేశాడు. చివరి 15 ఓవర్లలో 70 పరుగులు చేయాల్సి ఉండగా... తక్కువ వ్యవధిలో 3 వికెట్లు తీసి న్యూజిలాండ్ విజయంపై గురి పెట్టింది. అయితే 32 పరుగులు చేయాల్సిన స్థితిలో సర్ఫరాజ్ 9వ వికెట్‌గా వెనుదిరిగాడు. చివరి వికెట్ తీస్తే కివీస్ గెలుపు అందుకునే అవకాశం ఉండగా...చివరి జోడి నసీమ్ షా (15 నాటౌట్), అబ్రార్ (7 నాటౌట్) వికెట్ పడకుండా 21 బంతులు జాగ్రత్తగా ఆడారు. మిగిలిన 3 ఓవర్లలో పాక్‌కు 15 పరుగులు అవసరం కాగా... వెలుతురు మందగించడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. దాంతో రెండు టెస్టుల సిరీస్ 0-0తో డ్రాగా ముగిసింది.

మూడో రోజు వర్షార్పణం

సిడ్నీ: ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా చివరి టెస్టును వరుసగా మూడో రోజూ వర్షం వెంటాడింది. తొలి రెండు రోజులు వాన కారణంగా పూర్తి ఓవర్లు సాధ్యం కాకపోగా...శుక్రవారం అయితే ఆట మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. వర్షం ఏమాత్రం తెరిపినివ్వకపోవడంతో ఒక్క బంతి కూడా వేయడం సాధ్యం కాలేదు. గురువారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 475 పరుగులు చేసింది.

క్లుప్తంగా...

ఎస్‌ఐపీబీ పునర్ వ్యవస్థీకరణ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చైర్మన్‌గా ఉన్న రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్‌ఐపీబీ)ని పునర్ వ్యవస్థీకరిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికాల వలవన్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఈ కమిటీలో ఆర్థిక, రెవెన్యూ, పంచాయతీరాజ్– గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, వ్యవసాయశాఖ, కార్మిక, పరిశ్రమలు– పెట్టుబడులు, అటవీ–మైనింగ్ శాఖల మంత్రులు సభ్యులుగా ఉంటారు. పర్యాటక శాఖ మంత్రి ప్రత్యేక ఆహ్వానితులుగా, ఆయా శాఖల కార్యదర్శులు సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

ఆ వివరాలు రఘురామ కృష్ణరాజుకు ఇవ్వండి

- డీజీపీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో రఘురామకృష్ణరాజుపై నమోదయిన కేసుల వివరాలతో పాటు వాటికి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలతో పాటు కేసులు నమోదు చేయని ఫిర్యాదుల వివరాలను అతనికి అందజేయాలని హైకోర్టు శుక్రవారం హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ పోలీస్‌స్టేషన్లలో తనపై నమోదు కేసుల వివరాలతో పాటు వాటికి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలతో పాటు కేసులు నమోదు చేయని ఫిర్యాదుల వివరాలను తనకు అందజేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ నర్సాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఈటీవీలో అవాస్తవాల ప్రసారం దుర్మార్గం

- ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో గత నెల 28న చంద్రబాబు పర్యటనలో ఎనిమిది మంది మృతి చెందిన ఘటన తీరును తెలుసుకునేందుకు వెళ్లిన తనపై ఈటీవీ తప్పుడు వార్తలు ప్రసారం చేయడం దుర్మార్గమని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఖండించారు. శుక్రవారం ఆయన సాక్షి ప్రతినిధితో మాట్లాడుతూ.. ఆ ఘటనలో పోలీసులవైఫల్యం, సీఎం వైఎస్ జగన్ పాత్ర ఉందనేలా పచ్చ మీడియా సంపాదకీయం రాయడంతో వాస్తవాలు తెలుసుకునేందుకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆ సమయంలో పచ్చ మీడియా ప్రతినిధులు తనను ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించడం దారుణమని మండిపడ్డారు. ఆ ఘటనలో పోలీస్ వైఫల్యం ఏమాత్రం లేదన్నారు. ఈటీవీకి దమ్ము, ధైర్యం, చిత్తశుద్ధి ఉంటే తాను మాట్లాడిందంతా కట్ చేయకుండా యథాతథంగా ప్రసారం చేయాలని సవాల్ విసిరారు.

- తెలంగాణ

విదేశీ వైద్య విద్యార్థులకు వెసులుబాటు

సాక్షి, హైదరాబాద్: గతంలో భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) అనుమతి పొందిన, 2022 అక్టోబరు 21వ తేదీ లోపు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) గుర్తించిన విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు.. ఆయా దేశాల్లోనే ఏడాది పాటు ఇంటర్న్ షిప్ చేస్తే దాన్ని ఈ ఒక్క ఏడాది వరకు గుర్తిస్తామని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. ప్రస్తుతం ఏ దేశంలో ఎంబీబీఎస్ పూర్తి చేసినా కూడా భారత్‌లో అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, అనంతరం ఒక ఏడాది పాటు తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంది. ఈ నిబంధన తాజాగా అమల్లోకి రావడంతో 2022 అక్టోబర్‌కు ముందే ఇంటర్న్‌షిప్ విదేశాల్లో పూర్తి చేసిన వారు మళ్లీ ఇక్కడ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అలాంటి అభ్యర్థులు ఈ నిబంధనను సడలించాలని ఎన్ఎంసీని కోరారు. దీన్ని పరిశీలించిన ఎన్ఎంసీ తాజాగా వెసులుబాటు కల్పించింది. తాము అనుమతించిన కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో గతేడాది అక్టోబర్ 21కు ముందు ఎంబీబీఎస్, తత్సమాన అర్హతతో వైద్య విద్య పూర్తి చేసి, ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేసినట్లయితే వారికి ఈ ఒక్క ఏడాదికి సడలింపిస్తామని ఉత్తర్వులు జారీచేశారు.



ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో వైఎస్సార్ పెన్షన్ కానుక నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్





విజయనగరం జిల్లా గజపతినగరంలో లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



విజయవాడలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 30% డివిడెండ్

రూ.9.01 కోట్ల చొప్పున ఇచ్చిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ

- 2021–22లో రూ.305 కోట్ల వ్యాపారం.. రూ.42 కోట్ల లాభం
- ఉద్యోగులకు రూ.2.76 కోట్ల ప్రోత్సాహకాలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రికార్డులు తిరగరాస్తోంది. రికార్డు స్థాయిలో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తూ లాభాలను ఆర్జిస్తోంది. స్టేక్ హోల్డర్స్‌గా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 30 శాతం మేర డివిడెండ్ ఇవ్వడమేగాక సంస్థ ఉద్యోగులందరికీ ప్రోత్సాహకాలిచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.9.01 కోట్ల వంతున లాభాలు పంచిపెట్టిన సంస్థ.. ఉద్యోగులకు రూ.2.76 కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చింది. నాలుగువేల టన్నుల సామర్థ్యంతో 1958లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టేక్ హోల్డర్స్‌గా ఏర్పాటు చేసిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు ప్రస్తుతం మొత్తం 14.75 లక్షల టన్నుల సామర్థ్యంగల 69 సొంత, 58 ప్రైవేటు గోదాములున్నాయి. 2018–19 నాటికి సొంతంగా 5.92 లక్షల టన్నుల సామర్థ్యంగల గోడౌన్లుండగా.. ఈ మూడున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ కృషి ఫలితంగా కొత్తగా 2.44 లక్షల టన్నుల సామర్థ్యంగల గోదాములు అందుబాటులోకి వచ్చాయి. రూ.69.66 కోట్లతో 69,500 టన్నుల సామర్థ్యంగల ఎనిమిది గోదాముల నిర్మాణం జరుగుతోంది. వీటిలో 30 వేల టన్నుల సామర్థ్యంగల గోదాములు ఫిబ్రవరిలో, మిగిలినవి జూన్ నాటికి పూర్తికానున్నాయి. 2018–19లో రూ.142.13 కోట్ల టర్నోవర్‌తో రూ.23.48 కోట్ల లాభాలను ఆర్జించిన సంస్థ 2019–20లో రూ.214.97 కోట్ల టర్నోవర్‌తో రూ.25.59 కోట్లు, 2020–21లో రూ.301.27 కోట్ల టర్నోవర్‌తో రూ.35.37 కోట్ల లాభాలను ఆర్జించింది. 2021–22లో రూ.305.05 కోట్ల టర్నోవర్‌తో రూ.42 కోట్లు లాభాలను సాధించి, రికార్డు స్థాయిలో 30 శాతం డివిడెండ్ ప్రకటించింది. 2020–21లో రూ.7.38 కోట్ల డివిడెండ్ ఇచ్చిన సంస్థ 2021–22లో రూ.9.01 కోట్ల చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లాభాలు పంచిపెట్టింది. మరోపక్క 2015–16 నుంచి పెండింగ్ ఆడిట్‌ను రెండేళ్లలో పూర్తిచేసి రికార్డు నెలకొల్పింది. సంస్థలో రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ పెర్ఫార్మెన్స్ రివార్డు ప్రకటించింది. రెగ్యులర్ ఉద్యోగులకు నెల జీతం, కాంట్రాక్టు ఉద్యోగులకు 3.5 రెట్ల టైమ్ స్కేల్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మూడు రెట్ల వేతనం చొప్పున మొత్తం 413 మందికి రూ.2.76 కోట్లు ఇచ్చి ప్రోత్సహించింది.

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..



ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహం వల్ల గత మూడేళ్లలో రికార్డు స్థాయి వ్యాపారం చేశాం. ఫలితంగా సంస్థ మంచి లాభాలను ఆర్జించగలిగింది. ఈ లాభాల్లో 30 శాతాన్ని డివిడెండ్ రూపంలో స్టేక్ హోల్డర్స్‌గా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందించాం. ఈ స్థాయిలో డివిడెంట్ అందించడం చరిత్రలో ఇదే తొలిసారి. రూ.2.76 కోట్లు సిబ్బందికి ప్రోత్సాహకంగా ఇచ్చాం. ఇదే స్ఫూర్తితో 2022–23లో రూ.400 కోట్ల వ్యాపారం లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

– శ్రీకంఠనాథరెడ్డి, ఎండీ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ

కంటైనర్లలో పేలుడు పదార్థాలు

- తమిళనాడులో కలకలం

సాక్షి, చెన్నై: తమిళనాడులోని మాధవరం సీఎండీఏ పార్కింగ్ యార్డ్‌లో పేలుడు పదార్థాల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలతో 75 లారీలు ఉన్న సమాచారం స్థానికంగా కలకలం రేపింది. ఇవన్నీ విదేశాలకు తరలించేందుకు వచ్చినట్లు తెలుసుకుని వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మాధవరం సమీపంలోని మంజంబాక్కంలో చెన్నై మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) కంటైనర్ పార్కింగ్ యాడ్ ఉంది. ఇక్కడ కొద్ది రోజులుగా 75 లారీలు పార్కు చేసి ఉన్నాయి. ఇందులో పేలుడు పదార్థాలు ఉన్నట్లు సమాచారం రావడంతో మాధవరం అసిస్టెంట్ కమిషనర్ దక్షిణామూర్తి, ఇన్‌స్పెక్టర్ శంకర్ అక్కడికి చేరుకుని లారీలను పరిశీలించారు. రికార్డులు, ఇతర అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ 75 లారీలు నాగ్‌పూర్ నుంచి చెన్నైకు వచ్చినట్లు గుర్తించారు. ఈ లారీల్లో పేలుడు పదార్థాల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో లారీలను తిరువొత్తియూరులో ఉన్న మరో పార్కింగ్ యాడ్‌కు తరలించారు. తాము నాగ్‌పూర్, ఒడిశాకు చెందిన సంస్థల నుంచి అన్ని రకాల అనుమతులతో చెన్నై మీదుగా విదేశాలకు నౌకల ద్వారా ఈ ముడి పదార్థాలను తరలించేందుకు తీసుకొచ్చినట్లు డ్రైవర్లు చెప్పారు. సురక్షితమైన ఏర్పాట్లతో లారీలను తీసుకొచ్చామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

స్నానం చేయకుండా గుడికి వచ్చిందని మహిళపై అమానుషం

జుట్టు పట్టుకుని కొట్టుకుంటూ గుడి నుంచి బయటకు తీసుకొచ్చిన ధర్మకర్త

యశవంతపుర/బనశంకరి: స్నానం చేయకుండా గుడిలోకి వచ్చిందని మహిళతో ధర్మకర్త అమానుషంగా ప్రవర్తించిన ఘటన బెంగళూరు అమృతహళ్లిలో గత ఏడాది డిసెంబర్ 21న జరిగింది. లక్ష్మీ నారాయణస్వామి ఆలయానికి దర్శనం కోసం వెళ్లిన హైమావతి అనే మహిళను ఆలయ ధర్మకర్త మునికృష్ణ జుట్టు పట్టుకుని ఇనుపరాడ్‌తో బాదుతూ గుడిలో నుంచి రోడ్డుపైకి తీసుకొచ్చాడు. ఈ ఘటనను వీడియోలో చిత్రీకరించిన స్థానికులు శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో వైరల్‌గా మారింది. ధర్మకర్త దాష్టీకంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అతనిపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే మునికృష్ణ వాదన మరోలా ఉంది. సదరు మహిళ గర్భగుడిలోకి వెళ్లేందుకు యత్నించిందన్నారు. అర్చకుడు ఇచ్చిన సమాచారంతో తాను వెళ్లి అడ్డుకోగా, అసభ్య పదజాలంతో దూషించి ముఖంపై ఉమ్మేసిందని, దీంతో ఆలయం నుంచి బయటకు గెంటేశానని తెలిపాడు.

10న ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ ఏర్పాటు

సాక్షి, అమరావతి: ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్), ధాన్యం సేకరణ, వినియోగదారుల హక్కుల పరిరక్షణ, ఆహార భద్రత చట్టాన్ని సమర్థవంతంగా, పారదర్శకంగా అమలుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటివరకు ఆయా విభాగాలకు విడివిడిగా టోల్ ఫ్రీ నంబర్లు ఉన్నప్పటికీ.. వాటిని ఒకే వేదికపైకి తీసుకొచ్చి 1967 టోల్ ఫ్రీ నంబర్‌తో అనుసంధానం చేస్తోంది. ఈ నెల 10న పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఈ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ప్రారంభించనుంది. ఇప్పటికే సిబ్బంది నియామకాన్ని పూర్తిచేయడంతో పాటు ఫిర్యాదుల స్వీకరణపై ప్రత్యేక శిక్షణను అందించింది.

జి–20 సమావేశాల ద్వారా ఏపీ షోకేసింగ్



సాక్షి, అమరావతి: జి–20 సమావేశాల ద్వారా రాష్ట్రాన్ని ముఖ్యంగా పరిపాలన రాజధాని విశాఖను అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా మార్చి 28, 29 తేదీల్లో విశాఖలో జరిగే జి–20 సమావేశాల ఏర్పాట్లపై శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సమావేశాలకు జి–20 దేశాలతో పాటు యూరోపియన్ యూనియన్‌లోని సభ్యదేశాలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, కళలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, నాడు–నేడు వంటి ప్రతిష్టాత్మకమైన పథకాలను వివరించే విధంగా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సుందర విశాఖ నగరానికి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వం కృషిచేయనుందన్నారు. కోవిడ్ ప్రొటోకాల్ నిబంధనలను పాటిస్తూ ఈ సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల కోసం విశాఖ నగరంలోని రహదార్లన్నిటినీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. 40 దేశాల నుంచి 300 మంది వరకు ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, అధికారులు పాల్గొనే అవకాశం ఉండటంతో ప్రతి బృందానికి ముగ్గురు, నలుగురు ట్రాన్స్‌లేటర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌భార్గవ మాట్లాడుతూ జి–20 వర్కింగ్ గ్రూప్ సమావేశాలు సందర్భంగా మన రాష్ట్ర సంస్కృతి, పర్యాటక రంగాల ప్రాముఖ్యతను ముఖ్యంగా విశాఖ పరిసర ప్రాంతాల పర్యాటక ప్రాముఖ్యతను తెలిపేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటామని చెప్పారు. అరకు ప్రాంత అందాలు, వాటి ప్రాముఖ్యత, సుందరమైన బీచ్‌లు తదితర పర్యాటక, సాంస్కృతిక ప్రాంతాల ప్రాముఖ్యతను జాతీయ, అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేయనున్నట్టు తెలిపారు. సమాచారశాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా, ఇతర అవుట్‌డోర్ మీడియాల ద్వారా ఏపీతోపాటు విశాఖ ప్రాముఖ్యతను ప్రమోట్ చేసేందుకు విస్తృత ప్రచారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రాజకీయాల్లో ఉన్నంత వరకూ సీఎం జగన్ వెంటే..

- మాజీ హోంమంత్రి సుచరిత



పెదనందిపాడు/గుంటూరు రూరల్: 'నాడు వైఎస్సార్ భిక్షతోనే రాజకీయాల్లోకొచ్చి ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా గెలిచాను. ఆయన మరణానంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీలో చేరిన మొట్టమొదటి వ్యక్తిని నేనే' అని మాజీ హోం మంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత చెప్పారు. గుంటూరు జిల్లా నాగులపాడు వ్యవసాయ మార్కెట్ యార్డు అవరణలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ తాను పార్టీ మారుతున్నట్టు చేస్తున్న ప్రచారాలు అవాస్తవమన్నారు. రాజకీయాల్లో ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉంటానని స్పష్టం చేశారు. తనపై కొన్ని మీడియా చానళ్లు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని, ఏమైనా సందేహాలుంటే తనను సంప్రదించాలని, అలా కాకుండా అవాస్తవాలను ప్రచారం చేస్తే ఎలా.. అంటూ అసహనం వ్యక్తం చేశారు. పార్టీ మారే ఆలోచనే లేదని, దుష్ప్రచారాలను మానుకోవాలంటూ ఆయా చానళ్లకు హితవు పలికారు.

'మా ప్రతి అడుగూ జగనన్నతోనే'..

వైఎస్సార్ ఆశయాలను అమలు చేస్తున్న జననేత సీఎం జగనన్నతోనే మా ప్రతి అడుగూ ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత భర్త, ఇన్‌కంటాక్స్ మాజీ కమిషనర్ మేకతోటి దయాసాగర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొందరు కావాలనే దుష్ప్రచారాలు చేస్తున్నారని అందులో వాస్తవం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం తాను స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఇంట్లోనే ఉన్నానని, దానిపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తూ సోషల్ మీడియా, ఇతర పద్ధతులు ద్వారా రాజకీయాల్లోకి వస్తున్నారు.. పార్టీ మారుతున్నారు.. అంటూ ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర సర్వీస్‌లో ఉద్యోగిగా పనిచేసిన తనకు ఏ పార్టీలోనూ సభ్యత్వం ఉండే అవకాశాలు లేవన్నారు.



పోలవరం ముంపుపై రాష్ట్రాలతో మరోసారి చర్చలు

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ముంపు, బ్యాక్ వాటర్ ప్రభావంపై పరీవాహక రాష్ట్రాలతో మరోసారి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చర్చించనుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ఏడాది అక్టోబర్‌లో ఒకసారి రాష్ట్రాలతో చర్చించిన సీడబ్ల్యూసీ... మరోమారు ఈ నెల 13న భేటీ నిర్వహించనుంది. ఈ భేటీకి హాజరుకావాలని సీడబ్ల్యూసీ డైరెక్టర్ సంజయ్‌కుమార్ శుక్రవారం రాష్ట్రాలకు లేఖలు రాశారు. సీడబ్ల్యూసీ చైర్మన్ డాక్టర్ ఆర్కే గుప్తా అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల ఇంజనీర్లను ఆహ్వానించారు. పోలవరం ముంపుపై గత ఏడాది సెప్టెంబర్ 6న ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా బ్యాక్‌వాటర్ ప్రభావంపై అనుమానాలను నివృత్తి చేయడానికి అక్టోబర్ 7న ఢిల్లీలో నాలుగు రాష్ట్రాల ఈఎన్‌సీల నేతృత్వంలోని సాంకేతిక బృందాలు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పీపీఏ) సీఈవో చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని సాంకేతిక నిపుణులతో సీడబ్ల్యూసీ చైర్మన్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ముంపుపై ఆయా రాష్ట్రాలు భిన్న వాదనలు వినిపించాయి. గత ఏడాది గోదావరికి వచ్చిన వరదల కారణంగా తెలంగాణలోని 103 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, 28వేల మంది ప్రభావానికి లోనయ్యారని, 150 గ్రామాల్లో 50వేల ఎకరాల మేర పంట దెబ్బతిన్నదని తెలంగాణ వివరించింది. ఈ నేపథ్యంలో మరోమారు ఉమ్మడి సర్వే చేయాలని కోరింది. ఇక తమతమ రాష్ట్రాల్లో సంయుక్త సర్వేకు ఛత్తీస్‌గఢ్ అంగీకరించగా, ఒడిశా ఒప్పుకోలేదు. ఈ భేటీలో లేవనెత్తిన అభ్యంతరాలను లిఖితపూర్వకంగా తమకు అందించాలని సీడబ్ల్యూసీ చైర్మన్ ఆదేశించడంతో గత నెలలో ఆయా రాష్ట్రాలు అందజేశాయి. వాటిపై ఈ 13న చర్చించనున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 7 : జనవరి : 2023

కన్నడ భామల సందడి



బనశంకరి: సంక్రాంతి పండుగ సందర్భంగా చిత్ర కళాపరిషత్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన బెంగళూరు ఉత్సవ ప్రదర్శనను కన్నడ భామలు సలోమిడిసోజా, దీనాపూజారి ప్రారంభించారు. శ్రీకృష్ణుడు, గౌతమబుద్ధుడు, జ్యువెలరీఐటమ్స్, చీరలు ప్రదర్శిస్తూ సందడిచేశారు. ఈ ప్రదర్శన 15 తేదీ వరకు నిర్వహిస్తారు.

న్యూస్‌రీల్

అన్నదాత ఆత్మహత్య

మైసూరు: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మైసూరు జిల్లా హెచ్.డి.కోటె తాలూకా హీరెనంది గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కెండగణ్ణప్ప (60) విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఐదు ఎకరాల్లో పంట కోసం బ్యాంకులో రూ. 5 లక్షలు, మహిళా సంఘం నుంచి రూ. 3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇదే సమయంలో పంటలు సరిగా పండక తీవ్ర మనస్తాపంతో విషం తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెచ్.డి.కోటె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

మైసూరు: భార్య మరణానికి కారణమైన భర్తకు మైసూరు 5వ అదనపు జిల్లా కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. వివరాలు... మైసూరు తాలూకా రామనహుండీలో నివాసం ఉంటున్న రవికుమార్‌కు, నంజనగూడు తాలూకాలోని అహల్య గ్రామానికి చెందిన పుష్పలతతో వివాహం జరిగింది. ఇదిలా ఉంటే భార్య నడవడికపై రవి కుమార్ తరచూ అనుమానించేవాడు. నిత్యం మానసికంగా వేధించేవాడు. అతని వేధింపులు భరించలేక భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దలతో పంచాయితీ పెట్టించి భార్యను ఇంటికి తీసుకొచ్చాడు. అయినా కూడా రవి కుమార్‌లో ఎలాంటి మార్పు కనిపించలేదు. వేధింపులు ఆగలేదు. దీంతో జీవితంపై విరక్తి కలిగిన పుష్పలత అక్కడే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జయపుర పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి మల్లికార్జున, ముద్దాయి రవికుమార్‌కు ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

పట్టుబడిన నగదుపై లోతుగా విచారణ

- నగదుతో పట్టుబడిన ఏఈ కోర్టుకు హాజరు

శివాజీనగర: విధానసౌధలోకి రూ.10 లక్షలు తీసుకొస్తూ పట్టుబడిన పీడబ్ల్యూడీ ఏఈ జగదీశ్‌ను కేంద్ర విభాగపు పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. కాగా సీఐ కుమారస్వామి నేతృత్వంలో గురువారం అర్ధరాత్రి వరకు పోలీసులు జగదీశ్‌ను విచారించారు. అయితే నగదు గురించి జగదీశ్ నోరు విప్పలేదు. జగదీశ్ మొబైల్ స్వాధీనంలోకి తీసుకొని కాల్‌డేటాను పరిశీలిస్తున్నారు. కాగా నగదు పట్టుబడిన విషయంపై కర్ణాటక పోలీస్ చట్టం కింద కేసు నమోదు చేశారు, దీనికోసం కోర్టు అనుమతి తీసుకోకుండా జగదీశ్‌ను అరెస్ట్ చేశారని ఆయన తరపు న్యాయవాది రాజు ఆరోపించారు. జగదీశ్ లంచం ఇవ్వాలని తీసుకొచ్చిన సొమ్ము కాదని, జగదీశ్‌పై చెక్ బౌన్స్ కేసు నమోదైందని,ఆ కేసు పరిష్కారానికి బెంగళూరుకు నగదు తీసుకొచ్చారన్నారు. విధుల్లో భాగంగా ఓ అధికారిని కలిసేందుకు విధానసౌధకు వెళ్తుండగా ఈ ఘటన జరిగిందని ఆ న్యాయవాది పేర్కొన్నారు.

ఫిబ్రవరి 13న హెలికాప్టర్ యూనిట్ ప్రారంభం



తుమకూరు: తుమకూరు జిల్లా గుబ్బి తాలూకా నిట్టూరు సమీపంలోని బిదరహళ్లి కావల్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన హెచ్‌ఏఎల్ యూనిట్‌ను ప్రధాని మోదీ ఫిబ్రవరి 13న ప్రారంభిస్తారని తుమకూరు ఎంపీ జీఎస్ బసవరాజ్ తెలిపారు. శుక్రవారం హెచ్‌ఏఎల్ యూనిట్‌ను ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ అత్యాధునిక హెలికాప్టర్లు తయారు చేస్తారని చెప్పారు.

2ఏకు పట్టు, 24 గంటల డెడ్‌లైన్

- 2డీ రిజర్వేషన్ తిరస్కరించిన పంచమసాలిలు

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 2డీ రిజర్వేషన్‌ను పంచమసాలి సామాజిక వర్గం తిరస్కరించగా, 2ఏ రిజర్వేషన్ కోసం మళ్లీ పట్టుపట్టింది. 2ఏ రిజర్వేషన్ ప్రకటించాలని ప్రభుత్వానికి 24 గంటలు గడువును ఇచ్చింది. లేనిపక్షంలో ఈ నెల 13న ముఖ్యమంత్రి బొమ్మై సొంత జిల్లా హావేరిలోని సీఎం ఇంటి ముందు ధర్నా చేపడుతామని హెచ్చరించింది. నగరంలోని గాంధీభవన్‌లో గురువారం 2డీ పంచమసాలిల పోరాటానికి లభించిన న్యాయమో? అన్యాయమో? అనే విషయంపై చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. తమకు 2ఏ రిజర్వేషన్ కిందనే సదుపాయాలు కల్పించాలి. అయితే ప్రభుత్వం 2డీ రిజర్వేషన్ ప్రకటించిన అనవసరంగా వివాదాలు సృష్టించింది. 24 గంటల్లోగా 2ఏ రిజర్వేషన్ ప్రకటించాలి. జనవరి 12లోగా నోటిఫికేషన్ వెల్లడించని పక్షంలో ఈ నెల 13న హావేరి జిల్లా శిగ్గాంవిలో ఉన్న సీఎం ఇంటి ముందు ధర్నా జరిపేందుకు నిర్ణయించారు. ప్రభుత్వ ప్రకటనను బట్టి పోరాట స్వరూపాన్ని హావేరిలోనే నిర్ణయిస్తామని కూడల సంగమ పీఠం జయమృత్యుంజయ స్వామి తెలిపారు.

హావేరిలో మోగిన కన్నడ డిండిమ

- దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన కన్నడ భాషాభిమానులు
- కన్నడ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి శివరాం హెబ్బార్, హాజరైన సీఎం బొమ్మై



దప్పు కళాకారుల ప్రదర్శన



సమ్మేళన అధ్యక్షుడు దొడ్డరంగేగౌడ ఊరేగింపు

దొడ్డబళ్లాపురం: యాలక్కి నగరంగా కీర్తికెక్కిన హావేరిలో కన్నడ డిండిమ మోగింది. 6వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. హుబ్బళ్లి జాతీయ రహదారి పక్కనే 130 కరాల విస్తీర్ణంలో కన్నడ గంధర్వలోకం భువికి దిగివచ్చినట్టు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు హావేరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అరెబైలు శివరాం హెబ్బార్ కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో కన్నడ పతాకాన్ని కన్నడ సమ్మేళనాన్ని ప్రారంభించారు. కన్నడ తేరుపై సమ్మేళనం అధ్యక్షుడు దొడ్డరంగేగౌడను నగరంలోని ప్రముఖ వీధుల్లో ఊరేగించారు. కసాప రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ జోషి, హావేరి జిల్లా కసాప అధ్యక్షుడు లింగయ్య తదితరులు హాజరయ్యారు. ఇక సమ్మేళనాన్ని వీక్షించడానికి రాష్ట్రం నలుమూలల నుండి వేలాదిగా కన్నడాభిమానులు తరలివచ్చారు.

కన్నడకు పాలనాపరమైన గుర్తింపు ఇవ్వాలి

కన్నడ భాషకు పాలనాపరమైన గుర్తింపు ఇవ్వాలని అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనం అధ్యక్షుడు దొడ్డరంగేగౌడ డిమాండు చేశారు. కన్నడ సాహిత్య సమ్మేళనంలో మాట్లాడిన ఆయన.. కన్నడ భాషకు పాలనాపరమైన గుర్తింపు తెచ్చే ప్రయత్నంలో భాగంగా కన్నడ, సంస్కృతి శాఖ మంత్రి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో కన్నడ భాషకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కన్నడ భాష అభివృద్ధికి తీసుకురానున్న కొత్త చట్టంలో ఇవన్నీ చేర్చాలన్నారు. జనవరి నెలలోనే అసెంబ్లీ సమావేశాల్లో ఈ చట్టాన్ని ఆమోదించి అమలు చేయాలని కోరారు. రాష్ట్ర సరిహద్దుల్లో కన్నడ పాఠశాలలు తెరవాలని, మూతపడిన పాఠశాలలను పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రముఖులు, నటుడు రమేష్ అరవింద్, నిర్మలానందస్వామీజీ, రిటైర్డ్ జస్టిస్ సంతోష్ హెగ్డే పాల్గొన్నారు.

కన్నడ సాహిత్య సమ్మేళనం సాహిత్యలోకానికి ముందడుగు

బనశంకరి: అఖిలభారత కన్నడ సాహిత్యసమ్మేళనం సాహిత్యలోకాన్ని ముందుకు తీసుకెళుతుందని బసవరాజబొమ్మై అన్నారు. అఖిలభారత సాహిత్య సమ్మేళనంలో పాల్గొనే ముందు విలేకరులతో మాట్లాడారు. తన సొంతగడ్డపై సమ్మేళనం జరగడం సంతోషకరంగా ఉందన్నారు. భవిష్యత్‌లో కన్నడ సాహిత్యాన్ని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లేందుకు ఈ సమ్మేళనంలో చర్చలు జరగాలన్నారు. కన్నడ భాష అభివృద్ధికి ఇప్పటికే పలు సలహాలు ఇచ్చామని, దీనిపై చర్చించాలన్నారు. న్యాయశాఖ కమిషన్ పూర్తిగా స్పష్టం చేసి అభిప్రాయం తెలిపిందని, వచ్చే శాసన సభ సమావేశాల్లో ఆమోదిస్తామన్నారు. సాహిత్యసమ్మేళనంలో చర్చించే అంశాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందని, ప్రభుత్వం ఇప్పటికే గడినాడు కన్నడిగుల అభివృద్ధికి ప్యాకేజ్ ప్రకటించిందని తెలిపారు.



హాజరైన కన్నడ భాష అభిమానులు



దొడ్డరంగేగౌడతో ముచ్చటిస్తున్న సీఎం బొమ్మై



హావేరి వీధుల్లో కొమ్ము కళాకారులు



అతిథులకు సన్మానం

మహిళపై చిరుత దాడి



మండ్య: చిరుత దాడిలో మహిళ తీవ్రంగా గాయపడింది. మండ్య తాలూకాలోని అవ్వేరహళ్లి గ్రామానికి చెందిన దేవరాజు భార్య బసమ్మణి శుక్రవారం ఉదయం తమ ఇంటివెనుక క్టొటంలో పశువులను కట్టి వేయడానికి వెళ్లగా అప్పటికే పొంచి ఉన్న చిరుత దాడి చేసింది. బాధితురాలు కేకలు వేయడంతోపాటు కాళ్లతో గట్టిగా తన్నడంతో చిరుత కిందపడింది. పశువులు భయాందోళనతో పరుగులు తీయగా చిరుత వాటి వెంట పడింది. దీంతో బసమ్మణి ప్రాణాలతో బయట పడింది. కాగా గాయపడిన బాధితురాలిని ఆస్పత్రికి తరలించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

నకిలీ నోట్ల చెలామణి ముఠా అరెస్ట్

శివాజీనగర: రూ.2వేలు, రూ.500 ముఖ విలువతో ఉన్న నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న ముఠా పట్టుబడింది. తమిళనాడు తుత్తూకుడికి పిచ్చిముత్తు (45), తిరునల్వేలి (53), సుబ్రమణియన్ (60)ను సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. కోటీ 28 లక్షల విలువైన నకిలీ నోట్లను(రూ.2వేల ముఖ విలువ కలిగిన 2300 నోట్లు, రూ.500 ముఖ విలువ కలిగిన 174 నోట్లు), ప్రింటర్ హార్డ్ డిస్క్, మొబైల్‌లను స్వాధీనం చేసుకున్నారని జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎస్.డీ.శరణప్ప ఒక ప్రకటన విడుదల చేశారు. నిందితులపై సిద్దాపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులైన పిచ్చిముత్తు, నల్లకణి ఫైనాన్స్‌ర్లుగా, మరో నిందితుడు సుబ్రమణియన్ ఆడిటర్‌గా ప్రచారం చేసుకునేవారు. నకిలీ నోట్ల చెలామణితోపాటు రుణం కోసం వచ్చిన వారిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు తీసుకెళ్లి అగ్రిమెంట్ చేయించి చార్జీల కింద 1 శాతం చొప్పున నగదు రూపంలో వారిద్వారానే తీసుకునేవారు. రుణం అందినట్లు వారితోనే సంతకాలు తీసుకునేవారు. అనంతరం రుణం ఇవ్వకుండా జాప్యం చేసేవారు. సంతకాలు తీసుకొని రుణం ఇవ్వకపోగా బెదిరింపులకు పాల్పడేవారు.

జయహో కన్నడ కస్తూరి



హావేరిలో ప్రారంభమైన అఖిలభారత కన్నడ సమ్మేళనం కన్నడ భాష అభిమానులను అలరించింది. వేలాది మంది తరలిరావడంతో ప్రాంగణం కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలకు భాషాభిమానులు పోటెత్తారు. హావేరి వీధుల్లో మరగాళ్ల కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.





అభివృద్ధి అంటే బీజేపీ

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



తుమకూరు: దేశంలో అభివృద్ధి అంటే బీజేపీ అని, వినాశనం అంటే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుకు రావాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. శుక్రవారం సాయంత్రం తుమకూరు జిల్లా శిరలో నిర్వహించిన బీజేపీ జన సంకల్ప యాత్ర సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ వంశపారంపర్య పాలన, సమాజాన్ని అవినీతి సమయంలో చేసిందని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ పార్టీ జాతి, ధర్మం పేరుతో రాజకీయం చేస్తోందని అన్నారు. ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 30 కోట్లతో అభివృద్ధి పనులను మోదీ స్వయంగా ప్రారంభించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఎం బొమ్మై, మాజీ సీఎం యడియూరప్ప తదితర నేతలు పాల్గొన్నారు.

నాగరబావిలో చిరుత మళ్లీ ప్రత్యక్షం



నాగరబావిలో ప్రత్యక్షమైన చిరుత

బనశంకరి: బెంగళూరు నగర శివారు ప్రాంతంలో కొద్దిరోజులుగా కనుమరుగైన చిరుత అనూహ్యంగా మళ్లీ కనిపించడంతో నగరవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నాగరబావి చుట్టుపక్కల చిరుత కనబడటంతో ప్రజలు హడలిపోతున్నారు. మూడు రోజుల క్రితం రాత్రి బైక్‌లో వెళ్తుండగా చిరుత కనిపించడంతో వారు తిరిగి వెనక్కి వెళ్లిపోయారు. నాగరబావికి ఆరు కిలోమీటర్ల దూరంలో చిరుత సంచరిస్తోంది. చిరుత సంచరించిన గుర్తులు సీసీటీవీలో నిక్షిప్తమయ్యాయి. ఇప్పటికే అటవీశాఖ అధికారులు చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించి బోనులు ఏర్పాటు చేశారు.

రిజర్వేషన్ల విషయంలో బీజేపీ అబద్ధాలు

- మాజీ సీఎం కుమారస్వామి

దొడ్డబళ్లాపురం: రిజర్వేషన్ల విషయంలో బీజేపీ ప్రభుత్వం ఆటలాడుతోందని, ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారని, ఈ సంగతి ప్రజలు గ్రహించినప్పుడు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి విమర్శించారు. బీదర్ తాలూకా జనవాడలో పంచరత్న రథయాత్రలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... కందిపంట నష్టపోయినా ప్రభుత్వం రైతులను ఆదుకోలేదన్నారు. రైతుల సమస్యలకు ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కారణంగా రైతుల్లో బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో జేడీఎస్ రైతులకు మద్దతుగా పోరాటం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రికి స్యాంట్రో రవి తెలియకపోతే ముఖ్యమంత్రికి స్యాంట్రో రవి ఎందుకు మేసేజ్ చేస్తాడని ప్రశ్నించారు. కుమారకృప చుట్టూ ఏం జరుగుతోందని ప్రశ్నించారు.

నేటినుంచి చిక్కబళ్లాపురం ఉత్సవం

చిక్కబళ్లాపురం: కన్నడ, సంస్కృతి శాఖ జిల్లా పాలకమండలి, డాక్టర్ సుధాకర్ ఫౌండేషన్ చిక్కబళ్లాపురం ఆధ్వర్యంలో చిక్కబళ్లాపురం ఉత్సవాన్ని ఈనెల 7నుంచి 14 వ తేదీ వరకు నగరంలోని సర్ ఎం విశ్వేశ్వరయ్య క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ నాగరాజు తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు మరళు సిద్దేశ్వర స్వామి ఆలయం నుంచి ఉత్సవ మూర్తుల ఊరేగింపు, ఉంటుందని, ఉత్సవాలను ఆదిచుంచనగిరి మఠం పీఠాధ్యక్షుడు డాక్టర్ నిర్మలానందనాథ మహాస్వామి ప్రారంభిస్తారన్నారు. మంత్రులు నాగరాజు, డాక్టర్ సుధాకర్, బైరతి బసవరాజు తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు.

పాఠశాలకు బాంబు బెదిరింపు

యశవంతపుర: పాఠశాలలో బాంబు పెట్టామంటూ బెదిరింపు మెయిల్ రావడంతో విద్యార్థులు హడలిపోయిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. శుక్రవారం రాజాజీనగర ఐదో బ్లాక్‌లోని ఎన్‌పీఎస్ పాఠశాలకు ఓ అపరిచితుడు బాంబు బెదిరింపు మెయిల్ పంపాడు. సంస్థ యాజమాన్యం వెంటనే బసవేశ్వరనగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా వారిని వెంటనే బయటకు పంపించారు. ఏసీపీ రవి నేతృత్వంలో బాంబ్ స్క్వాడ్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎక్కడ బాంబు ఆనవాళ్లు కనిపించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాఠశాల వద్దకు వచ్చారు.

ట్రాక్టర్ బోల్తా..26 మంది విద్యార్థులకు గాయాలు

బనశంకరి: ట్రాక్టర్ బోల్తాపడి 26 మంది విద్యార్థులు గాయపడిన ఘటన ఉత్తరకన్నడ జిల్లా శిరసి తాలూకాలో శుక్రవారం చోటుచేసుకుంది. మొత్తం 90 మంది విద్యార్థులు మళగి నుంచి శుక్రవారం రెండు ట్రాక్టర్లలో ఉత్తరకన్నడకు విహారయాత్ర కోసం విచ్చేశారు. కూళగి వద్ద ఒక ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. 26 మంది గాయపడగా 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను శిరసి పండిత్ ఆసుపత్రికి తరలించారు.

విధానసౌధ షాపింగ్ మాల్

- ప్రియాంక్ ఖర్గే ధ్వజం

శివాజీనగర: విధానసౌధ ఓ షాపింగ్ మాల్‌గా మారిందని, ఇక్కడ పీఎస్ఐ ఉద్యోగాలు, అసిస్టెంట్ ఇంజనీర్ల ఉద్యోగాలు అమ్ముకుంటారని, ఇందులో శాంట్రో రవిలాంటి సంఘ విద్రోహ శక్తులు దళారీలుగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే, కేపీసీసీ అధికార ప్రతినిధి ప్రియాంక్ ఖర్గే ధ్వజమెత్తారు. శుక్రవారం కల్బుర్గిలో విలేకరులతో మాట్లాడుతూ ఒక ఎమ్మెల్యే పీఎస్ఐ నియామకాలకు సంబంధించి రోల్‌కాల్ చేశారు. ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ రూ.10 లక్షల నగదుతో పట్టుబడ్డారు. ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి బీజేపీ హైకమాండ్‌కు మధ్యవర్తి కాగా ఎమ్మెల్యేలు మంత్రులు, అధికారులు ఎమ్మెల్యేలకు మధ్యవర్తులయ్యారని ఆరోపించారు. దీన్నిబట్టి ముఖ్యమంత్రి ప్రభుత్వ పాలన చేస్తున్నట్లు అనిపించటం లేదని, ప్రభుత్వంలో రౌడీ విభాగం ఓపెన్ చేశారని విమర్శించారు. కల్బుర్గి కేడీపీ సభను శనివారానికి వాయిదా వేయటంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రియాంక్, జిల్లా యంత్రాంగానికి కేడీపీ ఎలా జరపాలనేది తెలిసిందో లేదో అర్థం కావటం లేదన్నారు.

16 జిల్లాల్లో అభ్యర్థులను బరిలో నిలుపుతాం

- ప్రజల ఆశీస్సులతో పార్టీని ముందుకు తీసుకెళతాం
- కేఆర్‌పీపీ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి



గాలి జనార్దనరెడ్డికి గజమాలతో సత్కారం

సాక్షి,బళ్లారి: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కళ్యాణ, ఉత్తర కర్ణాటక జిల్లాలతో పాటు తమ పార్టీకి అనుకూలమైన ప్రాంతాల్లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 16 జిల్లాల్లో తమ పార్టీ అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తారని కర్ణాటక రాష్ట్ర ప్రగతి పార్టీ(కేఆర్‌పీపీ) వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం రాయచూరు జిల్లా సింధనూరులో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల భారీ బహిరంగ సమావేశంలో మాట్లాడారు. ముందుగా పీడబ్ల్యూడీ క్యాంపు నుంచి భారీ బైక్‌ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. అనంతరం స్త్రీశక్తి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో, విలేకరులతో ఆయన మాట్లాడుతూ గాలి జనార్దనరెడ్డి అంటే డబ్బుతో రాజకీయాలు చేస్తారని చాలా మంది అనుకుంటారని, అయితే డబ్బుతో కాకుండా ప్రజాశీస్సులతో తాను రాజకీయాలు చేస్తానన్నారు.

ఇక ప్రజాభివృద్ధి కోసం పని చేస్తా

12 ఏళ్లగా తాను వనవాసం చేశానని, ఇక ఊరికే ఇంట్లో కూర్చొని ఉండనన్నారు. ప్రజల మధ్యలో, ప్రజల కోసం , ప్రజాభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. కార్యకర్తలే తన బలం అని, రాజకీయాల్లో ఇక వెనక్కి తగ్గే ప్రశ్నే లేదన్నారు. తాను సామాన్య కానిస్టేబుల్ కుమారుడిని అయినా దేవుడు, జనం ఆశీస్సులతో ఈ స్థాయికి వచ్చానని సగర్వంగా చెబుతున్నానన్నారు. ఏ పార్టీతోను పొత్తు పెట్టుకునే ప్రశ్నే లేదన్నారు. తనను రాజకీయంగా వాడుకుని పక్కన పెట్టిన వారికి జనమే బుద్ధి చెబుతారన్నారు. 16 జిల్లాల్లో కలియతిరిగి పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తానన్నారు. తాను అబద్ధాలు చెప్పేవాడు కాదని, చెప్పింది చేస్తానన్నారు. సింధనూరును సింగపూర్‌లా అభివృద్ధి చేస్తామన్నారు. ఈసందర్భంగా కేఆర్‌పీపీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీల నుంచి కేఆర్‌పీపీలోకి చేరికలు

గంగావతి రూరల్: తాలూకాలోని ఒళబళ్లారి చెన్నబసవ మహా శివయోగి 40వ జాతర అమృత మహోత్సవంలో భాగంగా కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ వ్యవస్థాపకులు గాలి జనార్దనరెడ్డి సువర్ణగిరి విరక్త మఠం సిద్ధలింగ మహాస్వామీజీ ఆశీర్వాదంతో తన కార్యాచరణను ప్రారంభించారు. అనంతరం ఆయన సమక్షంలో కేఆర్‌పీపీలోకి పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేరారు. ఈ సందర్భంగా సింధనూరు రెడ్డి సంఘం అధ్యక్షులు సత్యన్నగౌడ, నెక్కంటి మల్లికార్జున్, రైతునగర్ రామసుబ్బారెడ్డితో పాటు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

బెంగళూరులో చైన్‌స్నాచర్ల హల్‌చల్

యశవంతపుర: బెంగళూరు నగరం ఉత్తర విభాగంలో చైన్‌స్నాచర్లు హల్‌చల్ చేశారు. నాలుగుచోట్ల మహిళల మెడల్లో గొలుసులు లాక్కెళ్లారు. సర్వమంగళ అనే మహిళ ఎంఇఈ వద్ద శుక్రవారం వేకువజామున కాలినడకన వెళ్తుండగా బైకుపై వచ్చిన దుండగులు ఆమె మెడలోని 60 గ్రాముల చైన్ లాక్కొని ఉడాయించారు. అదేవిధంగా రామయ్యలేఔట్ వద్ద ప్రియలక్ష్మి మెడలోని బంగారు చైన్, జేపీ పార్క్ వద్ద జయప్రభ అనే మహిళ మెడలో 50 గ్రాముల బంగారు చైన్, చొక్కసంద్ర వద్ద లలితమ్మ అనే మహిళ మెడలో 45 గ్రాముల బంగారు చైన్ లాక్కొని ఉడాయించారు.